నేడు పాఠశాలలకు సెలవు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో బుధవారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవులు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు కూడా ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నదని తెలిపారు.



- అర్ధరాత్రి నుంచే పశ్చిమ ప్రకాశంపై ప్రభావం
- జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్
- అవసరమైతేనే బయటకు రావాలని సూచన
- అధికారులతో మంత్రి స్వామి సమీక్ష
- రెండు రోజుల్లో 71.10 మి.మీ వర్షపాతం
- ఒంగోలులో 100 మి.మీ కన్నా అధికం
- తూర్పుప్రాంతంలో ముంచెత్తిన వర్షం
- పొలాల్లో చేరిన నీరు

ఉప్పుగుండూరు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు

జిల్లాలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితి ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ప్రధానంగా అర్ధరాత్రి నుంచే పశ్చిమ ప్రకాశంలో భారీవర్షాలు కురుస్తాయని, ఆయా మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకు ఇళ్లకు పరిమితం కావాలని, అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అలాగే తీరప్రాంత మండలాల్లో ఇప్పటికే పునరావాస కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు కొన్నిచోట్ల తరలింపు కూడా చేపట్టారు. బుధవారం విద్యా సంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

రెడ్ అలర్ట్..

నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆమేరకు మంగళవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా పశ్చిమప్రాంతంపై ప్రభావం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కానుంది. కాగా సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 వరకు జిల్లాలో సగటున 51 మి.మీ వర్షపాతం నమోదైంది. సింగరాయకొండ, పొన్నలూరు, ఎన్‌జీపాడు, ఒంగోలు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపితో పాటు పలు మండలాల్లో 80 మి.మీ కంటే అధికంగా కురిసింది.

జిల్లాకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

పరిస్థితిని బట్టి అవసరమైన సహాయక చర్యలలో పాల్గొనేందుకు 30మందితో కూడిన ఒక ఎన్‌డీఆర్ఎఫ్ బృందం కూడా జిల్లాకు వచ్చింది. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించేలా కలెక్టరేట్‌లో 1077 కంట్రోలు రూంను కూడా ఏర్పాటు చేశారు.



ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత

పశ్చిమప్రాంతంపై అర్ధరాత్రి నుంచే..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాలోని పశ్చిమప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం. అర్ధవీడు, దోర్నాల, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, రాచర్ల, ముండ్లమూరు మండలాల్లో అర్ధరాత్రి నుంచి ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) వచ్చే అవకాశం ఉంది. ఆయా మండలాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. పరిస్థితులను బట్టి అవసరమైతే మండల అధికారుల ఆదేశాల మేరకు సహాయక శిబిరాలకు వెళ్లి సురక్షితంగా ఉండాలని ఆమె కోరారు.


18 గ్రామాలపై ప్రభావం

భారీ వర్షాలు జిల్లాలోని తీరప్రాంతాలైన నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లోని 18 గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటి పరిధిలోని 54 ఆవాసాల్లో ఉంటున్న 56,584 మంది ప్రభావితమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ గ్రామాల

మిగతా 6వ పేజీలో



ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తకోట వాగు



ఇన్‌చార్జి మంత్రిగా ఆనం

- విశాఖకు డాక్టర్ స్వామి
- గొట్టిపాటికి రెండు జిల్లాల కేటాయింపు





ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో జిల్లాకు రామనారాయణరెడ్డి నియమితులయ్యారు. పొరుగున ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన రామనారాయణరెడ్డి సీనియర్ రాజకీయ నేత. తెలుగుదేశం, కాంగ్రెస్, వైసీపీలలో కొనసాగిన ఆయన నాటి ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్‌అండ్‌బీ మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ సీఎంగా ఉన్న తొలి కేబినెట్‌లో సమాచారశాఖ మంత్రిగా, రోశయ్య ప్రభుత్వంలో మునిసిపల్ శాఖ మంత్రిగా, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యేక గుర్తింపు ఉన్న నెల్లూరు జిల్లాలోని ఆనం కుటుంబానికి చెందిన రామనారాయణరెడ్డికి సుదీర్ఘ రాజకీయంతో పాటు వివిధ శాఖల మంత్రిగా పనిచేసిన విశేష అనుభవం ఉంది. నెల్లూరు జిల్లాలోని రాపూరు, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి ప్రాతినిథ్యం వహించారు. అలా రాజకీయాల్లో సీనియర్ అయిన రామనారాయణరెడ్డికి

మిగతా 6వ పేజీలో

నీటి సంఘాల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. తొలుత ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు 40 రోజుల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. పది రోజుల క్రితం అందుకు సంబంధించిన ఉత్తర్వులు జిల్లా అధికారులకు అందాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వాటి ఊసే లేక సంబంధిత రికార్డులను కూడా పక్కన పడేసిన జలవనరుల శాఖ అధికారులు తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో వాటిపై దృష్టి సారించారు. అంతేకాక జిల్లాల విభజన కూడా జరగడంతో కొత్త జిల్లాల వారీ సంఘాల గుర్తింపు చేపట్టారు. జిల్లాలో మేజర్, మీడియం, మైనర్ విభాగాలు ఉండగా మొత్తం 341 సాగునీటి సంఘాలు (డబ్ల్యూఏ) ఉన్నట్లు గుర్తించారు. అందులో 241 చిన్న నీటివనరుల, 14 మీడియం, 86 మేజర్ నీటిపారుదల విభాగమైన ఎన్ఎస్‌పీలో ఉన్నట్లు తేల్చారు. అలాగే ఎన్ఎస్‌పీ పరిధిలో 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లు, మీడియం విభాగంలో మూడు ప్రాజెక్టు కమిటీలు ఉన్నట్లు గుర్తించారు. వాటికి ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి జిల్లా యంత్రాంగానికి మంగళవారం సమాచారం వచ్చింది.

డీఎస్‌వోగా పద్మశ్రీ బాధ్యతల స్వీకరణ



డీఎస్‌వో పద్మశ్రీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో)గా పద్మశ్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఆమెను డీఎస్‌వోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె మంగళవారం కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అలాగే కలెక్టర్ తమీమ్ అన్సారియాను మంగళవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా పద్మశ్రీని పౌరసరఫరాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రెండో రోజూ అదే జోరు

- ఉత్సాహంగా పల్లె పండుగ
- పలుచోట్ల ముఖ్య నేతలు హాజరు

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం రెండో రోజైన మంగళవారం కూడా అదే జోరుతో కొనసాగింది. అన్ని ప్రాంతాల్లోనూ కీలక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులకు భూమిపూజ చేశారు. తుఫాన్ నేపథ్యంలో చాలాప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొంత ప్రతికూల పరిస్థితి ఉంది. అయినప్పటికీ అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలు కావడం, ముఖ్య నేతలు వస్తుండటంతో గ్రామాల్లోని ప్రజానీకం, ప్రత్యేకించి తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగానే పాల్గొంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు వారివారి నియోజకవర్గాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూరల్ మండలంలోని ఉలిచి, కరవది, చేజర్ల గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హనుమంతునిపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నందనవనం గ్రామాల్లో పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలం రాయవరం, కొలభీమునిపాడు, పెద్దనాగులవరం, బోడపాడు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరయ్యారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాచర్ల మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి దర్శి మండలం శామంతపూడి, జముకులదిన్నె, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లోనూ, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పెద్దారవీడు మండలంలోని పలు గ్రామాల్లో పాల్గొన్నారు.



చేజర్లలో పల్లెపండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్



నందనవనం పంచాయతీలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర




MM$Y

- నేటి నుంచి కొత్త పాలసీలో మద్యం విక్రయాలు
- బడి, గుడికి 100 మీటర్ల దూరంలో షాపు
- తగ్గిన ప్రీమియం బ్రాండ్ల ధరలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ ప్రకారం విక్రయాలకు అంతా సిద్ధమైంది. నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది. ప్రీమియం బ్రాండ్లు తక్కువ ధరకు ఇవ్వనున్నారు. ప్రైవేటు షాపులలో మద్యం విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. 171 మద్యం దుకాణాలకు ప్రొవిజనల్ లైసెన్స్‌లు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వారు విక్రయాలను

మిగతా 6వ పేజీలో



ఒక పంచాయతీ.. ఇద్దరు కార్యదర్శులు

- ఇరువురూ విధులకు హాజరు
- సిఫార్సు లేఖలు ఇచ్చిన నియోజకవర్గ నేత
- పెద్దారవీడు మండలంలో విచిత్ర పరిస్థితి

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక పంచాయతీకి ఒక కార్యదర్శి ఉంటారు. అది పద్ధతి. కానీ అధికారుల నిర్లక్ష్యం, అధికార పార్టీ నేతల చేతివాటంతో పెద్దారవీడు మండలంలోని ఓ పంచాయతీకి మాత్రం ప్రస్తుతం ఇద్దరు కార్యదర్శులు వచ్చారు. ఇరువురూ హాజరు పుస్తకంలో సంతకాలు చేస్తున్నారు. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగినిని ప్రస్తుతం మరో చోటుకు వెళ్లాలని మండల స్థాయి అధికారి ఆదేశించడంతో ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌తోనే తాను విధుల్లో

మిగతా 6వ పేజీలో







వైద్యుడి ఇంట్లో చోరీ

- రూ.15 లక్షల సొత్తు అపహరణ

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ వైద్యుడి ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 15లక్షల విలువైన ఆభరణాలు అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన స్థానిక కర్నూలురోడ్డులోని సాయినగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. రిమ్స్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న సుబ్బారావు, ఆయన భార్య ఆదివారం ఇంటికి తాళం వేసి బాపట్లకు వెళ్ళి తిరిగివచ్చారు. వారు తమ వెంట బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి శుభకార్యంలో పాల్గొన్న తరువాత వాటిని బ్యాగ్‌లో పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి తిరిగి ఒంగోలు వచ్చి వారు తమ బ్యాగ్‌లను హాలులోనే ఉంచి బెడ్‌రూంలో పడుకున్నారు. తెల్లవారి లేచి చూసే సరికి బంగారపు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. అదే సమయంలో బాపట్లలో శుభకార్యానికి వెళ్ళిన చోట మరిచిపోయి ఉండవచ్చునని భావించి అక్కడా వెతికారు. అయితే మంగళవారం ఉదయం అభరణాలు ఉన్న బ్యాగ్ సుబ్బారావు ఇంటి సమీపంలో కాలువలో కనిపించింది. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసులు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించి అక్కడ ఆధారాలు సేకరించారు. చోరీ జరిగి రెండురోజులు గడవటం, వర్షం పడటం కారణంగా అధారాలు లభ్యం కాలేదని తెలుస్తోంది. ఆ బ్యాగ్‌లో సుమారు 22 సవర్ల బంగారం ఆభరణాలు ఉన్నట్లు బాధితుడు సుబ్బారావు తెలిపారు. తాలుకా సీఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు యంత్రాంగం సిద్ధం

- ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యం లో జిల్లా పోలీస్‌యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు ఎస్పీ దామోదర్ మంగళవారం తెలిపారు. రానున్న 48గంటలలో భారీ వర్షాలు పడే సూచన నేపథ్యంలో పోలీసులు సహాయక చర్యలు అందించడానికి సన్నద్ధం చేశామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో తక్షణ సహాయం కోసం 112, లేక 9121102266 నంబర్లకు ఫోన్ చేయాలని, విపత్కర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రా‘నైట్’ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- రెండు కంటైనర్లు సీజ్



కంటైనర్లను పట్టుకున్న అధికారులు

చీమకుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీరో బిల్లుతో గ్రానైట్ శ్లాబులను రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుండటంతోబాటు, సదరు వా హనాల నుంచి డబ్బులు వసూలు చేస్తూ అక్రమ రవాణాదారులు నిర్వహిస్తున్న దందాపై మైనింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే నిమిత్తం నియమించిన స్పెషల్ మొబైల్ పార్టీ అధికారులు సోమవారం అర్ధరాత్రి బూదవాడ ప్రాంతం నుంచి బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులతో రవాణా అవుతున్న రెండు కంటైనర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని సీజ్ చేశారు. ఆదిత్య గ్రానైట్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మీశ్రీనివాస గ్రానైట్ ఫ్యాక్టరీలకు చెందిన వాహనాలు బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదుచేసి తదుపరి చర్యలను అధికారులు చేపట్టనున్నారు. ఈ తనిఖీల్లో మైనింగ్ అధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజునాయుడు పాల్గొన్నారు. గ్రానైట్ శ్లాబుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని జిల్లా మైనింగ్ శాఖఅధికారి రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు వరద ఉధృతి



దిగువకు పోతున్న నీరు

మద్దిపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి మంగళవారం వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు భారీగా వర్షపునీరు ప్రాజెక్టులోనికి చేరుతోంది. 7 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా మూడు గేట్లు ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగే కొద్దీ మరో గేటు ద్వారా నీటిని బయటకు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కారు, మోటార్‌సైకిల్ ఢీకొని యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రోవగుంట ఆటోనగర్ వద్ద మంగళవారం జరిగింది. ఒంగోలు వైపు నుంచి బాపట్ల వెళ్లే కారు బ్రేకులు ఫెయిలవడంతో అదుపుతప్పి మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒంగోలు నగరం భాగ్యనగర్‌కు చెందిన ఆరబోలు రవిశంకర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుణ్ణి చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.





భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా చూడాలి : కలెక్టర్

● అధికారులతో కలిసి శివారు కాలనీల్లో పర్యటన


పోతురాజుకాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు నిలువకుండా కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశించారు. మంగళవారం నగరంలోని పోతురాజుకాలువ, కొప్పోలు రోడ్, జర్నలిస్ట్ కాలనీతో పాటు పలు శివారుకాలనీల్లో కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలోని ఐదు కోస్తా మండలాలు ఉన్నాయని, వాటి పరిధిలో 53 హాబిటేషన్ సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. పదిహేను పునరావాస కేంద్రాలను గుర్తించగా ఇందులో ఐదు కేంద్రాలు ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చి సోమవారం నుంచి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో 75 మి.మీ వర్షం పడిందని, వాగులు, కల్వర్టులలో నీరు వెళ్లేందుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాగులు, వంకల్లో, సైడుకాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలు, వార్డు ఎమెనిటీ, శానిటేషన్ సెక్రటరీలను నియమించి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోవాలి

స్థానికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి


మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికార యంత్రాంగం సన్నద్ధమవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పేర్కొన్నారు. ఆదిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా జిల్లాలోని పరిస్థితి, లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వివిధ సేవలకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. ఆయా అంశాలపై స్వామి మాట్లాడుతూ వచ్చే మూడు రోజుల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత మేరకు నివారించాలన్నారు. ఇటీవల బదిలీలు జరిగినందున మండల స్థాయి అధికారులు కొత్తగా వచ్చారని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులను ఆదుకుంటామని మంత్రి పేర్కొన్నారు. చేపల వేటకు వెళవద్దని ప్రభుత్వం హెచ్చరించినందున మత్స్యకారులతో పాటు భృతి కోల్పోయిన వారికి సాయం అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ప్రధానంగా కాజ్‌వేలపై నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు వాటిపై రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడటంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబల కుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు 700 విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామని, అందుకు అవసరమైన 300మంది కార్మికులను సిద్ధంగా ఉంచామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ బేబిరాణి, బాలశంకరరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, గోపీచంద్, పి.శ్రీనివాసప్రసాద్, జి.వెంకటనాయుడు, సుశీల, శ్రీనివాసులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోలు రూమును మంత్రి డాక్టర్ స్వామి పరిశీలించారు. విపత్తు నిర్వహణశాఖ డీపీఎం మాధురి ఆధ్వర్యంలో 24గంటల పాటు పనిచేసేలా ఈ కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

ముంపు ప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం ● కొత్తపట్నంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం ● అధికారులతో కలిసి పరిశీలన


పునరావాసకేంద్రంలో ఉన్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలునగరం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలంలో భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో పలుకాలనీల ప్రజలను రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. మంగళవారం తహసీల్దారు మధుసూదనరావు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొత్తపట్నంలోని జడ్పీ హైస్కూలు, టీఎల్ఎన్ స్వామి జూనియర్ కళాశాలలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా గంగమ్మకాలనీ, ఇతరకాలనీకి చెందిన 120మందిని అక్కడికి తరలించారు. వారికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పునరావాస కేంద్రాలను పరిశీలించి అందులో ఉన్న నిర్వాసితులతో మాట్లాడారు. భారీ వర్షాలు తగ్గేవరకు ఇక్కడే ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. తీర ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. వారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేశామని తహసీల్దార్ మధుసూదనరావుకు సూచించారు.

దెబ్బతిన్న ఇళ్లు..

కాగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిని పోయాయి. కొన్ని కూలి పోగా మరికొన్ని ప్రమాద స్థితికి చేరుకున్నాయి. తహసీల్దార్ మధుసూదనరావు కొత్తపట్నం, ఈతముక్కల గ్రామాల్లో కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. వారిని వెంటనే పునరావాసకేంద్రాలకు తరలించారు.

వంతెనలపై వరద ఉధృతి

కాగా ఒంగోలు-కొత్తపట్నం, ఈతముక్కల-ఒంగోలు, కొప్పోలు-మోటుమాల మార్గాల్ల ఉన్న వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక ప్రమాదకరంగా ఉన్న సూరారెడ్డిపాలెం-ఈతముక్కల మధ్య బకింగ్‌కెనాల్‌పై భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. సిబ్బందిని నియమించి భారీ వాహనాల రాకపోకలను దారి మళ్లించారు.

గర్భిణుల వివరాల సేకరణ

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విపత్కర సమయాల్లో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు, వైద్యసేవలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామాల్లో ఉన్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ద్వారా రెవెన్యూ సిబ్బంది పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆయా గ్రామాలకు రాకపోకలు తెగిపోతే వారికి వైద్య సహాయం అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇరిగేషన్ కార్యాలయం మునక

● వర్షపు నీటితో చెరువులా మారిన వైనం


వర్షపునీటితో మునిగిన కార్యాలయం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరిగేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వరిస్తున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వానకు కార్యాలయం మొత్తం నీట మునిగి ముఖ్యమైన ఫైళ్ళన్నీ తడిచిపోయాయి. ఇక ఉద్యోగులు సైతం కార్యాలయంలోకి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. కార్యాలయం చుట్టూ వర్షపు నీరు మోకాళ్ళలోతు నిలబడటంతో బిక్కు బిక్కుమంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే ఇరిగేషన్‌కు సంబంధించిన స్థలం గత వైసీపీ ప్రభుత్వం వైసీపీ జిల్లా కార్యాలయానికి ఇవ్వడంతో ప్రస్తుతం వారికి డ్రైనేజీ సమస్య ఎదురైంది. వర్షపు నీరు గతంలో దక్షిణం వైపు బైపాస్ రోడ్‌లోని ప్రధాన డ్రైన్‌లోకి వెళ్ళేది. ప్రస్తుతం ఆ వైపు వైసీపీ కార్యాలయం కట్టి ప్రహరీ నిర్మించడంతో నీరు పోయే దారి మూసుకుపోయింది. అదేవిధంగా ఇరిగేషన్‌కు తూర్పువైపున ప్రాజెక్టుల కార్యాలయం, పడమర వైపున పీఏవో (పే అండ్ అకౌంట్ ఆఫీస్), ఉత్తరం వైపు అసంపూర్తిగా కట్టి పిల్లర్ల దశలో వదిలేసిన భవనం ఉండటంతో ఇక వర్షం పడితే చుక్కనీరు బయటకు పోయే మార్గం లేక చెరువును తలపిస్తోంది. ఇప్పటికే ఏళ్లనాటి కట్టడం కావడంతో ఇప్పుడు కూలుతోందో తెలియని పరిస్థితి ఉండగా, వర్షం వస్తే కార్యాలయంలోకి నీచేరడంతో పాటు పాములు, విష పురుగులు వస్తున్నాయి. గతంలో కార్పొరేషన్ అధికారులకు సమస్యపై వినతిపత్రం అందించామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండపిలో భారీ వర్షం

కొండపి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో మూడు రోజుల నుచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ముసి, అట్లేరు, ఇతర వాగుల్లో నీటి ఉధృతి పెరిగింది. ముసిపై ఉన్న చెక్‌డ్యాంలు నిండాయి. జరుగుమల్లి మండలంలోని పైడిపాడు, పొన్నలూరు మండలంలోని వేంపాడు గ్రామాల మధ్యన పాలేరు లోతుగా ఉంది. ఇక్కడ వర్షపు నీరు అధికంగా చేరడంతో రాకపోకలు సాగించకుండా జరుగుమల్లి మండల రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచారు. వాహనదారులు, పాదచారులు పాలేరు నుంచి వెళ్లకుండా వారిని మంగళవారం ఉదయం నుంచి వెనక్కి పంపిస్తున్నారు. మండలంలోని చినవెంకన్నపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం ఓ వేపచెట్టు రోడ్డుపై పడింది. కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో చెరువు ఒడ్డున గుడిసెల్లో నివాసం ఉంటున్న వారి ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.అంకయ్య మంగళవారం ఉదయం జేసీబీ సాయంతో కాలువ చేసి నీటిని చెరువులోకి మళ్లించారు.

వాగుల వద్ద భద్రత

పొన్నలూరు(కొండపి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల అధికారులు పాలేరు తీర గ్రామాల్లోని వాగులు, చప్టాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె, ముప్పాళ్ల గ్రామాల వద్ద పాలేరులో నీటి ఉధృతిని తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో పి.సుజాత, పీఆర్ ఏఈ కోటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు.

సెలవులో డీఈవో

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర వ్యక్తిగత కారణాలతో వారం రోజుల పాటు సెలవులో వెళ్ళారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి డీఈవోగా మైనంపాడు డైట్ సీనియర్ లెక్చరర్ సామా సుబ్బారావుకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే సోమవారం డీఈవో సుభద్ర విధులకు హాజరుకానున్నారు.

టెట్ పరీక్షకు 116మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఏపీ ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షకు 116 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను గాను రెండు పరీక్షా కేంద్రాల్లోనూ ఈ పరీక్షలు జరిగాయి. ఒంగోలులోని ఎస్‌సీఎస్ఐఎస్, బ్రిలియంట్‌లో పరీక్షలు జరగ్గా మార్కాపురంలోని రెండుకేంద్రాల్లో పరీక్ష జరగలేదు. పరీక్షకు 669మంది అభ్యర్థులను కేటాయించగా 553మంది హాజరయ్యారు. ఉదయంసెషన్‌కు 334మందికి 273, మధ్యాహ్నం సెషన్‌కు 335కి 280మంది పరీక్షకు హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

మద్దిపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎంపీడీవో వి.జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని సీతారామపురంలోని రాజులకాలనీలో రూ.10లక్షలతో సైడ్ కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా మంగళవారం ఆయా పనులను టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ శివానందరావు, మండవ గోపీచంద్, మారెళ్ల హరికుమార్, తొర్రికొండ కిరణ్, చింతల శ్రీనివాసరావు, పి.షరీఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాగుంట జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సీతారాంపురంలోని వృద్ధాశ్రమంలో జనసేన యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేశారు. మాగుంట సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల కళ్యాణ్, రాఘవ, వాసవి అంకబాబు, పవన్, నరసింహారావు, తాళ్శూరి సాయికుమార్, బెజవాడ గణేష్, క్రాంతి, మురళీకృష్ణ, కుంచాల ప్రకాష్, రాజేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీపడాలి : దామచర్ల


ఉలిచిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీపడాలని, వచ్చే ఆరు నెలల్లో ఈ మార్పు కన్పించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలు మండలంలోని ఉలిచి, కరవది, చేజర్ల గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కరవదిలో రూ.1.30కోట్లు, ఉలిచిలో రూ.15లక్షలతోను, చేజర్లలో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఉలిచిలో స్థానికులు మాట్లాడుతూ ఎస్సీకాలనీకి చెందిన శ్మశానం చిలచెట్లతో నిండిపోయిందని, బాగు చేయించాలని కోరారు. ఉలిచి ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు చోరీ చేశారని, నూతనంగా మరొకటి ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఎమ్మెల్యే కరవదిలోని పీహెచ్‌సీని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యశాలకు ప్రహరి, సమావేశం భవనం నిర్మించాలని వైద్యులు కోరారు. ఇక చేజర్లలో గ్రామస్థులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తప్పులు జరిగాయని, వాటిని సరిచేయాలని కోరారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పోలవరపు వెంకటరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నలమోతు బాల గంగాధర్, చుంచు శేషయ్య, పాతూరి పూర్ణచంద్రరావు, గద్దె వెంకటకృష్ణ, పిల్లుట్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగరం జలమయం

● కార్పొరేషన్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు


డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఒంగోలు నగరం తడిసి ముద్దయ్యింది. నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, మరోవైపు రోడ్లు కూడా సక్రమంగా లేని కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా కాగా కలెక్టర్ ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారీ వర్షం నేపథ్యంలో కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు టోల్‌ఫ్రీ నెం. 08592-232858/1800-4252858కు కాల్ చేయాలని కోరారు. అలాగే క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేశామని, పారిశుధ్యం, తాగునీరు, పడిపోయిన చెట్లు తొలగింపు కోసం 25మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఇక లోతట్టు ప్రజల కోసం ముందస్తుగా 13తుఫాన్ సహాయ కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా కాలనీలకు 41 ట్యాంకర్లతో నీటి సరఫరా, ఇక రోగాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో కుండపోత


కనపర్తిలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

హనుమాపురంవాగు

నాగులుప్పలపాడు: అల్పపీడన ప్రభావంతో మంగళవారం మండలంలో కుండపోత వర్షాలు కురిశాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వానలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులోని హనుమాపురం, కొత్తకోట వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చికుకున్నాయి. ఇక రహదారిలో రెండో రోజు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా వాగుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కనపర్తి తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మహాలక్ష్మి ఉప్పుగుండూరులోని ఎస్టీకాలనీ, ఇందిరా కాలనీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గ్రామంలోని నాగన్నవాగు, ఎస్టీకాలనీలోని వాగులను పరిశీలించారు. మాచవరం-ఉప్పుగుండూరు రోడ్డులోని నేలచప్టాపైకి వరదనీరు చేరడంతో అటువైపుగా రాకపోకలు స్తంభించాయి. నాగులుప్పలపాడు సమీపంలోని మిరప, నువ్వు, టమోటా పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఉప్పుగుండూరులోని జాతీయ రహదారి వద్ద నీలాయపాలెం రోడ్డుకు ఇరువైపులా భారీగా వరదనీరు చేరింది. నాగన్నవాగు పొంగి రోడ్డుపైకి వరద చేరడంతో ఆ ప్రాంతమంతా సముద్రంగా మారింది. పోలీసులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. ఇంకొల్లు సీఐ రమణయ్య ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఉప్పుగుండూరులోని రెండు ఊరచెరువులు నీటితో ఏకమయ్యాయి.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: అల్పపీడన ప్రభావంతో మద్దిపాడు మండలంలో మంగళవారం వేకువజాము నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం 11 గంటల సమయంలో కొంచెం తెరపి ఇచ్చింది, మద్దిపాడు ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాలు వర్షపునీటితో నిండిపోయాయి. హైవే వెంట సర్వీసు రోడ్లు జలమయం కాగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక అరుంధతినగర్‌లోని రోడ్డు నీట మునిగింది. గుండ్లాపల్లి జడ్పీ పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిలిచింది. వర్షాలకు పత్తి చేలోకి నీరు చేరటంతో రైతులు బయటకు పంపటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వల్ల పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మద్దిపాడు హైవే సర్వేసురోడ్డులో నిలిచిన వర్షపునీరు

సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన రాజు, కుమారి (పేర్లు మార్చి ఇస్తున్నాం) దంపతులు. రాజు బేల్దారి మేస్త్రి. కుమారి గృహిణి. వీరికి తొలి కాన్పులో నెలలు నిండాక అక్టోబరు 7న కుమారుడు పుట్టాడు. రెండేళ్లకు మళ్లీ గర్భిణి అయ్యింది. రెండో బిడ్డను కూడా అక్టోబరు 7నే కనాలని ఆ దంపతులు భావించారు. వైద్యులపై ఒత్తిడి చేసి 8 నెలలకే కాన్పునకు సిద్ధపడి తొలి బిడ్డను కన్న రోజునే సిజేరియన్ చేయించారు. శిశువును రెండు వారాలు ఇంక్యుబేటర్‌లో ఉంచారు.

ఒంగోలుకు చెందిన సుబ్బారావు దంపతులు స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న తమ బిడ్డ జన్మించాలని భావించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ బిడ్డకు 9 నెలలు నిండేందుకు ఇంకా వారం రోజులు ఉన్నప్పటికీ ఆగస్టు 14న అర్ధరాత్రి 12.05 గంటలకు కాన్పు చేయాలని వైద్యులపై ఒత్తిడి చేసి నెలలు నిండక ముందే సుబ్బారావు తన భార్యకు కాన్పు చేయించారు.

పొదిలికి చెందిన ఓ టీచర్ తమ మొదటి సంతానం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందడంతోపాటు, తమకు పుట్టబోయే బిడ్డ తమ తల్లిదండ్రుల పెళ్లి రోజుకు గుర్తుగా, జూన్ 10వ తేదీన పుట్టేలాగా ముహూర్తం నిర్ణయించుకున్నారు. వైద్యులను బతిమాలుకొని నెలలు నిండక ముందే డెలివరీ చేయించారు.

- ముఖ్యతేదీలు, ప్రముఖ దినోత్సవాలు.. ఒకే రోజు జన్మదినాల కోసం ఆరాటం
- తల్లీబిడ్డలకు అనారోగ్యమంటున్న వైద్యులు
- అవగాహన కార్యక్రమాలు అవసరం
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే సాధ్యం





పుట్టే శిశువుకూ సమస్యే

శస్త్ర చికిత్స ద్వారా ముందస్తు ప్రసవంతో పుట్టే బిడ్డ తక్కువ బరువుతో ఉంటుంది. ఊపిరితిత్తులు సరిగా ఎదగకపోవడతో శ్వాసకోశ సమస్యలొస్తాయి. ఎన్ఐసీయూలో చేర్చాల్సి వస్తుంది. కొన్నిసార్లు కామెర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు. పుట్టిన తరువాత కూడా రోగనిరోధక శక్తి మిగతావారికి కంటే తక్కువగా ఉంటుంది. భవిష్యత్తులో చిన్నచిన్న సమస్యలకే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది. వారు జీవిత కాలం రకరకాల జబ్బుల బారిన పడతారు. ఇందుకు తల్లిదండ్రులే కారణమవుతారు.

ముందస్తు ప్రసవంతో అనర్థాలివే

గర్భిణి నెలలు నిండక ముందే ప్రసవిస్తే అనేక అనారోగ్య సమస్యలుండే అవకాశముంది. భవిష్యత్‌లో సాధారణ కాన్పునకు అవకాశాలు కోల్పోవచ్చు. అవసరం లేకపోయినా, శస్త్ర చికిత్స చేయడం వల్ల తల్లి ఆరోగ్యానికి, ప్రాణానికి హాని కలుగుతుంది. తల్లిపాలు సరైన సమయంలో పుట్టిన బిడ్డకు అందే అవకాశం ఉండదు. మరోముఖ్యమైన విషయం తల్లీబిడ్డకు ప్రమాదకర ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉంటుంది.

మాతృత్వానికి ఓ ముహూర్తం

జాతకాలతో ముందస్తు ప్రసవాలపై ఆసక్తి | ఇటీవల పెరిగిన నూతన పోకడ

తల్లి గర్భంలో నవమాసాలు ఎదిగిన శిశువు నిండు ఆరోగ్యంగా జన్మిస్తారు. అలా జన్మించాల్సిన బిడ్డలు కొందరి తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దల అత్యుత్సాహం, మూఢత్వం కారణంగా నెలలు నిండకముందే బాహ్యప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు. పది మంది గుర్తింపు కోసం కొందరు.. ఇంట్లో బిడ్డల పుట్టినరోజు ఒకే తేదీన రావాలని మరికొందరు.. పుట్టినరోజుకు ఒక ప్రత్యేక దినోత్సవం ఉండాలని ఇంకొందరు... ఫలానా నక్షత్రాన పుడితే మహాత్ములవుతారనే మూఢత్వంతో మరికొంత మంది తల్లిదండ్రులు అజ్ఞానంతో ముందస్తు ప్రసవాలకు సిద్ధపడుతున్నారు. ఇటీవల ఇటువంటి ఒత్తిళ్లు డాక్టర్లపై ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే క్రమంలో వారికి తెలియకుండానే ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. నెలలు నిండకముందే ప్రసవాలతో తల్లీబిడ్డలకు ఉండే ప్రమాదాలపై అవగాహన కల్పించేదే ఈ కథనం..

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతకాలు, నక్షత్రాల నమ్మకాలతో ముందస్తు ప్రసవాలపై ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఊరంతా పండుగలా జరుపుకునే ఆగస్టు 15, జనవరి 1, పూర్వీకులు, పెద్దల పెళ్లిరోజు, పుట్టిన రోజులను గుర్తుండిపోయేలా వేడుకలను నిర్వహించుకోవడం సర్వసాధారణమైంది. ఈ తరహా ముందస్తు ప్రసవాల సాంప్రదాయం కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది.

600 ప్రసవాల్లో సగానికిపైగా సిజేరియన్లే

జిల్లాలోని 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 2 పీపీ యూనిట్‌లు, 3 ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా వైదశాల, ఒక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఒక మాతా శిశు వైద్యశాల ఉన్నాయి. జిల్లాలో 250కి పైగా ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. అన్ని ఆస్పత్రుల్లో కలిపి ఈ పది నెలల్లో దాదాపు ఆరువేల ప్రసవాలు జరిగాయి. వీటిలో సగానికిపైనే సిజేరియన్లు. ఎలాగూ ఆపరేషన్ కాబట్టి తమను అనుకూలమైన తేదీల్లో, ఇష్టమైన రోజుల్లో కాన్పు చేయిస్తే బాగుంటుం దని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. కొన్నిచోట్ల నవమాసాలు నిండాకే ప్రసవం చేయాల్సి ఉన్నా తల్లిదండ్రులు ఒత్తిడికి తలొగ్గి ముందస్తు ప్రసవం చేయాల్సి వస్తోందని వైద్యులు వెల్లడిస్తున్నారు. శిశువు శరీరంలో అన్ని అవయవాలూ పూర్తి స్థాయిలో వృద్ధి చెందాలంటే 39 వారాలు సమయం పడుతుంది. అప్పుడు శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుంది. కానీ ముందస్తు ప్రసవాలతో తల్లీబిడ్డలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఒకవైపు సాంకేతికంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నా, నిరక్షరాస్యులతోపాటు అక్షరాస్యులు, ఉద్యోగులు దృష్టి సారించడం భవిష్యత్‌ను కలవరపెడుతుందని చెబుతున్నారు.

ముందస్తుకు కారణాలివే..

బిడ్డకు మంచి భవిష్యత్ ఉంటుందన్న నమ్మకంతో తిథులు, వారాలు, నక్షత్రాలు, పుట్టబోయే బిడ్డపై ప్రభావాన్ని చూపుతున్నా యని తల్లిదండ్రులు విశ్వసిస్తున్నారు. ప్రత్యేక రోజులు, ప్రము ఖుల జన్మదినాలు రోజున బిడ్డకు జన్మనివ్వాలని ఉవ్విళ్లూరుతున్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం



ముందస్తు ప్రసవాలు కారణంగా తల్లీ, బిడ్డ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. నెలలు నిండిన తర్వాత మాత్రమే కాన్పు జరగాలి. అలా జరగకపోతే నొప్పులు రావడానికి ఇంజెక్షన్‌లు వాడాల్సి వస్తుంది. దానివల్ల బిడ్డకు శ్వాస అందక ఆక్సిజన్ పెట్టాల్సి వస్తుంది.

- డాక్టర్ చాపల శాంతకుమారి, గైనకాలజిస్ట్, ఒంగోలు

ప్రభుత్వం అవగాహన కల్పించాలి



తిథులు, నక్షత్రాలు, జాతకాలు చూసి బిడ్డను కనడం అవివేకం. దీనిపై వైద్యులతోపాటు ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ముందస్తు ప్రసవాల నివారణకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నిర్వాసితులకు త్వరగా పరిహారం చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న ఆదేశించారు. అమరావతి నుంచి మంగళవారం సంబంధిత రైలుమార్గం వెళ్తున్న జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్‌గోపాలకృష్ణలు పాల్గొన్నారు. కనిగిరి, పామూరు మండలాల్లో భూసేకరణ ప్రక్రియ, పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆయన ఆరా తీశారు. వారంలోపు ఈ సమస్య పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రద్యుమ్న ఆదేశించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ విభాగ సూపరింటెండెంట్ సంజీవరావు తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి మంత్రిగా ఆనం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులపై అవగాహనతో పాటు పలువురు నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

ఇన్‌చార్జి మంత్రి చాలా కీలకం

జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిని విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ఉమ్మడి జిల్లాలోని అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో సీనియర్ నేత, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రెండు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రిగా నియమితులయ్యారు. ఆయనను పల్నాడుతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రిగా ప్రభుత్వం నియమించింది. జిల్లాలో పాలనా వ్యవహారాల్లో ఇన్‌చార్జి మంత్రి పాత్ర చాలా కీలకం. జిల్లాలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేయడం, ప్రభుత్వం నుంచి జిల్లాకు అవసరమైన సహకారం త్వరగా అందేలా చేయడంలో ఇన్‌చార్జి మంత్రి కీలకంగా ఉంటారు. తద్వారా ప్రభుత్వ పథకాలు త్వరితగతిన ప్రజలకు అందేలా చేయడం, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిలో ప్రధాన పాత్ర వహిస్తారు.

రెడ్ అలర్ట్

(5వపేజీ తరువాయి)

పరిధిలో పక్కాగృహాలు 9,860, సెమీ పక్కాగృహాలు 3,677, కచ్చా ఇళ్లు 1,058 ఉన్నట్లు గుర్తించారు. ఈ మండలాల్లో 33 పునరావాస కేంద్రాలను ముందస్తుగా గుర్తించడంతో పాటు ఇప్పటికే ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వాటిల్లో 214 మందికి ఇప్పటికే ఆశ్రయం కల్పించినట్లు పేర్కొన్నారు. రెడ్ అలర్ట్ దృష్ట్యా అత్యవసరమైతేనే తప్ప ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని కలెక్టర్ కోరారు.

నాడు-నేడు ఇక మనబడి-మన భవిష్యత్

పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. నాడు-నేడు పథకం పేరును మనబడి- మన భవిష్యత్‌గా మార్చారు. ఈ మేరకు బ్యాంకు ఖాతాల్లో మార్చమని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల యాజమాన్య కమిటీలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించి కొత్తవి ఎన్నుకున్నారు. మనబడి నాడు-నేడు జాయింట్ చెక్ హోల్డర్‌గా ఉన్న ఎస్‌ఎంసీ సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన వారు జాయింట్ చెక్ హోల్డర్‌గా బ్యాంకు ఖాతాల్లో పేర్లు మార్పు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు బ్యాంకు ఖాతాల్లో ఈ మార్పులను వెంటనే చేయమని పేర్కొన్నారు.

ఒక పంచాయతీ.. ఇద్దరు కార్యదర్శులు

(5వ పేజీ తరువాయి)



దుద్దేల రామకోటమ్మకు జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్ కాపీ



ఇద్దరూ విధులకు హాజరైనట్లు సంతకాలు చేసిన రిజిస్టర్

చేరినట్లు ఆమె చెబుతుండటం చర్చనీయాంశమైంది. పద్ధతి ప్రకారం తాను విధుల్లో చేరినా మరో ఉద్యోగిని కూడా అక్కడకే ఎలా పంపారని ఆమె మండల అధికారిని ప్రశ్నిస్తే నియోజకవర్గ నేత వద్దన్నారని సమాధానం ఇచ్చారు. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగికి కూడా నియోజకవర్గ నేత సిఫార్సు లేఖ ఇవ్వడం గమనార్హం. మండలస్థాయి అధికార పార్టీ నేత ఒకరు చేతివాటం చూపి ఈ వివాదానికి కారణమైనట్లు చర్చ జరుగుతోంది.

● 7వ తేదీన ఒకరు.. 8న మరొకరు

పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఈ నెల 7వ తేదీన దుద్దేల రామకోటమ్మ విధుల్లో చేరారు. ఆమె పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పుచ్చకాయలపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. ఆమె అధికార పార్టీ నియోజకవర్గస్థాయి నేత వద్ద తీసుకున్న సిఫార్సు లేఖతోనే జిల్లా పంచాయతీ అధికారులు బదిలీ చేశారు. గంటవానిపల్లిలో రిలీవ్ అయిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దారవీడు ఎంపీడీవో అనుమతితో పుచ్చకాయలపల్లిలో విధుల్లో చేరారు. ఏమైందో ఏమో ఆ మరుసటి రోజునే 8వ తేదీన బి.చిన్నమంత్రునాయక్ అనే ఉద్యోగి కూడా పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. అతను కూడా నియోజకవర్గ నేత సిఫార్సుతోనే అదే పంచాయతీకి బదిలీ అయ్యారు. కొద్దిరోజులుగా ఇద్దరు గ్రామ సచివాలయానికి వెళ్లి హాజరుపట్టికలో సంతకాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎవరి వద్దకు వెళ్లి పనిచేయించుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

● మండలస్థాయి నాయకుని చేతివాటం

పుచ్చకాయలపల్లి గ్రామ పంచాయతీకి బదిలీపై వచ్చిన ఇద్దరికీ నియోజకవర్గ నేత ఇద్ద సిఫార్సు లేఖలు ఇప్పించింది ఓ మండలస్థాయి నాయకుడేనని చర్చ జరుగుతోంది. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగికి పలు గ్రామాల నాయకులు చెప్పడంతో ఆగస్టులోనే సిఫార్సు లేఖ ఇప్పించారు. సెప్టెంబర్‌లో బదిలీల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మరో ఉద్యోగికి కూడా సిఫార్సు లేఖను అందించారు. తొలుత లేఖను తీసుకున్న రామకోటమ్మ అన్ని ఆర్డర్స్ తీసుకుని పుచ్చకాయలపల్లిలో ఉద్యోగంలో చేరారు. కానీ ఎలాంటి ఆర్డర్స్ లేకుండానే చిన్నమంత్రునాయక్‌ను మండలస్థాయి నేత చక్రం తిప్పి విధుల్లో చేర్చారని చర్చ నడుస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు అప్పట్లో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి ఒకే పోస్టులో ఇద్దరినీ చేర్చుకున్నారు. మండలస్థాయి అధికార పార్టీ నేతకు చేతులు తడపడంతోనే ఈ వ్యవహారం నడిపినట్లు పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో కీలక నాయకుడు కావడంతో నియోజకవర్గస్థాయి నేత కిమ్మనకుండా సిఫార్సు లేఖలు ఇస్తున్నట్లు అధికార పార్టీలోనే అంతర్గత చర్చ నడుస్తోంది.

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఇద్దరూ విధుల్లో ఉన్న విషయాన్ని ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేశాం. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డి ఇద్దరినీ చేర్చుకోవడంతోనే ఈ సమస్య తలెత్తింది. ఇద్దరు కార్యదర్శులకూ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్స్ ఉన్నాయి.

- జాన్ సుందరం, ఎంపీడీవో, పెద్దారవీడు

కొద్దిగంటలు తెరిపిచ్చి..

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొద్దిరోజులుగా ముసురుపట్టి కురుస్తున్న వాన మంగళవారం మధ్యాహ్నం నుంచి తెరపిఇచ్చింది. దీంతో రైతులు, సామాన్య జనం కాస్తంత ఊరట చెందారు. జిల్లాలో వారంరోజులుగా ఒక మోస్తరు జల్లులు పడుతుండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వాన జోరు అధికమైంది. మంగళవారం ఉదయం వరకు తెరపి లేకుండా పడుతూనే ఉంది. తూర్పుప్రాంతంలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో భారీ వర్షం కురిసింది. అయితే మంగళవారం రాత్రికి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

సగటున 71 మి.మీపైనే..

జిల్లాలో రెండు రోజుల్లో సగటున 71.10 మి.మీ వర్షపాతం నమోదు కాగా తొమ్మిది మండలాల్లో 100 మి.మీ కన్నా అధికంగా కురిసింది. గరిష్ఠంగా సింగరాయకొండ మండలంలో 163 మి.మీ వర్షపాతం నమోదైంది. నాగులుప్పలపాడులో 149.20, ఒంగోలులో 149.0, పొన్నలూరులో 145.60, టంగుటూరులో 136.20, జరుగుమల్లిలో 126.2, కొండపిలో 1214, కొత్తపట్నంలో 108.80, సీఎస్‌పురంలో 104.2 మి.మీ కురిసింది. మద్దిపాడు, పొదిలి, తాళ్లూరు, పామూరు, పీసీపల్లి, సంతనూతలపాడు, చీమకుర్తి, ముండ్లమూరు, మర్రిపూడి తదితర మండలాల్లో 70 నుంచి 100 మి.మీ పడింది. ఇతర మండలాల్లోనూ ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. వీటి ప్రభావం తూర్పుప్రాంతంలో అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. కొన్ని గ్రామాల్లో పొలాల్లోకి నీరు చేరింది. అలాగే ఒంగోలు నగరంలోని పలు శివారు కాలనీలు జలమయమయ్యాయి.

పొలంలో నీరు బయటికి పంపే పనుల్లో రైతులు

మరోవైపు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలు నగరపరిధిలోని శివారు కాలనీల్లోనూ, కొత్తపట్నం మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోనూ పర్యటించి పలు అంశాలను పరిశీలించారు. కాగా మంగళవారం పగటిపూట వర్షం తెరపి ఇవ్వడంతో ప్రజానీకం కాస్తంత ఊపిరిపీల్చుకున్నారు. రైతాంగం పొలంలో నీటిని బయటకు పెట్టే పనులు చేస్తుండగా యంత్రాంగం లోతట్టు ప్రాంతాల నుంచి వర్షపు నీరు తొలగింపు, కాలువలలో పూడికతీత ఇతరత్రా పనులు చేపట్టారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్న నేపథ్యంలో ఈనెల 18వరకు భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో యంత్రాంగం మాత్రం అప్రమత్తంగానే ఉంది. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై దృష్టిపెట్టి పని చేస్తోంది.

అధికారులతో సమీక్ష

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో కూడా వర్షం అధికం ఉన్నచోట్ల పొలంలోకి నీరు చేరి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో మంత్రి డాక్టర్ స్వామి మంగళవారం ఉదయం స్థానిక ప్రకాశం భవన్‌లో కీలక అధికారులతో వర్షాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత అక్కడి కంట్రోల్ రూంను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన అనంతరం కలెక్టర్ అన్సారియాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

125 హెక్టార్లలో సజ్జ పంటకు నష్టం

జిల్లాలో వర్షాలకు 125 హెక్టార్లలో సజ్జ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వెలిగండ్ల మండలంలో 105 హెక్టార్లు, పామూరు మండలంలో 18 హెక్టార్లు, ఎన్‌జీపాడు మండలంలో 2 హెక్టార్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆ మేరకు కలెక్టర్‌కు వ్యవసాయాధికారులు ప్రాథమిక నివేదికను అందజేశారు.

అందుబాటులో సరుకులు

భారీవర్షం సూచన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో ఐదింటిని తుఫాన్ ప్రభావిత మండలాలుగా గుర్తించారు. ఆయా మండలాలకు ఒంగోలు, సింగరాయకొండ స్టాక్ పాయింట్ల నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్ ఇవ్వనున్నారు. అందుకు సంబంధించి 375 మెట్రిక్ టన్నుల బియ్యం, 15 మెట్రిక్ టన్నుల పంచదార, 15 మెట్రిక్ టన్నుల కందిపప్పును సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. పామాయిల్ సరిపడా లేకపోవడంతో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఆదేశాల మేరకు కొనుగోలు చేయనున్నారు. తుఫాను బాధిత ప్రాంతాల్లోని రేషన్‌షాపులకు ఆయా సరుకులను సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

కిక్కు రెడీ!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించేందుకు డిపో నుంచి మద్యాన్ని షాపులకు తరలిస్తున్నారు. అలాగే క్వార్టర్ బాటిల్ ధర రూ.40 తగ్గించనున్నారు. ఇప్పటికే కొన్ని బ్రాండ్లు రూ.180కు అందుబాటులోకి వచ్చాయి. బీరు ధర కూడా రూ.40 తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం పాత ధరలతో కొనుగోలు చేసిన స్టాకు అయిపోయిన తర్వాత వచ్చే మద్యం ధర తగ్గడంతోపాటు పాపులర్ బ్రాండ్లు తీసుకురానున్నారు. మద్యం లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు కొంతమంది షాపులు అద్దెకు తీసుకునే పనిలో ఉండగా, ముందుగానే తీసుకున్న మరికొందరు మద్యం నిల్వలను దుకాణాలకు చేర్చుకునే పనిలో పడ్డారు.

సరసమైన ధరలకు ప్రీమియం బ్రాండ్లు

మందుబాబులకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇవ్వాలని ప్రభుత్వం నూతన పాలసీ తీసుకొచ్చింది. లాటరీ పద్ధతిలో లైసెన్సీలను ఎంపిక చేసి ఈనెల 16 నుంచి ప్రైవేటు షాపులలో మద్యం విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఎంసీ విస్కీ, ఐబీ క్వార్టర్ బాటిల్ రూ.180కు విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ఆ రెండు బ్రాండ్‌లు సర్కార్ మద్యం షాపులలో అసలు దొరకలేదు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రెండు బ్రాండ్లను విక్రయిస్తున్నారు. అదేవిధంగా పాపులర్ బ్రాండ్ మద్యం అందుబాటులోకి తీసుకురానున్నారు.

మద్యం దుకాణాలు ఏర్పాటుకు నిబంధనలు ఇవీ..

మద్యం దుకాణాల ఏర్పాటుకు లాటరీ ద్వారా ఎంపికైన వారు ప్రొవిజనల్ లైసెన్స్ తీసుకోవాలి. అనంతరం దుకాణం మున్సిపాలిటీ, మండలంలో వచ్చిన వారు ఆ ప్రాంత పరిధిలో ఎక్కడైనా షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే బడి, గుడికి 100 మీటర్లు దూరంలో ఉండాలి. మండలాల పరిధిలో రాష్ట్ర, జాతీయ రహదారికి 220 మీటర్లు దూరం ఉండాలి. అదే 20 వేల జనాభా కంటే అధికంగా ఉంటే 500 మీటర్లు దూరంలో షాపు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. అయితే మునిసిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో ఈ నిబంధన వర్తించదు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు చేసుకునే అవకాశం ఉంది.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోవాలి
స్థానికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికార యంత్రాంగం సన్నద్ధమవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పేర్కొన్నారు. ఆదిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా జిల్లాలోని పరిస్థితి, లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వివిధ సేవలకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. ఆయా అంశాలపై స్వామి మాట్లాడుతూ వచ్చే మూడు రోజుల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత మేరకు నివారించాలన్నారు. ఇటీవల బదిలీలు జరిగినందున మండల స్థాయి అధికారులు కొత్తగా వచ్చారని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులను అందుకుంటామని మంత్రి పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించినందున మత్స్యకారులతో పాటు భృతి కోల్పోయిన వారికి సాయం అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ప్రధానంగా కాజ్‌వేలపై నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు వాటిపై రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడటంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు 700 విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామని, అందుకు అవసరమైన 300మంది కార్మికులను సిద్ధంగా ఉంచామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ బేబిరాణి, బాలశంకరరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, గోపీచంద్, పి. శ్రీనివాస ప్రసాద్, జి.వెంకటనాయుడు, సుశీల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి స్వామి

అంతకుముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోలు రూమును మంత్రి డాక్టర్ స్వామి పరిశీలించారు. విపత్తు నిర్వహణశాఖ డీపీఎం మాధురి ఆధ్వర్యంలో 24గంటల పాటు పనిచేసేలా ఈ కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

అధ్వాన రహదారికి మోక్షం

రూ.2 లక్షల సొంత నిధులతో మరమ్మతులు
ఐదు గ్రామాల ప్రజలకు తీరిన ఇక్కట్లు


గోతులు పూడ్చిన తరువాత రహదారి ఇలా

ముండ్లమూరు, అక్టోబరు 15: అతనిది కంచు సంకల్పం.. ఆ సంకల్పంతో ఓ అడుగు ముందుకు వేశాడు. సొంత నిధులతో నాలుగు కిలోమీటర్ల రహదారిని మరమ్మతులు చేయించి ఐదు గ్రామాల ప్రజల ఇక్కట్లు తీర్చాడు. మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కంచుమాటి శ్రీనివాసరావు వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం, ఈదర వెళ్లే రహదారికి తన సొంత నిధులు రూ2 లక్షలు వెచ్చించి రహదారికి పడిన గోతులు పూడ్చించారు. అలాగే, అధ్వానస్థితికి చేరిన నాలుగు కిలో మీటర్ల రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు సైతం తొలగించారు. తద్వార వేములబండ గ్రామస్థుల కష్టాలు తీర్చటమే కాకుండా ఆ రహదారిపై ప్రయాణించే రమణారెడ్డి, అయోధ్య నగర్, ఈదర, బొప్పూడివారిపాలెం, వేముల గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఆ రహదారి గోతులమయమైనా ఏమాత్రం పట్టించుకోలేదు. చినుకు పడితే రహదారి మొత్తం చిత్తడిగా మారి ద్విచక్ర వాహనాల చోదకులు సైతం వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో కంచుమాటి శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి టిప్పర్లతో గ్రావెల్ మట్టిని తీసుకువచ్చి రహదారి గుంటలను పూడ్చటమే కాక గ్రావెల్ మట్టిని రోడ్డు అంతా పరిచి చదును చేయించాడు. దీంతో వాహన చోదకుల ఇక్కట్లు తొలగిపోయాయి. దీంతో పలువురు ఆయనను అభినందిస్తున్నారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

- రూ.15 లక్షల సొత్తు అపహరణ

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ వై ద్యుడి ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 15లక్షల విలువైన ఆభరణాలు అపహరించుకెళ్ళారు. ఈ సంఘ టన స్థానిక కర్నూలురోడ్డులోని సాయినగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. రిమ్స్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న సు బ్బారావు, ఆయన భార్య ఆదివారం ఇంటికి తాళం వేసి బాపట్లకు వెళ్ళి తిరిగివచ్చారు. వారు తమ వెంట బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి శుభకార్యంలో పాల్గొన్న తరువాత వాటిని బ్యాగ్‌లో పె ట్టుకున్నారు. ఆదివారం రాత్రి తిరిగి ఒంగోలు వచ్చి వారు తమ బ్యాగ్‌లను హాలులోనే ఉంచి బెడ్‌రూంలో పడుకున్నారు. తెల్లవారి లేచి చూసే సరికి బంగారపు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించ లేదు. దీంతో పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. అదే సమయంలో బాపట్లలో శుభకార్యానికి వెళ్ళిన చోట మరిచిపోయి ఉండవచ్చున భావించి అక్కడా వెతికారు. అయితే మంగళవారం ఉదయం అభరణాలు ఉన్న బ్యాగ్ సుబ్బారావు ఇంటి సమీపంలో కాలువలో కనిపించింది. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసు లు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీ లించి అక్కడ ఆధారాలు సేకరించారు. చోరీ జరిగి రెండురోజులు గడవటం, వర్షం పడటం కారణంగా ఆధారాలు లభ్యం కాలేదని తెలుస్తోంది. ఆ బ్యాగ్‌లో సుమారు 22 సవర్ల బంగారం ఆభర ణాలు ఉన్నట్లు బాధితుడు సుబ్బారావు తెలిపారు. తాలుకా సీఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు యంత్రాంగం సిద్ధం : ఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యం లో జిల్లా పోలీస్‌యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు ఎస్పీ దామోదర్ మంగళవారం తెలిపారు. రానున్న 48గంటలలో భారీ వర్షాలు ప డే సూచన నేపథ్యంలో పోలీసులు సహాయక చర్యలు అందించ డానికి సన్నద్ధం చేశామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో తక్షణ సహాయం కోసం 112, లేక 9121102266 నంబర్లకు ఫోన్ చేయాలని, విపత్కర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రా'నైట్' అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- రెండు కంటైనర్లు సీజ్


కంటైనర్లను పట్టుకున్న అధికారులు

చీమకుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీరో బిల్లుతో గ్రానైట్ శ్లాబులను రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడు తుండటంతోబాటు, సదరు వాహనాల నుంచి డబ్బులు వసూలు చేస్తూ అక్రమ రవాణాదారులు నిర్వహిస్తున్న దందాపై మైనింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే నిమిత్తం నియమించిన స్పెషల్ మొబైల్ పార్టీ అధికారులు సోమవారం అర్ధరాత్రి బూదవాడ ప్రాంతం నుంచి బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులతో రవాణా అవుతున్న రెండు కంటైనర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని సీజ్ చేశారు. ఆదిత్య గ్రానైట్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మీశ్రీనివాస గ్రానైట్ ఫ్యాక్టరీలకు చెందిన వాహనాలు బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదుచేసి తదుపరి చర్యలను అధికారులు చేపట్టనున్నారు. ఈ తనిఖీల్లో మైనింగ్ అధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజునాయుడు పాల్గొన్నారు. గ్రానైట్ శ్లాబుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని జిల్లా మైనింగ్ శాఖ అధికారి రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా చూడాలి : కలెక్టర్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబ రు 15(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వ ర్షాలపై అధికారులు అప్రమత్తం గా ఉండాలని, వర్షపు నీరు నిలు వకుండా కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కలె క్టర్ తమీమ్ అన్సారియా ఆదేశిం చారు. మంగళవారం నగరంలో ని పోతురాజుకాలువ, కొప్పోలు రోడ్, జర్నలిస్ట్ కాలనీతో పాటు పలు శివారుకాలనీల్లో కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణం గా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సోమ, మంగళ వారాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలోని ఐదు కోస్తా మండలా లు ఉన్నాయని, వాటి పరిధిలో 53 హాబిటేషన్ సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. పది హేను పునరావాస కేంద్రాలను గుర్తించగా ఇందులో ఐదు కేంద్రాలు ఇప్పటికే అం దుబాటులోకి తీసుకువచ్చి సోమవారం నుంచి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూ రు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో 75 మి.మీ వర్షం పడిందని, వాగులు, కల్వ ర్టులలో నీరు వెళ్లేందుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాగులు, వంకల్లో, సైడుకాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడిక తీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలు, వార్డు ఎమెనిటీ, శానిటేషన్ సెక్రటరీలను నియమించి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముంద స్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్యాలయం మునక

- వర్షపు నీటితో చెరువులా మారిన వైనం


వర్షపునీటితో మునిగిన కార్యాలయం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరిగేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వరిస్తున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వానకు కార్యాలయం మొత్తం నీట మునిగి ముఖ్యమైన ఫైళ్ళన్నీ తడిచిపోయాయి. ఇక ఉద్యోగులు సైతం కార్యాలయంలోకి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. కార్యాలయం చుట్టూ వర్షపు నీరు మోకాళ్ళ లోతు నిలబడటంతో బిక్కు బిక్కుమంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే ఇరిగేషన్‌కు సంబంధించిన స్థలం గత వైసీపీ ప్రభుత్వం వైసీపీ జిల్లా కార్యాలయానికి ఇవ్వడంతో ప్రస్తుతం వారికి డ్రైనేజీ సమస్య ఎదురైంది.

వర్షపు నీరు గతంలో దక్షిణం వైపు బైపాస్ రోడ్‌లోని ప్ర ధాన డ్రైన్‌లోకి వెళ్ళేది. ప్రస్తుతం ఆ వైపు వైసీపీ కార్యాలయం కట్టి ప్రహరీ నిర్మించడంతో నీరు పోయే దారి మూసుకుపోయింది. అదేవిధంగా ఇరిగేషన్‌కు తూర్పువైపున ప్రాజెక్టుల కార్యాలయం, పడమర వైపున పీఏవో (పే అండ్ అకౌంట్ ఆఫీస్), ఉత్తరం వైపు అసంపూర్తిగా కట్టి పిల్లర్ల దశలో వదిలేసిన భవనం ఉండటంతో ఇక వర్షం పడితే చుక్కనీరు బయటకు పోయే మార్గం లేక చెరువును తలపిస్తోంది. ఇప్పటికే ఏళ్లనాటి కట్టడం కావడంతో ఇప్పుడు కూలుతోందో తెలి యని పరిస్థితి ఉండగా, వర్షం వస్తే కార్యాలయంలోకి నీచేరడంతో పాటు పాములు, విష పురుగులు వస్తున్నాయి. గతంలో కార్పొరేషన్ అధికారులకు సమస్యపై వినతిపత్రం అందించామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండపిలో భారీ వర్షం

కొండపి, అక్టోబరు 15 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో మూడు రోజుల నుచి ఎడతెరిపి లే కుండా వర్షం కురిసింది. దీంతో ముసి, అట్లేరు, ఇతర వాగుల్లో నీటి ఉధృతి పెరిగింది. ముసిపై ఉన్న చెక్‌డ్యాంలు నిండాయి. జరుగుమల్లి మండలంలోని పైడిపాడు, పొన్నలూరు మండలంలోని వేంపాడు గ్రామాల మధ్యన పాలేరు లోతుగా ఉంది. ఇక్కడ వర్షపు నీరు అధికం గా చేరడంతో రాకపోకలు సాగించకుండా జరుగుమల్లి మండల రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచారు. వాహనదారులు, పా దచారులు పాలేరు నుంచి వెళ్లకుండా వారిని మంగళవారం ఉదయం నుంచి వెనక్కి పంపిస్తున్నారు. మండలంలోని చినవెంకన్నపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం ఓ వేపచెట్టు రోడ్డుపై పడింది. కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో చెరువు ఒడ్డున గుడిసెల్లో నివాసం ఉంటున్న వారి ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.అంకయ్య మంగళవారం ఉదయం జేసీబీ సాయంతో కాలువ చేసి నీటిని చెరువులోకి మళ్లించారు.

వాగుల వద్ద భద్రత

పొన్నలూరు(కొండపి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల అధికారులు పాలేరు తీర గ్రామా ల్లోని వాగులు, చప్టాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. మండలం లోని రావులకొల్లు, ఉప్పలదిన్నె, ముప్పాళ్ల గ్రామాల వద్ద పాలేరులో నీటి ఉధృతిని తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో పి.సుజాత, పీఆర్ ఏఈ కోటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు.

సెలవులో డీఈవో

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖా ధికారి డి.సుభద్ర వ్యక్తిగత కారణాలతో వారం రోజుల పాటు సెలవు లో వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి డీఈవోగా మైనంపాడు డైట్ సీనియర్ లెక్చరర్ సామా సుబ్బారావుకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే సోమవారం డీఈవో సుభద్ర విధులకు హాజరుకానున్నారు.

టెట్ పరీక్షకు 116మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవా రం నిర్వహించిన ఏపీ ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షకు 116 మం ది గైర్హాజరయ్యారు. జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను గాను రెండు పరీక్షా కేంద్రాల్లోనూ ఈ పరీక్షలు జరిగాయి. ఒంగోలులోని ఎన్ఎస్‌సీఐఎస్, బ్రిలియంట్‌లో పరీక్షలు జరగ్గా మార్కాపురంలోని రెండుకేంద్రాల్లో పరీక్ష జరగలేదు. పరీక్షకు 669మంది అభ్యర్థులను కేటాయించగా 553మంది హాజరయ్యారు. ఉదయంసెషన్‌కు 334మందికి 273, మధ్యాహ్నం సెషన్‌కు 335కి 280మంది పరీక్షకు హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

మద్దిపాడు, అ క్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎంపీడీవో వి. జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని సీతారామపురంలోని రాజులకాలనీలో రూ.10లక్షలతో సైడ్ కాలు వ నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా మంగళవారం ఆయా పనులను టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వ ర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ శివానంద రావు, మండవ గోపీచంద్, మారెళ్ల హరికుమార్, తొర్రికొండ కిరణ్, చింతల శ్రీనివాసరావు, పి.షరీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే.అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒంగోలు విద్య: స్థానిక ట్రిపుల్ ఐటీలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే.అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ భాస్కర్‌పటేల్, ఏవో చంద్రశేఖరన్, డీన్ రూపన్‌కుమార్, పి. సురేష్‌బాబు, ఎఫ్‌వో మీరావళి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం ● కొత్తపట్నం మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం ● అధికారులతో కలిసి పరిశీలన


పునరావాస కేంద్రంలో ఉన్నవారితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలునగరం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలంలో భారీ వర్షాల కారణంగా పలుప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో పలుకాలనీల ప్రజలను రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. మంగళవారం తహసీల్దారు మధుసూదనరావు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొత్త పట్నంలోని జడ్పీ హైస్కూలు, టీఎల్ఎన్ స్వామి జూనియర్ కళాశాలలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయగా గంగమ్మకాలనీ, ఇతరకాల నీకి చెందిన 120మందిని అక్కడికి తరలించారు. వారికి భోజన సౌకర్యాలు ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పునరావాస కేంద్రాలను పరిశీలించి అందులో ఉన్న నిర్వాసితులతో మాట్లాడారు. భారీ వర్షాలు తగ్గేవరకు ఇక్కడే ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. తీర ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగినఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. వారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేశామని తహసీల్దార్ మధుసూద నరావుకు సూచించారు.

దెబ్బతిన్న ఇళ్లు..

కాగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షా లకు ఇళ్ళు దెబ్బతిని పోయాయి. కొన్ని కూలిపోగా మరికొన్ని ప్రమాదస్థితికి చేరుకున్నాయి. తహసీల్దార్ మధుసూదనరావు కొత్తపట్నం, ఈతముక్కల గ్రామాల్లో కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. వారిని వెంటనే పునరావాసకేంద్రాలకు తరలించారు.

కాగా ఒంగోలు-కొత్తపట్నం, ఈతముక్కల-ఒంగోలు, కొప్పోలు-మోటుమాల మార్గాల్లో ఉన్న వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక ప్రమాదకరంగా ఉన్న సూరారెడ్డిపాలెం-ఈతముక్కల మధ్య బకింగ్‌హాంకెనాల్‌పై భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. సిబ్బందిని నియమించి భారీ వాహనాల రాకపోకలను దారి మళ్లించారు.

గర్భిణుల వివరాల సేకరణ

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విపత్కర సమయాల్లో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు, వైద్యసేవలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామాల్లో ఉన్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ద్వారా రెవెన్యూ సిబ్బంది పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆయా గ్రామాలకు రాకపోకలు తెగిపోతే వారికి వైద్య సహాయం అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

'ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీపడాలి'

ఒంగోలు(రూరల్), అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీపడాలని, వచ్చే ఆరు నెలల్లో ఈ మార్పు కన్పించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలు మండలంలోని ఉలిచి, కరవది, చేజర్ల గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కరవదిలో రూ.1.30కోట్లు, ఉలిచిలో రూ.15లక్షలతోను, చేజర్లలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఉలిచిలో స్థానికు లు మాట్లాడుతూ ఎస్సీకాలనీకి చెందిన శ్మశానం చిలచెట్ల తో నిండిపోయిందని, బాగు చేయించాలని కోరారు. ఉలిచి ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు చోరీ చేశారని, నూతనంగా మరొకటి ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

కాగా ఎమ్మెల్యే కరవదిలోని పీహెచ్‌సీని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిం చాలని వైద్యులకు సూచించారు. వైద్యశాలకు ప్రహరీ, సమావేశం భవనం నిర్మించాలని వైద్యులు కోరారు. ఇక చేజర్లలో గ్రామస్థులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తప్పులు జరిగాయని, వాటిని సరిచే యాలని కోరారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ వాగంటి రవికుమార్‌రెడ్డి కోరారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీని వాసరావు, పోలవరపు వెంకటరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నలమోతు బాల గంగాధర్, చుంచు శేషయ్య, పాతూరి పూర్ణచంద్రరావు, గద్దె వెంకటకృష్ణ, పిల్లుట్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగరం జలమయం

- కార్పొరేషన్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఒంగోలు నగరం తడిసి ముద్దయ్యింది. నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, మరోవైపు రోడ్లు కూడా సక్రమంగా లేని కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా కాగా కలెక్టర్ ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారీ వర్షం నేపథ్యంలో కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు టోల్‌ఫ్రీ నెం. 08592-232858/ 1800-4252858కు కాల్ చేయాలని కోరారు. అలాగే క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేశామని, పారిశుధ్యం, తాగునీ రు, పడిపోయిన చెట్లు తొలగింపు కోసం 25మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఇక లోతట్టు ప్రజల కోసం ముందస్తుగా 13తుఫాన్ సహాయ కేంద్రాలు గుర్తిం చినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా కాలనీలకు 41 ట్యాంకర్లతో నీటి సరఫరా, ఇక రోగాలు ప్రబలకుండా తగి న చర్యలు చేపట్టామన్నారు.


కనపర్తిలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్
హనుమాపురంవాగు

నాగులుప్పలపాడులో కుండపోత

నాగులుప్పలపాడు: అల్పపీడన ప్రభావంతో మంగళ వారం మండలంలో కుండపోత వర్షాలు కురిశాయి. సో మవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వానలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులోని హనుమాపురం, కొత్తకోట వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చికుకున్నాయి. ఇక రహదారిలో రెండో రోజు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా వాగుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కనపర్తి తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మహాలక్ష్మి ఉప్పుగుండూరులోని ఎస్టీకాలనీ, ఇందిరా కాలనీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గ్రామంలోని నాగన్నవాగు, ఎస్టీకాలనీలోని వాగులను పరిశీలించారు. మాచవరం-ఉప్పుగుండూరు రోడ్డులోని నేలచప్టాపైకి వరదనీరు చేరడంతో అటువైపుగా రాకపోకలు స్తంభించాయి. నాగులుప్పలపాడు సమీపంలోని మిరప, నువ్వు టమోటా పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఉప్పుగుండూరులోని జాతీయ రహదారి వద్ద నీలాయపాలెం రోడ్డుకు ఇరువైపులా భారీగా వరదనీరు చేరింది. నాగన్నవాగు పొంగి రోడ్డుపైకి వరద చేరడంతో ఆ ప్రాంతమంతా సముద్రంగా మారింది. పో లీసులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. ఇంకొల్లు సీఐ రమణయ్య ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఉప్పుగుం డూరులోని రెండు ఊరచెరువులు నీటితో ఏకమయ్యాయి.


డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్


మద్దిపాడు హైవే సర్వేసురోడ్డులో నిలిచిన వర్షపునీరు

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: అల్పపీడన ప్రభావంతో మద్దిపాడు మం డలంలో మంగళవారం వేకువజాము నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం 11 గంటల సమయంలో కొం చెం తెరపి ఇచ్చింది, మద్దిపాడు ఎంపీడీవో, ఎంఈవో కా ర్యాలయాలు వర్షపునీటితో నిండిపోయాయి. హైవే వెంట సర్వీసు రోడ్లు జలమయం కాగా వాహనదారులు ఇబ్బం దులు పడ్డారు. స్థానిక అరుంధతినగర్‌లోని రోడ్డు నీట మునిగింది. గుండ్లాపల్లి జడ్పీ పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిలిచింది. వర్షాలకు పత్తి చేలోకి నీరు చేరటంతో రైతులు బయటకు పంపటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వల్ల పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

నాగులుప్పలపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :: పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలని ఏవో వెంకటరావు కోరారు. మండలంలోని రాపర్ల, మాచవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు తమ పంటల వివరాలను వ్యవసాయ సహాయ సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరిత్యాలు సంభవించినపుడు బీమా పొందుతారని చెపాపరు. తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. శనగలో ఎండు తెగులు నివారణకు కేజీకి 8 గ్రాములు ట్రికోడెర్మావిరిడితో విత్తనశుద్ధిచేయాలన్నారు. ఉద్యాన అధికారి ప్రత్యూష మాట్లాడుతూ అధిక వర్షాలకు మిరప పంట దెబ్బతినకుండా ఉండేందుకు వెంటనే నీటిని బయటకు తరలించి 30 కేజీల యూరియా, 20కేజీల పొటాష్‌ను మొక్కల మొదలులో వేయాలన్నారు. తెగుళ్లు ఆశించకుండా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారి చేయాలని సూచించారు. పశువులకు కూడా బీమా చేయించుకోవాలని ఏడీఏ సురేఖ కోరారు.


కాలువను ఆక్రమించి బ్రిడ్జివేసి నిర్మాణాలు

ప్రభుత్వ భూముల కబ్జా

- వాగులు, కాలువలు పూడ్చివేసి ఆక్రమణలు
- కాలువలకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు
- కుంచించుకపోయిన వందడుగుల అలుగువాగు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు

పట్టణంలో ఆక్రమణల పర్వం రోజరోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు వెనుకా ముందు ఆలోచించకుండా కబ్జా చేయడమే పనిగా కొందరు పెట్టుకున్నారు. ఇదే మిటని అడిగే అధికారులు లేక పోవడంతో విచ్చలవిడిగా ఆక్రమణలకు తెగబడుతూ జేబులు నింపుకుంటున్నారు. గతంలో పట్టణంలో సుమారు 60 శాతం ప్రభుత్వ స్థలాలు, భూములు ఉండేవి. ఇప్పుడు కనీసం చిన్న ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి సెంటు స్థలం కూడా దొరకడం లేదు. అదే కోవలో పట్టణంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, బ్రహ్మంగారి దేవాలయం వెనుక ప్రాంతాల్లో ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోయింది.

పొదిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెద్ద చెరువు నుంచి చిన్నచెరువుకు నీరు చేరే వాగు గతంలో 100 అడుగులు ఉండేది. ఇప్పుడు 20 అడుగులకు చేరింది. అంతే కాకుండా దాని మధ్యలో తారురోడ్డు వేశారు. ఆతరువాత ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కాలువతోపాటు బావులు, ఉండేవి. అవి ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇప్పుడు ఆక్రమణదారుల చేతుల్లో కుంచించుకుపోయి కేవలం 20అడుగుల వెడల్పుకు చేరింది. వర్షాలు కురిస్తే చిన్నచెరువుకు నీరు చేరే అవకాశం లేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాగుపై నిర్మాణాలు

వాగులను సైతం ఆక్రమించుకొని పైనశ్లాబు వేసి దానిపై నిర్మాణాలు చేస్తున్నారు. కానీ ఏ అధికారీ ఆవైపు కన్నెత్తికూడా చూడటం లేదు. పలుకుబడి ఉన్న వ్యక్తులు ఆక్రమించడం అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకోవడంతో అక్రమార్కులు ఆరితేరారు. అదే విధంగా కొనుగోలు చేసిన తరువాత ఎందుకు కొనుగోలు చేశామని వారు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు తుంగలో..

ఇక్కడ జరుగుతున్న అక్రమాలు, అక్రమ నిర్మాణాలపై అప్పటి జిల్లా కలెక్టర్ పోలా భాస్కర్‌కు పలువురు ఫిర్యాదులు చేశారు. స్పందించిన ఆయన ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అప్పటి అధికారులు రెండు, మూడు రోజులు హడావుడి చేశారు. ఆతరువాత ఏమైందో అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉండిపోయారు.

ఆక్రమణలను గుర్తించి సీల్ వేశారు

గతంలో ఆప్రాంతాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు ఆక్రణలు జరిగాయని తేల్చి ఇళ్లకు సీల్ వేశారు. నిర్మాణాలు చేసి అమ్మినవాళ్ళు కాని, కొనుగోలు చేసిన యజమానులు అధికారులకు చేతులు తడపడం వారి సలహాల మేరకు కోర్టును ఆశ్రయించడంతో ఉన్నతాధికారుల చర్యలను మర్చిపోయారు. అయినా చర్యలు మాత్రం శూన్యం.

గతంలో ఉన్నతాధికారులు పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)



దర్శిరోడ్డు వైపు నుంచి వచ్చే వాగు మధ్యలో రోడ్డు ఆపై నిర్మాణం చేసిన దృశ్యం


కాలువకు అడ్డంగా ఏర్పాటు చేసిన గోడ

నేషనల్ చీఫ్ అవార్డుకు మౌలాలి ఎంపిక



తర్లుపాడు : కలాం నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి ఎంపికయ్యారు. ఈనెల 19న తిరుపతి మహతి ఆడిటోరియంలో బెంగుళూరు ఇస్రో ఓఎస్‌డీ ఆధ్వర్యంలో అవార్డు అందుకుంటున్నట్లు తిరుపతి కలాం ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. అవార్డు అందుకుంటున్న షేక్ మైలాలీని ఎంఈఓ దేవరకొండ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.


చేతులు శుభ్రం చేసుకుంటున్న అధికారులు

గ్లోబల్ వాషింగ్ డే

తర్లుపాడు, అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను ఈవోపీఆర్‌డీ టి.సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది సబ్బుతో చేతులు కడుగుతూ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు.


ఇందిర ఇంజనీరింగ్ కాలేజీలో నివాళులర్పిస్తున్న చైర్మన్ హనుమారెడ్డి

ఘనంగా కలాం జయంతి

మార్కాపురం : భారతదేశ క్షిపణి పితామహుడు, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిర, కిట్స్, జార్జి, ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలల్లో అబ్దుల్ కలాం విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

కొమరోలు : మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై శనగ విత్తనాల పంపిణీ కార్యాక్రమాన్ని ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని రైతులకు జేజీ-11 రకం శనగ విత్తనాలు క్వింటా రాయితీ పోను రూ.7050లు,, కేఏకే-2 రకం శనగ విత్తనాలు రూ.9075లను రాయితీపై రైతులకు అందిస్తున్నామన్నారు.

దుంప తెగులుపై అవగాహన

కంభం : కంభం మండలంలోని దర్గా, హజరత్‌గూడెం గ్రామాలలో వ్యవసాయాధికారిణి స్వరూప 'పొలం పిలుస్తుంది'లో భాగంగా పసుపు, జొన్న పంటలను పరిశీలించి సూచనలు చేశారు. పసుపులో దుంపతెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ ఎకరానికి 500 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు.

కందిలో అంతర సేద్యం మేలు

బేస్తవారపేట : కంది పంటలో అంతర సేద్యం చేయడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయాధికారి జక్కం మేర్సీ అన్నారు.మంగళవారం బేస్తవారపేట, సోమవారపేట గ్రామంలో జరిగిన పోలం పిలుస్తోంది కార్యక్రవంలో ఆమె మాట్లాడారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

పెద్దదోర్నాల : ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. మండలంలోని యడవల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన మిరప, పత్తి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.


తర్లుపాడులో నీట మునిగిన పొగాకు


సీతానాగులవరంలో నీటి మునిగిన జొన్న పంట

భారీ వర్షాలకు పొగాకు రైతులకు నష్టం

తర్లుపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఖరీఫ్‌లో సాగుచేసిన బర్లీ పొగాకుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం బర్లీ పొగాకు ఆకు కొట్టు దశలో ఉంది. బ్యార్నీ పొగాకు కూడా 20 రోజుల నంచి ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. సీతానాగులవరం, తర్లుపాడులో వేసిన పొగాకు వర్షం వల్ల ఉరకెత్తుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బర్లీ పొగాకులో సాగైన పొలాల్లో మోకాళ్లలోతు నీరు ఉండటంతో మొక్కలు ఎదగవని ఈర్ల ఏడుకొండలు వాపోయారు. 5 ఎకరాల పొగాకు తోట మొత్తం నీటి మునిగిందన్నారు. మండలంలో తర్లుపాడు, సీతానాగులవరంలో సుమారు 200 ఎకరాల్లో పొగాకు పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంటకు నష్టం వాటిల్లే అవకాశం లేదని, పల్లపు ప్రాంతాల్లో సాగుచేసిన మిరప పంటకు కూడా కొంతమేర నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారి వెంకటేశ్ తెలిపారు. మరో 2 రోజుల పాటు వర్షాలు కురిస్తే పొగుకు, మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లుతుంది. ఎకరా పొగాకు పంటకు దాదాపుగా రూ.40 వేలు ఖర్చు అవుతోంది. మరింత వర్షాలు కురిస్తే చేలు దెబ్బతిని పూర్తిగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోయారు.

ముసురుతో పైర్లకు జీవం


దోర్నాలలో కళకళలాడుతున్న మిరప పైరు

పెద్ద దోర్నాల : రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వానకు మండలంలో సాగు చేసిన పైర్లు జీవం పోసుకున్నాయి. మండలంలో ఈ ఏడాది 2500 హెక్టార్లలో విస్తారంగా మిరప, తర్వాత పత్తి, పొగాకు, కంది, మినుమును సాగు చేశారు. తీరా పైరుకు నీటితడులు ఇద్దామంటే బోరుబావుల్లో నీరు రావడం లేదు. దీంతో ఆందోళనకు గురయ్యారు. లక్షలు వెచ్చించి మిరప నారు కొనుగోలు చేసి నాట్లు వేశారు. కొందరు రైతులు ఎరువులు కూడా పోశారు. పైపాటుగా రసాయనిక మందులు పిచికారీ చేశారు. ఒకపక్క నీటి తడులు ఇవ్వలేక, మరోపక్క వేసవిని మించి దంచి కొట్టిన ఎండలకు మిరప మొక్కలు చాలా వరకు చనిపోయాయి. మళ్లీ నాట్లు వేశారు. చావు బతుకుల మధ్య ఉన్న పైర్లకు ఈ వర్షాలు జీవం పోశాయి.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే ముత్తుముల

- రూ.15 కోట్లు మంజూరు

గిద్దలూరు, అక్టోబరు 15 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విమర్శించారు. పల్లెపండుగ - ప్రగతికి అండగా కార్యక్రమంలో భాగంగా రాచర్ల పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాచర్ల, పలుగుంటిపల్లిలలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ జోసఫ్‌కుమార్, హౌసింగ్ ఏఈ విజయకుమారి పాల్గొన్నారు.


సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. రాచర్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గం మొత్తం మీద పల్లెపండుగ వారోత్సవాల్లో పనులు ప్రారంభించేందుకు వీలుగా రూ.15 కోట్లు మంజూరయ్యాయని, రాచర్ల మండలానికి రూ.2.5 కోట్లు కేటాయించారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఈదుల సుజాత, సర్పంచ్ రాములమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


మినీ వాటర్ ట్యాంక్‌కు సపోర్టు తీగను చుట్టిన విద్యుత్ సిబ్బంది

గాలి వీచిందా.. ట్యాంకు గోవిందా..

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసినప్పుడు చివరి స్థంభం పడిపోకుండా ఉండేందుకు సపోర్టుగా ఒక స్థంభాన్ని పాతుతారు. కానీ పెద్దారవీడు మండలంలోని తోకపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ సిబ్బంది నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఇళ్ల వద్ద చివరి స్థంభానికి సపోర్టు స్థంభం ఏర్పాటు చేయకుండా సమీపంలోని ఓ మినీ వాటర్ ట్యాంకుకు తీగను చుట్టి చేతులు దులుపుకున్నారు. తుఫాను నేపథ్యంలో గాలులు వీచి వాటర్ ట్యాంకు కూలిపోతే తీవ్ర ప్రమాదం జరుగుతుంది..

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

పుల్లలచెరువు : పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా ఈ నెల 18 లోపు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని పుల్లలచెరువు మండల వ్యసాయయశాఖ అధికారి పి.నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం 'పొలం పిలుస్తుంది'లో భాగంగా మండలంలోని చౌటపల్లిలో సాగులో వున్నకందిని పరిశీలించారు.

రోడ్లు రొచ్చురొచ్చు..!

- వర్షాలకు అధ్వానంగా మారిన అంతర్గత రహదారులు


త్రిపురాంతకంలోని రహదారి ఇలా..

త్రిపురాంతకం, అక్టోబరు 15: గత మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. నడిచేందుకు వీలు లేకుండా తయారయ్యాయి. త్రిపురాంతకంలోని ఉత్తరపు వీధి, బ్రహ్మంగారి కాలనీలో రోడ్లు చిత్తడిగా తయారై గుంతలమయంగా మారాయి. గణపవరం గ్రామంలోని ప్రధాన రహదారి, మేడపిలోని బ్యాంకు బజార్ మరీ అధ్వానంగా మారి వాహనదాలుకు, పాదచారులకు కనీసం నడిచేందుకూ వీలులేకుండా ఉంది. జి.ఉమ్మడివరం, సోమేపల్లి, హసానాపురం, కేశినేనిపల్లి, విశ్వనాథపురం, లేళ్లపల్లి ఎస్సీకాలనీ, కంకణాలపల్లి ఎస్సీకాలనీ, మిరియంపల్లి ఒడ్డుపాలెం గ్రామాల్లో అంతర్గత రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. దీనికితోడు గ్రామాల్లో ఎక్కడా సైడు కాలువలు లేకపోవడంతో వర్షపు నీటితోపాటు, ఇళ్లలో వాడుకున్న వృథా నీరంతా రోడ్లపైనే నిలుస్తోంది. దుర్వాసన వెదజల్లుతూ ఇబ్బందికరంగా మారింది. జ్వరాలు కూడా వ్యాప్తిచెందే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గ్రామాల అంతర్గత రహదారులు, సైడు డ్రైన్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


రాయవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

గ్రామాల అభివృద్ధి కోసమే 'పల్లె పండుగ'

మార్కాపురం రూరల్ : గ్రామాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రాయవరం, కోలభీమునిపాడు, పెద్దనాగులవరం, బోడపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పల్లె పండుగ'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ రోడ్లు, గోకులం షెడ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోలభీముని పాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన వైద్య సిబ్బంది గైర్హాజరవడంతో వారికి మెమోను జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ మండల నాయకులు జవ్వాజి రామాంజిరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధితోనే గ్రామాల్లో వెలుగు

- టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే పల్లెల్లో పండుగ అని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని పెద్దారవీడు, వై.డి.పాడు, తోకపల్లి గ్రామాలలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రూ.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. పెద్దారవీడులో రూ.40 లక్షలు, తోకపల్లిలో రూ.20 లక్షలు, వై.డి.పాడులో రూ.10 లక్షల మేర సీసీ రోడ్ల నిర్మాణాలకు పంచాయతీ తీర్మానాలు పూర్తయి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుందరం, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రగుంట్ల నాగేశ్వరరావు, ఇ.ఈశ్వరరెడ్డి, పాపిరెడ్డి, పాలంకయ్య పాల్గొన్నారు.


నీటి కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

నీటి సమస్య తీర్చాలని వినతి

గిద్దలూరు, అక్టోబరు 15 : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చట్రెడ్డిపల్లెలో ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతున్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం 10 రోజుల క్రితం గ్రామంలో కొత్తగా డీప్‌బోరు వేశారు. దీనికి సమీపంలోని పాత బోరుకు ఎయిర్ వచ్చి వస్తున్న అరకొర నీరు కూడా ప్రస్తుతం ఆగిపోయింది. నీటి సమస్య మరింత తీవ్రమైంది. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తాత్కాలికంగా అందిస్తున్నారు. అవి సరిపోవడం లేదని, పొలాల్లోకి వెళ్లి తెచ్చుకుంటున్నామని, గ్రామానికి చెందిన మహిళలు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి మంగళవారం ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రమిచ్చారు. కొత్త డీప్‌బోరును వెంటనే ప్రారంభించి పాత బోరుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

మద్యం షాపునకు అనుమతివ్వొద్దని మహిళల ఆందోళన


సాయినగర్‌లో మద్యం షాపుల వద్దంటూ ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

కంభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయినగర్‌కు వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపునకు అనుమతి ఇవ్వ వద్దని ఆ కాలనీలోకి మహిళలు మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎక్సైజ్ సీఐ కొండారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సాయినగర్‌లో సుమారు 400 కుటుంబాలకు పైగానే నివసిస్తున్నాయి. ఆ మార్గం గుండా నిత్యవసర పనుల కోసం మహిళలు, విద్యార్థులు, పిల్లలు వెళుతుంటారు. కాబట్టి మద్యం షాపునకు అనుమతి ఇవ్వవద్దని కోరారు.

కార్మికుల పొట్టగొట్టే చర్యలు మానుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పొట్టగొట్టే చర్యలు మానుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల దీక్షలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా మార్కాపురం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం వారి పొట్టగొట్టే విధానం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం అన్నారు.

కేసులతో ప్రజా పోరాటాలను ఆపలేరు : ఏఐటీయూసీ

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీసు కేసులతో ప్రజా పోరాటాలను ఆపలేరని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. సీపీఐ, సీపీఎం నాయకులపై 2016వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసును మంగళవారం మార్కాపురం కోర్టు కొట్టివేసిందని ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో రాధ

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఏవో కె.రాధ తెలిపారు. మండలంలోని దూబగుంట, నుచ్చుపొద గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనంతరం గుమ్మలంపాడు గ్రామంలో సాగుచేసి ఉన్న మినుము పైరులో వర్షం నీరు నిలువ ఉండటంతో పసుపు రంగులోకి వచ్చిందన్నారు. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో సాగుచేస్తున్న పైర్లు పూత దశలో లేనందున ఎలాంటి నష్టం లేదన్నారు.

వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తో కురుస్తున్న వర్షాలతో పామూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని చెప్పారు. దసరా సెలవులకు వచ్చిన పిల్లలను బయటకు పంపించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి ఘటనలు జరిగినా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పలు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అవసరమైతే వాగుల వద్ద రాత్రుళ్ల సిబ్బంది కాపలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పొదుపు గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం సంవృద్ధి సాధించాలని ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా పొదుపు మహిళలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ లక్షాధికారి కావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈపథకాలను ప్రారంభించిందని చెప్పారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కనిగిరి డివిజన్ ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. తద్వార రోగాలు దరిచేరవని చెప్పారు. సీఎస్‌పురంలోని గ్రామ సచివాలయంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన కలిగిఉండాలి

తాళ్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ శాఖలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని మాధవరం, శివరాంపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విత్తనాలు నాటేటప్పుడు రైతులు జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ఎం.అంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్, అనూష్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



దోర్నపువాగు వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మి

తాళ్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం మండలంలో 72.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. ఉదయం నుండి కురిసిన వర్షం మధ్యాహ్నానికి కొంత మేర తెరపిచ్చింది..తాళ్లూరు -ముండ్లమూరు, బెల్లకొండవారిపాలెం- దోసకాయలపాడు, తూర్పుగంగవరం- నాగంబొట్లపాలెం, తాళ్లూరు-రజానగరం గ్రామాల మధ్య వాగులు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ కె.నాగలక్ష్మి సిబ్బందితో వెళ్లి వాగుల ప్రవాహన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగుల వద్ద వీఆర్‌వోలను కాపలాగా ఉంచారు. ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు వాగుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. విఠలాపురం వెళ్లే మార్గంలో దోర్నపువాగు ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఇరువైపులా అడ్డంగా మోకులు కట్టి ప్రజలు రాకపోకలు సాగించకుండా చర్యలు చేపట్టారు.

వైసీపీ పాలనలో అటకెక్కిన సంక్షేమం

కూటమి ప్రభుత్వంలో రూ.1.35 కోట్లతో రోడ్ల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీసీ, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



తిమ్మారెడ్డిపల్లి పంచాయతీలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం అటకెక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పల్లెకు పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నందనవనం గ్రామ పంచాయతీల్లో రూ.1.35 లక్షలతో పలు రోడ్లా నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నరేగా నిధులతో రోడ్లు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత వైసీపీ పాలనలో సంక్షేమం అంటే బటన్ నొక్కటమే తప్ప ప్రజలకు అందిందేమి లేదని విమర్శించారు. రాష్ట్రంలో గత ఐదేళ్ళలో చీకటి పాలన సాగిందని ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్, నరేగా నిధులతో రూ.4,500 కోట్లతో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో ఆయా పనులు వేగవంతం గా చేపట్టేందుకు చర్యలు తీసుకోవటం రాష్ట్రాభి వృద్ధిపై ఆయన చూపిస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. రోడ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకవకతవలకు తావు లేకుండా నిర్మాణాత్మకమైన పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, పెంచికల రామకృష్ణ, కుందురు నారాయణరెడ్డి, మువ్వా రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ దానియేలు

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతరత్న అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ దానియేలు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో ఓ మారుమూల పల్లెలో జన్మించిన కలాం భారతదేశం గర్వించదగిన వ్యక్తిగా ఎదగటం ఆయన క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనమన్నారు. భారత అణుసంస్థలో అత్యున్నత స్థాయికి చేరి అనేక సేవలు అందించిన శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించిన మహనీయుడు కలాం అని గుర్తుచేశారు. కలాం భౌతికంగా లేకున్నప్పటికీ భావితరాల మనుస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ అబ్దుల్ కలాం నిజాయితీ, నిరాడంబరతకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక దివ్యాంగుల పాఠశాలలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు కేక్ కట్ చేశారు.

పామూరులో..

పామూరు: మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని టీడీపీ నియోజకవర్గ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. స్థానిక స్వయంకృషి సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఆర్‌ఆర్ రఫి, షేక్ గౌస్‌బాషా, వార్డు మెంబర్ పిడుగు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో..

కురిచేడు: కురిచేడు పంచాయతీ కార్యాలయంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం ఆశయాలను కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ కోరారు. కలాం చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎల్.సుమతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సామంతపూడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జముకులదిన్నె, సామంతపూడి, పాపిరెడ్డిపాలెం, బండివెలిగండ్ల గ్రామాల్లో మంగళవారం జరిగిన పల్లె పండుగ వారోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో తమ ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో అన్నీ గ్రామాల్లో ఏకకాలంలో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మండల ప్రత్యేకాధికారి రవికుమార్, ఎంపీడీవో కృష్ణమూర్తి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి

దర్శి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీలోని కొత్తపాలెం వద్ద ప్రతిపాదించిన టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేసామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్కడ టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం కోసం అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. నిబంధనల మేరకు చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము రూ.5 లక్షలు దాతల సహకారంతో రెండేళ్ల క్రితమే చెల్లించారు. రామాలయ మాన్యం భూమి 2.5 ఎకరాలు కేటాయించారు. అయినప్పటికీ ఆ తర్వాత వైసీపీ పాలకులు కల్యాణ మండపం నిర్మాణాన్ని గాలికొదిలేశారు. కొద్దిరోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో శంకుస్థాపనకే పరిమితమైన కల్యాణ మండపం శీర్షికన ప్రచురితమైన కథనం తెలిసిందే.

ఈనేపథ్యంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం కల్యాణ మండపం నిర్మాణం తలపెట్టిన స్థలాన్ని, శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలకుల అసమర్థతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు పునాదుల్లో నిలచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణ మండపంతో పాటు నిలచిపోయిన అన్నీ పథకాలను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, కౌన్సిలర్ వీసీ రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ అన్సారియాతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

దర్శి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు లోని కలెక్టరేట్‌లో ఆమెను కలిసి దర్శి నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి దర్శి-కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఆవరణలో గల స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే, పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు అందుకు కలెక్టర్ అన్సారియా సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

విద్యుత్ ఉద్యోగి మోసం

చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్



విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

దర్శి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్యాలయానికి తమ భవనాన్ని అద్దెకు తీసుకునే క్రమంలో ఆశాఖ ఉద్యోగి ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకొని మోసం చేశారని బాధితులు వాపోయారు. ఈమేరకు ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఉద్యోగి భవనం అద్దెతో పాటు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని తనకు విక్రయించినట్లుగా రాయించుకొని మోసం చేశాడని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దర్శి పట్టణానికి చెందిన రవికృష్ణ, ప్రసన్న దంపతులకు దర్శి-పొదిలి రోడ్డులో సొంత భవనం ఉంది. ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ఏర్పాటుకు ఆశాఖలో పనిచేస్తున్న జేఏవో నాదెళ్ల వేణుగోపాల్ అనే ఉద్యోగి రవికృష్ణ దంపతులను కలిసి గత మార్చి నెలలో భవనంను అద్దెకు ఇవ్వాలని కోరగా సమ్మతించారు. అద్దెను ఖరారు చేసేందుకు యజమానుల సంతకాలు అవసరమని నమ్మించి రవికృష్ణ దంపతుల సంతకాలను పలు ఖాళీ దస్తావేజీలపై చేయించుకున్నాడు.

అనంతరం ఆ భవనాన్ని విద్యుత్‌శాఖ కార్యాలయానికి అద్దెకు ఇవ్వటంతో కొన్ని నెలలుగా అక్కడ నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఆతర్వాత కొన్ని రోజులకు జేఏవో వేణుగోపాల్ మోసం బయటపడింది. కార్యాలయానికి అద్దెభవనం తీసుకున్న పత్రాలతో పాటు అదనంగా సంతకాలు తీసుకున్న ఖాళీ పత్రాల్లో ఆ భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని తనకు విక్రయించినట్లుగా నాదెళ్ల వెణుగోపాల్ రికార్డు సృష్టించుకున్నాడు. ఈవిషయం తెలుసుకున్న బాధితులు ఏపీసీపీడీసీఎల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేట్ అధికారులు సోమవారం దర్శికి వచ్చి ఈ విషయంపై విచారణ చేశారు. బాధితులు జేఏవో వేణుగోపాల్ చేసిన మోసాన్ని వివరించి న్యాయం చేయాలని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవిషయంపై విద్యుత్‌శాఖ దర్శి ఈఈ శ్రీనివాసులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా జేఏవో వేణుగోపాల్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు విజయవాడ నుంచి కార్పొరేట్ అధికారులు దర్శికి వచ్చి విచారణ చేశారని చెప్పారు. అయితే, తనకు ఆ ఖాళీ స్థలాన్ని విక్రయించారని, కోటి రూపాయలు వారికి చెల్లించానని జేఏవో వేణుగోపాల్ చెప్పినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

మూతబడిన వైసీపీ ప్రభుత్వ మద్యం షాపులు

నేటి నుంచి తెరచుకోనున్న కొత్త దుకాణాలు

అందుబాటులోకి నాణ్యమైన బ్రాండ్లు



దొనకొండలో గత ప్రభుత్వంలో ఏర్పాటైన మద్యం షాపు(ఫైల్)

దొనకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలో ఏర్పాటైన మూడు ప్రభుత్వ మద్యం షాపులు మంగళవారం రాత్రి నుంచి మూతపడ్డాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పులు తెచ్చి ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టేలా చర్యలు చేపట్టింది. షాపులను అద్దెకు తీసుకొని వైసీపీ నాయకులు సిఫార్సు చేసిన వారిని షాపుల్లో సిబ్బందిగా నియమించి మద్యం విక్రయాలు చేపట్టారు. బ్రాండెండ్ మద్యం కాకుండా నాసిరకం మద్యాన్ని అందుబాటులోకి తెచ్చి అధిక ధరలతో విక్రయాలు చేపట్టటంతో వైసీపీ ప్రభుత్వ చర్యల పట్ల ప్రజల నుండి విమర్శలు ఎదురయ్యాయి.

2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీని రద్దు చేసి టెండర్లు ద్వారా ప్రైవేట్ వ్యక్తులు మద్యం షాపులు నిర్వహించేలా కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. దీంతో మండలంలోని మూడు మద్యం షాపులను లాటరీ పద్ధతిలో షాపులు దక్కించుకున్న వారు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని బుధవారం నుంచి నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



ఫ్రీహోల్డ్ భూములపై తహసీల్దార్‌ని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

పీసీపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కనిగిరి ఆర్డీవో జి.కేశవవర్ధన్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కనిగిరి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన తమ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించాలన్న కలెక్టర్ అన్సారియా ఆదేశాల మేరకు పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని గదులను పరిశీలించారు. సమావేశపు గది కిటికీలు లేకుండా ఉండడాన్ని గమనించారు. పలు గదుల్లో స్లాబ్ పెచ్చులూడి ఉండడాన్ని గమనించారు. అనంతరం తహసీల్దార్ ఉష, కార్యాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ జరిగిన అసైన్మెంట్ భూముల గురించి వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు ఇటీవల జరిగిన విచారణపై చర్చించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను ఆర్డీవో పరిశీలించారు.

ఈదర వాగును పరిశీలించిన అధికారులు

ముండ్లమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పలు వాగులు పొంగి పొర్లే అవకాశం ఉందని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. తొందరపడి ఎవరూ వాగుల్లోకి దిగవద్దని అన్నారు. మంగళవారం మారెళ్ళ సమీపంలోని ఈదర వాగును ఎస్‌ఐ నాగరాజుతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ రాత్రుల సమయాల్లో ఎవ్వరినీ వాగుల్లోకి దిగకుండా చూడాలన్నారు. ప్రస్తుతం మండలంలో చిలకలేరు, తోడేళ్ళ వాగు, వేములవాగు, నక్కల వాగులు పొంగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆయా గ్రామాల వీఆర్‌వోలతో మాట్లాడారు. రాత్రుల సమయాల్లో వాగుల వద్ద టార్చ్‌లైట్లు ఉంచు కోవాలని సూచించారు. ఎస్‌ఐ నాగరాజు కూడా తన సిబ్బందితో వాగులను సందర్శించి వీఆర్‌ఏలు, గ్రామస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్‌వో గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో హుండీ అపహరణ



దొంగలు పగులకొట్టిన అమ్మవారి హుండీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

కురిచేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నమశ్శివాయపురం గ్రామంలో అంకాళపరమేశ్వరి దేవాలయంలో గుర్తు తెలియని దొంగలు సోమవారం రాత్రి ఆలయం తాళాలు పగుల కొట్టి హుండీని ఎత్తుకెళ్ళారు. నమశ్శివాయపురం నుంచి పడమర వీరాయపాలెం గ్రామానికి వెళ్ళే దారిలో హుండీని పగులకొట్టి అందులోని సొమ్మును దొంగిలించారు. ఉదయాన్నే ఆలయం వద్దకు వచ్చిన గ్రామస్థులు ఆలయం తాళాలు తీసి ఉండటం గమనించి లోపలికి వెళ్ళి చూడగా హుండీ కనపడకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. పడమర వీరాయపాలెం గ్రామానికి వెళ్ళే దారిలో హుండీ పగుల కొట్టి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇటీవలే అమ్మవారి తిరునాళ్ళ జరుగడంతో హుండీనిండా డబ్బులు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. సుమారు రు. 60 వేలకు పైగా అమ్మవారి సొమ్ము ఉంటుందని తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. 8 మందికి గాయాలు

కురిచేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కురిచేడులో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. 8 మందికిపైగా గాయాలపాలయ్యారు. వారంతా కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వ్యాక్సిన్ కోసం పరుగులు పెట్టారు. ప్రధాన కూడలిలో సోమవారం రాత్రి పిచ్చికుక్క తిరుగుతూ కనపడిన వారిని కనపడినట్లు కరిచింది. దాంతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. కురిచేడులోని ఓ ప్రముఖ మందుల దుకాణంలో పనిచేసే మణికంఠను సోమవారం రాత్రి కరిచింది. అదేరోజు దర్గా వద్ద ఇద్దరు బాలురును గాయపరిచింది. అటు నుంచి పాకనాటి రెడ్ల బజారుకు వెళ్ళి అక్కడ ఇద్దరిని కరచింది. మంగళవారం ఉదయం కొట్లబజరులో అప్పుడే తలుపులు తీస్తున్న జవ్వాజి విజయలక్ష్మిని గాయపర్చింది. ప్రధాన వీధిలో కొట్టు ముందు శుభ్రం చేస్తున్న శేషగిరి రావును కరవడంతో గాయపడ్డాడు. వీరంతా కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ వేయించుకున్నారు. పిచ్చి కుక్క కావడంతో వారికి యాంటీ రేబీస్ సీరమ్ ఇంజక్షన్ చేయాలని, అది పెద్ద వైద్యశాలలో మాత్రమే అందుబాటులో ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో వారంతా మార్కాపురం ఏరియా వైద్యశాల, వినుకొండ ఏరియా వైద్యశాలకు తరలివెళ్ళారు.

చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయినికి ఏడాది జైలు

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయునికి ఏడాది జైలు శిక్షతో పాటు పరిహారాన్ని విధిస్తూ మంగళవారం న్యాయాధికారి భరత్‌చంద్ర తీర్పు ఇచ్చారు. కనిగిరి మండల పరిధిలోని గురువాజీపేట గ్రామానికి చెందిన కుమ్మరికుంట ప్రమీల అనే ఉపాధ్యాయిని బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తూము ఆదిరెడ్డి వద్ద రూ.5 లక్షల 10వేలు అప్పుగా తీసుకుని చెక్ ఇచ్చారు. నాలుగేళ్ళ క్రితం తూము ఆదిరెడ్డి కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం ఉపాధ్యాయినికి న్యాయాధికారి కె.భరత్‌చంద్ర ఏడాది జైలు, రూ.8లక్షలు విధించారు. సదరు ఉపాధ్యాయిని మరో వ్యక్తి తమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన తమ్మినేని ఫణీంద్ర అనే వ్యక్తి నుంచి రూ3 లక్షల 25వేలు అప్పుగా తీసుకుని రూ.5 లక్షలకు చెక్ ఇవ్వగా, బౌన్స్ అయింది. దీంతో ఫణీంద్ర మూడేళ్ళ క్రితం కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం ఏడాది జైలు శిక్ష, రూ.5 లక్షల పరిహారం విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

తాళ్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి అన్నారు. మండలంలోని లక్కవరం, దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమాల్లో ఏపీవో మురళి, ఈసీ ప్రసాద్, టీడీపీ నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, హనుమారెడ్డి, పేరిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 25శాతం రాయితీతో అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో జ్యోష్నాదేవి అన్నారు. మండలంలోని మాచవరం, కాశీపురం గ్రామంలో మంగళవారం జరిగిన పోలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మినుము, శనగ, పొగాకు విత్తుకోవటానికి ప్రస్తుత వర్షాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం 25శాతం సబ్సిడీతో మినుము, శనగ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కంది పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సిబ్బంది కరిముల్లా, ఫిరోజ్, రైతు సేవాకేంద్రం సిబ్బంది కె.స్వర్ణ, వై.తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెట్ట పైర్లకు జీవం

కురిచేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పైర్లకు జీవం పోశాయి. ప్రధానంగా పొగాకు పంట జీవం పోసుకుని ఏపుగా పెరిగింది. ఎండి పోయే దశలో ఉన్న పైరు పచ్చగా కళకళలాడుతూ కనపడుతున్నది. అయితే, మరో రెండు రోజుల పాటు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ సూచనలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేలల్లో నీరు నిలిచి పంట కుళ్లి పోతుందేమోనని భయపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి
బాపట్ల
బుధవారం 16 అక్టోబరు 2024

ఇన్‌చార్జి మంత్రుల నియామకం


పార్థసారథి


గొట్టిపాటి రవికుమార్


కందుల దుర్గేష్

- గుంటూరు జిల్లాకు కందుల దుర్గేష్
- పల్నాడుకు గొట్టిపాటి, బాపట్లకు పార్థసారథి
- రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ
- ఇక జిల్లాల అభివృద్ధి అంశాలపై ఇన్‌చార్జి మంత్రుల సమీక్షలు

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరిగింది. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్షలు.. జిల్లా సమీక్ష మండలి సమావేశాలు.. ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో జరుగుతుంటాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఇన్‌చార్జి మంత్రుల నియామకం ఉంటుందని అందరూ భావించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇన్‌చార్జి మంత్రులను నియమించలేదు. ఈ క్రమంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా ప్రొటోకాల్ మంత్రిని నియమించి ఆ కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా ప్రభుత్వం చూసింది. ఇప్పుడు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ మంగళవారం ఇన్‌చార్జి మంత్రుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఇక నుంచి జిల్లా అభివృద్ధికి సంబంధించి అన్ని అంశాలపై ఆయా ఇన్‌చార్జి మంత్రులు సమీక్షించనున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా సమీక్ష మండలి సమావేశాల్ని నిర్వహించి ప్రాధాన్య అంశాలపై చర్చించి ప్రభుత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి ఇన్‌చార్జి మంత్రులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో డీఆర్సీ మీటింగ్ జరుగుతుంది. ఈ సమావేశం ఆరు నెలల వ్యవధిలో జరగడం అనేది తప్పనిసరి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇప్పటికే నాలుగు నెలలు దాటడంతో పాటు ఇన్‌చార్జి మంత్రుల నియామకం కూడా జరగడంతో త్వరలోనే డీఆర్సీ మీటింగ్ జరపడానికి ఆయా జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పాలనాపరమైన వ్యవహారాలను కూడా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షించే వీలుంది. గత ప్రభుత్వంలో డీఆర్సీ సమావేశాలు ఓ దశ, దిశ లేకుండా మొక్కుబడిగా సాగేవి. కూటమి ప్రభుత్వంలో ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో జరిగే డీఆర్సీ సమావేశాలు జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కందుల దుర్గేష్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వంలో దుర్గేష్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరపున జనసేన అభ్యర్థిగా నిడదవోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొంది ఆ తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. దుర్గేష్‌కు ఇన్‌చార్జి మంత్రి పదవి రావడంతో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

- పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ నియమితులయ్యారు. బాపట్ల జిల్లా అద్దంకి అసెంబ్లీ నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ ఇంధనశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి కూటమి ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి రవికుమార్

పల్నాడు జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సమన్వయంతో పనిచేస్తానన్నారు. టీం వర్క్‌తో జిల్లాను ముందుకు తీసుకువెళతానన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేందుకు ప్రయత్నిస్తానని గొట్టిపాటి చెప్పారు.

- బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొలుసు పార్థసారథి నియమితులయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్థసారథి కూటమి ప్రభుత్వంలో గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో త్వరలో డీఆర్సీ మీటింగ్ జరగనున్నది.

ఊరూరా పల్లె పండుగ

- జిల్లా వ్యాప్తంగా 78 గ్రామాల్లో కార్యక్రమం
- పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు అనగాని, గొట్టిపాటి

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాలు ఊరూర జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం జిల్లాలోని 78 గ్రామాల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో జరిగిన పల్లె పండుగలో పాల్గొన్న మంత్రి రవికుమార్ రూ.40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించతలపెట్టిన పలు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే రూ.4,500 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.60 కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, గోకులం షెడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తే తమ ప్రభుత్వం జవసత్వాలు అందించే దిశగా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రేపల్లె రూరల్ మండలం బేతపూడి గ్రామంలో జరిగిన పల్లె పండుగలో పాల్గొన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలకులు పల్లెల్లో సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. గ్రామాల అభివృద్ధి, స్వరాజ్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్షతో పల్లె సీమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. కర్లపాలెం గ్రామంలోని పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు



పమిడిపాడులో జరిగిన పల్లె పండుగలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రూ.89 కోట్లతో పనులు..

బేతపూడిలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి అనగానితో కలిసి కలెక్టర్ వెంకటమురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో రూ.89 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి నియోజకవర్గానికి దాదాపుగా పది కోట్లకు పైనే నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

కొనుగోళ్లపై కలవరం

- మార్కెట్‌లో పత్తి ధర పతనం
- మార్కెట్ శాఖ సిద్ధం.. ఊసెత్తని సీసీఐ
- మద్దతు ధర దక్కకపోవడంతో రైతు దిగాలు
- క్వింటాకు రూ.1,500 వరకు ధర తగ్గిన వైనం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతుల ఇంట సిరులు కురిపించాల్సిన తెల్ల బంగారానికి ఆరంభంలోనే మద్దతు ధర కరువవుతోంది. ధర నేల చూపులు చూస్తుండటంతో రైతుల్లో కలవరం మొదలైంది. సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందా లేదా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొంది. సీసీఐ కేంద్రాలు ఇంకా ఏర్పాటు కాలేదు. మార్కెట్ యార్డులో కేంద్రాల ఏర్పాటు విధానానికి సీసీఐ స్వస్తి పలికింది. అయితే పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే దిశగా సీసీఐ ఉంది. అయితే వాటికి సంబంధించి కూడా ఇంకా నోటిఫై చేయకపోవడం రైతులకు శరాఘాతంగా మారింది. మార్కెట్ శాఖ పత్తి కొనుగోలుకు సీసీఐకి సహకరించేందుకు సమాయత్తమైనా సీసీఐలో ఇంకా చలనం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రైతులు చేతికి వచ్చిన పత్తిని విక్రయిస్తుండగా ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.6500 నుంచి రూ.6 వేలకు అడుగుతున్నారు. క్వింటాకు కేంద్రం మద్దతు ధర 7,521 ప్రకటించగా మార్కెట్‌లో అంతకుమించి ధర పలుకుతుందని రైతులు ఆశించారు. అయితే రూ.2000 వరకు ధర తగ్గడంతో రైతులు ఉసూరుమంటున్నారు. గతంలో మార్కెట్ యార్డుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీఐ పత్తి కొనుగోలు చేసేది. గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికింది. యార్డుల్లో కేంద్రాలకు బదులు పత్తి మిల్లులోనే కేంద్రాలను నిర్వహిస్తోంది. రైతులు నేరుగా వారి ప్రాంతానికి కేటాయించిన మిల్లుకు పత్తి తీసుకుపోవాలి. ఈ విధానంలో కేంద్రాలు అందుబాటులో లేక పోవడంతో రైతులపై రవాణా భారం పడుతుంది. నరసరావుపేట ప్రాంతంలో రైతులు చిలకలూరిపేట జిన్నింగ్ మిల్లుకు తీసుకుపోవాల్సి వస్తుంది.

రోజురోజుకు ధరలు పతనం..

పత్తి ధరలు బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పతనమవుతున్నాయి. సీసీఐ కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు



చేస్తేనే ధర నిలకడగా ఉంటుంది. అయితే ఇంతవరకు సీసీఐ నుంచి చలనం లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు మాయాజాలానికి తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేటై ధరలను తగ్గించేశారు. పత్తి చేతికి వచ్చే సమయంలో ధరలు దిగజారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల్లోనే క్వింటాకు రూ.1500 నుంచి రూ.2000 వరకు పడిపోయింది.

రైతుల ఆశలు ఆవిరి..

ఆగస్టు వరకు ధరలు మార్కెట్‌లో స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండటంతో రైతులు ఆ ధరలను చూసి ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. వేసవిలోనే పల్నాడు ప్రాంతంలో బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పత్తి చేతికి వచ్చింది. దిగుబడులు ఆరంభం కావడంతో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. రికార్డు స్థాయి ధరలను చూసి సాగు చేసిన రైతులు నిరాశకు గురయ్యారు. పత్తి చేతి కొచ్చే సమయంలో ధర పడిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ.8 వేల నుంచి రూ.6,500 నుంచి రూ.6 వేలకు ధర పడిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు.

2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పల్నాడు ప్రాంతంలో దిగుబడులు వచ్చాయి. 1,54,875 ఎకరాల్లో సాగుతో పల్నాడు జిల్లాలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. గుంటూరు జిల్లాలో 53,275 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,065 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు మంజూరు కాగా ఆయా కేంద్రాలకు ఇన్‌చార్జిలను కూడా నియమించారు. అయితే కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై మార్కెటింగ్ శాఖ ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి వివరణ కోరగా ఇంకా రానున్న వారం రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. సీసీఐకి పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి... జే బ్రాండ్స్‌కు బ్రేక్

- జిల్లా వ్యాప్తంగా 117 నూతన మద్యం షాపులు ప్రారంభం
- లైసెన్సు ఫీజు కింద తొలి వాయిదా చెల్లింపు పూర్తి
- ముమ్మరంగా సాగుతున్న బేరసారాలు

బాపట్ల, అద్దంకి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నాణ్యతలేని మద్యం బ్రాండులకు ఇకపై స్వస్తి పలికే విధంగా బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది. 7 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 117 మద్యం దుకాణాలు కొత్తగా తెరుచుకోనున్నాయి. సోమవారం జరిగిన లాటరీ ప్రక్రియలో భాగంగా షాపులు దక్కించుకున్న వారందరూ సాయంత్రానికే లైసెన్సు ఫీజు కింద చెల్లించాల్సిన తొలి వాయిదా మొత్తాన్ని జమ చేశారు. మంగళవారం స్టాక్ కోసం ఇండెంట్ పెట్టే ప్రక్రియ ఈఎస్ పర్యవేక్షణలో జరిగింది. పదిహేను రోజుల పాటు షాపు దక్కించుకున్న వారికి ప్రొవిజనల్ లైసెన్సును ఎక్సైజ్ శాఖ అందించనుంది. ఈ లోపుగా మద్యం దుకాణం లొకేషన్ విషయంలో నిబంధనల ప్రకారం ఓ నిర్ణయానికి లైసెన్సుదారుడు రావాల్సి ఉంది. అప్పటి వరకు వారివారి పరిధిలో టెంపరరీగా షాపు నిర్వహించుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. ఒకే ప్రదేశానికి ఇద్దరు, ముగ్గురు పోటీ పడే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక చోట షాపును పెట్టిన తర్వాత అక్కడ నుంచి మార్చాలంటే ఎక్సైజ్ విభాగానికి అదనపు మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో షాపు లొకేషన్ విషయంలో లైసెన్సుదారులు ఆచితూచి అడుగేస్తున్నారు

ఇక ప్రైవేటు మద్యం దుకాణాలే...

వైసీపీ పాలనలో ప్రభుత్వ మద్యం షాపులు నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం విధానం ప్రకారం బుధవారం నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం షాపులు వెళ్లనున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న స్టాకుతో పాటు ఫర్నీచర్ ఇతర ఆస్తులను స్టాక్ డిపోలకు తరలించారు. చీరాల, అద్దంకి, పర్చూరు స్టేషన్ల పరిధిలోని షాపులు ఒంగోలు డిపో నుంచి స్టాక్ తెచ్చుకునే లా ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది


అద్దంకిలో దుకాణ ఏర్పాటు పనులు

నేతల అనుచరులకు మొండిచెయ్యి....

దాదాపు ప్రతి చోట పాలకపార్టీ నేతల అనుచరులు పెద్దఎత్తున మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోగా లాటరీలో వారందరికీ నిరాశే ఎదురైంది. లాటరీలో నిరాశే ఎదురైన వారు ప్రస్తుతం సదరు కీలకనేతల వద్ద తమను ఏదో ఒక షాపులో భాగస్వాములుగా చేర్చాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దరఖాస్తు రుసుం పేరిట భారీ ఎత్తున నష్టపోయామని తమకు న్యాయం చేయాలని నేతల వద్ద అనుచరులు వాపోతున్నట్లు తెలిసింది. బాపట్ల నియోజకవర్గ పరిధిలో రెండు షాపులను పొరుగు జిల్లాలకు చెందిన వారు దక్కించుకున్నారు. సదరు షాపులలో తమ వారిని కూడా భాగస్వాములుగా చేయడానికి పథక రచన చేస్తున్నారు. సింగిల్ దరఖాస్తుతో లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వేరే ఔత్సాహిక వ్యాపారులకు దానిని విక్రయించడానికి సిద్ధపడినట్లు సమాచారం. ఇప్పటికే తొలి విడత లైసెన్సు ఫీజు కట్టినప్పటికీ దానితో కలిపి రూ.40 లక్షలు ఇస్తే తన షాపును వదులుకోవడానికి సిద్ధమనే సంకేతాలను బాపట్లలోని ఓ లైసెన్సుదారుడు పంపించినట్లు సమాచారం.

వాటాల కోసం వేట

అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 23 మద్యం షాపులు ఏర్పాటు కానుండగా, ఆయా మండలాల పరిధిలో ఎక్కడైనా షాపు ఏర్పాటుకు అవకాశం ఉంది. దీంతో మంచి వ్యాపారం సాగే గ్రామం లేదా సెంటర్‌పైనే ఎక్కువ మంది ఉత్సాహం చూపిస్తున్నారు. కొంత మంది సిండికేట్‌గా పెద్ద మొత్తంలో దరఖాస్తులు చేసినా షాపులు దక్కకపోవడంతో ఏదో ఒకలా మద్యం షాపు ఏర్పాటు చేయాలన్న తలంపుతో లాటరీలో షాపు దక్కించుకుని అధికార బలంలేని వ్యక్తుల వద్ద గుడ్‌విల్ కింద కొంత మేర ఇవ్వటమో లేదా వాటాలు పొందే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. షాపుల ఏర్పాటుపై ఇంకా పూర్తి నిర్ధారణకు రాక మునుపే బెల్ట్‌షాపుల నిర్వాహకులు గాలం వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైతే ముందస్తుగానే పెట్టుబడి పెట్టేందుకు కూడా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తుంది. కొరిశపాడు మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న గ్రామంలో మద్యం షాపు పెట్టే అవకాశం ఉండడంతో సమీపంలో ఉన్న మరో మేజర్ గ్రామపంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు ఇప్పటికే సదరు లైసెన్స్‌దారుడిపై అన్ని రకాల ఒత్తిడి ప్రారంభించినట్లు తెలుస్తుంది. పంగులూరు మండలంలోని ఓ చిన్న గ్రామానికి చెందిన వ్యక్తి ఎట్టి పరిస్థితిలో బెల్ట్ షాపు తనకు కాకుండా వేరే వాళ్లకు అవకాశం ఇవ్వవద్దని మాట తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అద్దంకి మండలంలో తిమ్మాయపాలెం, గోపాలపురం లేదా కలవకూరు రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉండడంతో ఆ సమీప గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించే వ్యక్తులు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దంకి పట్టణంలో మొత్తం 5 షాపులు కాగా ఇప్పటికే కొంతమంది షాపు ఏర్పాటు స్థలాల పై స్పష్టతతో ఉండి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాతృత్వానికి ఓ ముహూర్తం



సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన రాజు, కుమారి (పేర్లు మార్చి ఇస్తున్నాం) దంపతులు. రాజు బేల్దారి మేస్త్రి. కుమారి గృహిణి. వీరికి తొలి కాన్పులో నెలలు నిండాక అక్టోబరు 7న కుమారుడు పుట్టాడు. రెండేళ్లకు మళ్లీ గర్భిణి అయ్యింది. రెండో బిడ్డను కూడా అక్టోబరు 7నే కనాలని ఆ దంపతులు భావించారు. వైద్యులపై ఒత్తిడి చేసి 8 నెలలకే కాన్పునకు సిద్ధపడి తొలి బిడ్డను కన్న రోజునే సిజేరియన్ చేయించారు. శిశువును రెండు వారాలు ఇంక్యుబేటర్‌లో ఉంచారు.

ఒంగోలుకు చెందిన సుబ్బారావు దంపతులు స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న తమ బిడ్డ జన్మించాలని భావించారు. నగరంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ బిడ్డకు 9 నెలలు నిండేందుకు ఇంకా వారం రోజులు ఉన్నప్పటికీ ఆగస్టు 14న అర్ధరాత్రి 12.05 గంటలకు కాన్పు చేయాలని వైద్యులపై ఒత్తిడి చేసి నెలలు నిండక ముందే సుబ్బారావు తన భార్యకు కాన్పు చేయించారు.

పొదిలికి చెందిన ఓ టీచర్ తమ మొదటి సంతానం కోసం ఒంగోలులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యం పొందడంతోపాటు, తమకు పుట్టబోయే బిడ్డ తమ తల్లిదండ్రుల పెళ్లి రోజుకు గుర్తుగా, జూన్ 10వ తేదీన పుట్టేలాగా ముహూర్తం నిర్ణయించుకున్నారు. వైద్యులను బతిమాలుకొని నెలలు నిండక ముందే డెలివరీ చేయించారు.

- ముఖ్యతేదీలు, ప్రముఖ దినోత్సవాలు.. ఒకే రోజు జన్మదినాల కోసం ఆరాటం
- తల్లీబిడ్డలకు అనారోగ్యమంటున్న వైద్యులు
- అవగాహన కార్యక్రమాలు అవసరం
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే సాధ్యం

తల్లి గర్భంలో నవమాసాలు ఎదిగిన శిశువు నిండు ఆరోగ్యంగా జన్మిస్తారు. అలా జన్మించాల్సిన బిడ్డలు కొందరి తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దల అత్యుత్సాహం, మూఢత్వం కారణంగా నెలలు నిండకముందే బాహ్యప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు. పది మంది గుర్తింపు కోసం కొందరు.. ఇంట్లో బిడ్డల పుట్టినరోజు ఒకే తేదీన రావాలని మరికొందరు.. పుట్టినరోజుకు ఒక ప్రత్యేక దినోత్సవం ఉండాలని ఇంకొందరు... ఫలానా నక్షత్రాన పుడితే మహాత్ములవుతారనే మూఢత్వంతో మరికొంత మంది తల్లిదండ్రులు అజ్ఞానంతో ముందస్తు ప్రసవాలకు సిద్ధపడుతున్నారు. ఇటీవల ఇటువంటి ఒత్తిళ్లు డాక్టర్లపై ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే క్రమంలో వారికి తెలియకుండానే ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. నెలలు నిండకముందే ప్రసవాలతో తల్లీబిడ్డలకు ఉండే ప్రమాదాల పై అవగాహన కల్పించేదే ఈ కథనం..

పుట్టే శిశువుకూ సమస్యే

శస్త్ర చికిత్స ద్వారా ముందస్తు ప్రసవంతో పుట్టే బిడ్డ తక్కువ బరువుతో ఉంటుంది. ఊపిరితిత్తులు సరిగా ఎదగకపోవడతో శ్వాసకోశ సమస్యలొస్తాయి. ఎన్ఐసీయూలో చేర్చాల్సి వస్తుంది. కొన్నిసార్లు కామెర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు. పుట్టిన తరువాత కూడా రోగనిరోధక శక్తి మిగతావారికి కంటే తక్కువగా ఉంటుంది. భవిష్యత్తులో చిన్నచిన్న సమస్యలకే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది. వారు జీవిత కాలం రకరకాల జబ్బుల బారిన పడతారు. ఇందుకు తల్లిదండ్రులే కారణమవుతారు.



ముందస్తు ప్రసవంతో అనర్థాలివే

గర్భిణి నెలలు నిండక ముందే ప్రసవిస్తే అనేక అనారోగ్య సమస్యలుండే అవకాశముంది. భవిష్యత్‌లో సాధారణ కాన్పునకు అవకాశాలు కోల్పోవచ్చు. అవసరం లేకపోయినా, శస్త్ర చికిత్స చేయడం వల్ల తల్లి ఆరోగ్యానికి, ప్రాణానికి హాని కలుగుతుంది. తల్లిపాలు సరైన సమయంలో పుట్టిన బిడ్డకు అందే అవకాశం ఉండదు. మరోముఖ్యమైన విషయం తల్లీబిడ్డకు ప్రమాదకర ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉంటుంది.

జాతకాలతో ముందస్తు ప్రసవాలపై ఆసక్తి | ఇటీవల పెరిగిన నూతన పోకడ

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతకాలు, నక్షత్రాల నమ్మకాలతో ముందస్తు ప్రసవాలపై ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఊరంతా పండుగలా జరుపుకునే ఆగస్టు 15, జనవరి 1, పూర్వీకులు, పెద్దల పెళ్లిరోజు, పుట్టిన రోజులను గుర్తుండిపోయేలా వేడుకలను నిర్వహించుకోవడం సర్వసాధారణమైంది. ఈ తరహా ముందస్తు ప్రసవాల సాంప్రదాయం కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది.

600 ప్రసవాల్లో సగానికిపైగా సిజేరియన్లే

జిల్లాలోని 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 2 పీపీ యూనిట్‌లు, 3 ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా వైదశాల, ఒక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఒక మాతా శిశు వైద్యశాల ఉన్నాయి. జిల్లాలో 250కి పైగా ప్రవేటు ఆసుపత్రులున్నాయి. అన్ని ఆస్పత్రుల్లో కలిపి ఈ పది నెలల్లో దాదాపు ఆరువేల ప్రసవాలు జరిగాయి. వీటిలో సగానికిపైనే సిజేరియన్లు. ఎలాగూ ఆపరేషన్ కాబట్టి తమను అనుకూలమైన తేదీల్లో, ఇష్టమైన రోజుల్లో కాన్పు చేయిస్తే బాగుంటుం దని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. కొన్నిచోట్ల నవమాసాలు నిండాకే ప్రసవం చేయాల్సి ఉన్నా తల్లిదండ్రులు ఒత్తిడికి తలొగ్గి ముందస్తు ప్రసవం చేయాల్సి వస్తోందని వైద్యులు వెల్లడిస్తున్నారు. శిశువు శరీరంలో అన్ని అవయవాలూ పూర్తి స్థాయిలో వృద్ధి చెందాలంటే 39 వారాలు సమయం పడుతుంది. అప్పుడు శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుంది. కానీ ముందస్తు ప్రసవాలతో తల్లీబిడ్డలు అనార్యోగ్యం బారిన పడుతున్నారు. ఒకవైపు సాంకేతికంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నా, నిరక్షరాస్యులతోపాటు అక్షరాస్యులు, ఉద్యోగులు దృష్టి సారించడం భవిష్యత్‌ను కలవరపెడుతుందని చెబుతున్నారు.

ముందస్తుకు కారణాలివే..

బిడ్డకు మంచి భవిష్యత్ ఉంటుందన్న నమ్మకంతో తిథులు, వారాలు, నక్షత్రాలు, పుట్టబోయే బిడ్డపై ప్రభావాన్ని చూపుతున్నా యని తల్లిదండ్రులు విశ్వసిస్తున్నారు. ప్రత్యేక రోజులు, ప్రము ఖుల జన్మదినాలు రోజున బిడ్డకు జన్మనివ్వాలని ఉవ్విళ్లూరుతున్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం



ముందస్తు ప్రసవాలు కారణంగా తల్లీ, బిడ్డ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. నెలలు నిండిన తర్వాత మాత్రమే కాన్పు జరగాలి. అలా జరగకపోతే నొప్పులు రావడానికి ఇంజెక్షన్‌లు వాడాల్సి వస్తుంది. దానివల్ల బిడ్డకు శ్వాస అందక ఆక్సిజన్ పెట్టాల్సి వస్తుంది.

- డాక్టర్ చాపల శాంతకుమారి, గైనకాలజిస్ట్, ఒంగోలు

ప్రభుత్వం అవగాహన కల్పించాలి



తిథులు, నక్షత్రాలు, జాతకాలు చూసి బిడ్డను కనడం అవివేకం. దీనిపై వైద్యులతోపాటు ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ముందస్తు ప్రసవాల నివారణకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



ఉప్పుగుండూరు సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు

రెడ్ అలర్ట్

- నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- వాతావరణ శాఖ హెచ్చరిక
- అర్ధరాత్రి నుంచే పశ్చిమ ప్రకాశంపై ప్రభావం
- జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్
- అవసరమైతేనే బయటకు రావాలని సూచన
- అధికారులతో మంత్రి స్వామి సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆమేరకు మంగళవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా పశ్చిమప్రాంతంపై ప్రభావం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కానుంది. కాగా సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 వరకు జిల్లాలో సగటున 51 మి.మీ వర్షపాతం నమోదైంది. సింగరాయకొండ, పొన్నలూరు, ఎన్‌జీపాడు, ఒంగోలు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపితోపాటు పలు మండలాల్లో 80 మి.మీ కంటే అధికంగా కురిసింది.

జిల్లాకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

పరిస్థితిని బట్టి అవసరమైన సహాయక చర్యలలో పాల్గొనేందుకు 30మందితో కూడిన ఒక ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కూడా జిల్లాకు వచ్చింది. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించేలా కలెక్టరేట్‌లో 1077 కంట్రోలు రూంను కూడా ఏర్పాటు చేశారు.

పశ్చిమప్రాంతంపై అర్ధరాత్రి నుంచే..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాలోని పశ్చిమప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం. అర్ధవీడు, దోర్నాల, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, రాచర్ల, ముండ్లమూరు మండలాల్లో అర్ధరాత్రి నుంచి ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) వచ్చే అవకాశం ఉంది. ఆయా మండలాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. పరిస్థితులను బట్టి అవస రమైతే మండల అధికారుల ఆదేశాల మేరకు సహాయక శిబిరాలకు వెళ్లాలని కోరారు.


18 గ్రామాలపై ప్రభావం

భారీ వర్షాలు జిల్లాలోని తీరప్రాంతా లైన నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తప ట్నం, సింగరాయకొండ మండలాల్లోని 18 గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటి పరిధిలోని 54 ఆవాసాల్లో ఉంటున్న 56,584 మంది ప్రభావితమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ గ్రామాల పరిధిలో పక్కాగృహాలు 9,860, సెమీ పక్కాగృహాలు 3,677, కచ్చా ఇళ్లు 1,058 ఉన్నట్లు గుర్తించారు. ఈ మండలాల్లో 33 పునరావాస కేంద్రాలను ముందస్తుగా గుర్తించడంతో పాటు ఇప్పటికే ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.


ఒక పంచాయతీ.. ఇద్దరు కార్యదర్శులు

- ఇరువురూ విధులకు హాజరు
- సిఫార్సు లేఖలు ఇచ్చిన నియోజకవర్గ నేత
- పెద్దారవీడు మండలంలో విచిత్ర పరిస్థితి

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక పంచాయతీకి ఒక కార్యదర్శి ఉంటారు. అది పద్ధతి. కానీ అధికారుల నిర్లక్ష్యం, అధికార పార్టీ నేతల చేతివాటంతో పెద్దారవీడు మండలంలోని ఓ పంచాయతీకి మాత్రం ప్రస్తుతం ఇద్దరు కార్యదర్శులు వచ్చారు. ఇరువురూ హాజరు పుస్తకంలో సంతకాలు చేస్తున్నారు. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగినిని ప్రస్తుతం మరో చోటుకు వెళ్లాలని మండల స్థాయి అధికారి ఆదేశించడంతో ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది.



దుద్దేల రామకోటమ్మకు జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్ కాపీ



ఇద్దరూ విధులకు హాజరైనట్లు సంతకాలు చేసిన రిజిస్టర్

కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌తోనే తాను విధుల్లో చేరినట్లు ఆమె చెబుతుండటం చర్చనీయాంశమైంది. పద్ధతి ప్రకారం తాను విధుల్లో చేరినా మరో ఉద్యోగిని కూడా అక్కడకే ఎలా పంపారని ఆమె మండల అధికారిని ప్రశ్నిస్తే నియోజకవర్గ నేత వద్దన్నారని సమాధానం ఇచ్చారు. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగికి కూడా నియోజకవర్గ నేత సిఫార్సు లేఖ ఇవ్వడం గమనార్హం. మండలస్థాయి అధికార పార్టీ నేత ఒకరు చేతివాటం చూపి ఈ వివాదానికి కారణమైనట్లు చర్చ జరుగుతోంది.

● 7వ తేదీన ఒకరు.. 8న మరొకరు

పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఈ నెల 7వ తేదీన దుద్దేల రామకోటమ్మ విధుల్లో చేరారు. ఆమె పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పుచ్చకాయలపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. ఆమె అధికార పార్టీ నియోజకరవ్గస్థాయి నేత వద్ద తీసుకున్న సిఫార్సు లేఖతోనే జిల్లా పంచాయతీ అధికారులు బదిలీ చేశారు. గంటవానిపల్లిలో రిలీవ్ అయిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దారవీడు ఎంపీడీవో అనుమతితో పుచ్చకాయలపల్లిలో విధుల్లో చేరారు. ఏమైందో ఏమో ఆ మరుసటి రోజునే 8వ తేదీన బి.చిన్నమంత్రునాయక్ అనే ఉద్యోగి కూడా పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. అతను కూడా నియోజకవర్గ నేత సిఫార్సుతోనే అదే పంచాయతీకి బదిలీ అయ్యారు. కొద్దిరోజులుగా ఇద్దరు గ్రామ సచివాలయానికి వెళ్లి హాజరుపట్టికలో సంతకాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎవరి వద్దకు వెళ్లి పనిచేయించుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

● మండలస్థాయి నాయకుని చేతివాటం

పుచ్చకాయలపల్లి గ్రామ పంచాయతీకి బదిలీపై వచ్చిన ఇద్దరికీ నియోజకవర్గ నేత ఇద్ద సిఫార్సు లేఖలు ఇప్పించింది ఓ మండలస్థాయి నాయకుడేనని చర్చ జరుగుతోంది. మొదట విధుల్లో చేరిన మహిళా ఉద్యోగికి పలు గ్రామాల నాయకులు చెప్పడంతో ఆగస్టులోనే సిఫార్సు లేఖ ఇప్పించారు. సెప్టెంబర్‌లో బదిలీల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మరో ఉద్యోగికి కూడా సిఫార్సు లేఖను అందించారు. తొలుత లేఖను తీసుకున్న రామకోటమ్మ అన్ని ఆర్డర్స్ తీసుకుని పుచ్చకాయలపల్లిలో ఉద్యోగంలో చేరారు. కానీ ఎలాంటి ఆర్డర్స్ లేకుండానే చిన్నమంత్రునాయక్‌ను మండలస్థాయి నేత చక్రం తిప్పి విధుల్లో చేర్చారని చర్చ నడుస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు అప్పట్లో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి ఒకే పోస్టులో ఇద్దరినీ చేర్చుకున్నారు. మండలస్థాయి అధికార పార్టీ నేతకు చేతులు తడపడంతోనే ఈ వ్యవహారం నడిపినట్లు పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో కీలక నాయకుడు కావడంతో నియోజకవర్గస్థాయి నేత కిమ్మనకుండా సిఫార్సు లేఖలు ఇస్తున్నట్లు అధికార పార్టీలోనే అంతర్గత చర్చ నడుస్తోంది.

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

పుచ్చకాయలపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఇద్దరూ విధుల్లో ఉన్న విషయాన్ని ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేశాం. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డి ఇద్దరినీ చేర్చుకోవడంతోనే ఈ సమస్య తలెత్తింది. ఇద్దరు కార్యదర్శులకూ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్స్ ఉన్నాయి. **- జాన్ సుందరం, ఎంపీడీవో, పెద్దారవీడు**

కొద్దిగంటలు తెరిపిచ్చి..

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొద్దిరోజులుగా ముసురుపట్టి కురుస్తున్న వాన మంగళవారం మధ్యాహ్నం నుంచి తెరపిఇచ్చింది. దీంతో రైతులు, సామాన్య జనం కాస్తంత ఊరట చెందారు. జిల్లాలో వారంరోజులుగా ఒక మోస్తరు జల్లులు పడుతుండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వాన జోరు అధికమైంది. మంగళవారం ఉదయం వరకు తెరపి లేకుండా పడుతూనే ఉంది. తూర్పుప్రాంతంలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో భారీ వర్షం కురిసింది. అయితే మంగళవారం రాత్రికి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

సగటున 71 మి.మీపైనే..

జిల్లాలో రెండు రోజుల్లో సగటున 71.10 మి.మీ వర్షపాతం నమోదు కాగా తొమ్మిది మండలాల్లో 100 మి.మీ కన్నా అధికంగా కురిసింది. గరిష్ఠంగా సింగరాయకొండ మండలంలో 163 మి.మీ వర్షపాతం నమోదైంది. నాగులుప్పలపాడులో 149.20, ఒంగోలులో 149.0, పొన్నలూరులో 145.60, టంగుటూరులో 136.20, జరుగుమల్లిలో 126.2, కొండపిలో 1214, కొత్తపట్నంలో 108.80, సీఎస్‌పురంలో 104.2 మి.మీ కురిసింది. మద్దిపాడు, పొదిలి, తాళ్లూరు, పామూరు, వీసీపల్లి, సంతనూతలపాడు, చీమకుర్తి, ముండ్లమూరు, మర్రిపూడి తదితర మండలాల్లో 70 నుంచి 100 మి.మీ పడింది. ఇతర మండలాల్లోనూ ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. వీటి ప్రభావం తూర్పుప్రాంతంలో అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. కొన్ని గ్రామాల్లో పొలాల్లోకి నీరు చేరింది. అలాగే ఒంగోలు నగరంలోని పలు శివారు కాలనీలు జలమయమయ్యాయి.

అధికారులతో సమీక్ష

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో కూడా వర్షం అధికం ఉన్నచోట్ల పొలంలోకి నీరు చేరి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో మంత్రి డాక్టర్ స్వామి మంగళవారం ఉదయం స్థానిక ప్రకాశం భవన్‌లో కీలక అధికారులతో వర్షాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత అక్కడి కంట్రోల్ రూంను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన అనంతరం కలెక్టర్ అన్సారియాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పొలంలో నీరు బయటికి పంపే పనుల్లో రైతులు

మరోవైపు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలు నగరపరిధిలోని శివారు కాలనీల్లోనూ, కొత్తపట్నం మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోనూ పర్యటించి పలు అంశాలను పరిశీలించారు. కాగా మంగళవారం పగటిపూట వర్షం తెరపి ఇవ్వడంతో ప్రజానీకం కాస్తంత ఊపిరిపీల్చుకున్నారు. రైతాంగం పొలంలో నీటిని బయటకు పెట్టే పనులు చేస్తుండగా యంత్రాంగం లోతట్టు ప్రాంతాల నుంచి వర్షపు నీరు తొలగింపు, కాలువలలో పూడికతీత ఇతరత్రా పనులు చేపట్టారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్న నేపథ్యంలో ఈనెల 18వరకు భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో యంత్రాంగం మాత్రం అప్రమత్తంగానే ఉంది. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై దృష్టిపెట్టి పని చేస్తోంది.

125 హెక్టార్లలో సజ్జ పంటకు నష్టం

జిల్లాలో వర్షాలకు 125 హెక్టార్లలో సజ్జ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వెలిగండ్ల మండలంలో 105 హెక్టార్లు, పామూరు మండలంలో 18 హెక్టార్లు, ఎన్‌జీపాడు మండలంలో 2 హెక్టార్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆ మేరకు కలెక్టర్‌కు వ్యవసాయాధికారులు ప్రాథమిక నివేదికను అందజేశారు.

అందుబాటులో సరుకులు

భారీవర్షం సూచన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో ఐదింటిని తుఫాన్ ప్రభావిత మండలాలుగా గుర్తించారు. ఆయా మండలాలకు ఒంగోలు, సింగరాయకొండ స్టాక్ పాయింట్ల నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్ ఇవ్వనున్నారు. అందుకు సంబంధించి 375 మెట్రిక్ టన్నుల బియ్యం, 15 మెట్రిక్ టన్నుల పంచదార, 15 మెట్రిక్ టన్నుల కందిపప్పును సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. పామాయిల్ సరిపడా లేకపోవడంతో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఆదేశాల మేరకు కొనుగోలు చేయనున్నారు. తుఫాను బాధిత ప్రాంతాల్లోని రేషన్‌షాపులకు ఆయా సరుకులను సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

కిక్కు రెడీ!

- నేటి నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు
- బడి, గుడికి 100 మీటర్ల దూరంలో షాపు
- తగ్గిన ప్రీమియం బ్రాండ్ల ధరలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ ప్రకారం విక్రయాలకు అంతా సిద్ధమైంది. నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది. ప్రీమియం బ్రాండ్లు తక్కువ ధరకు ఇవ్వనున్నారు. ప్రైవేటు షాపులలో మద్యం విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. 171 మద్యం దుకాణాలకు ప్రొవిజనల్ లైసెన్స్‌లు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వారు విక్రయాలను ప్రారంభించేందుకు డిపో నుంచి మద్యాన్ని షాపులకు తరలిస్తున్నారు. అలాగే క్వార్టర్ బాటిల్ ధర రూ.40 తగ్గించనున్నారు. ఇప్పటికే కొన్ని బ్రాండ్లు రూ.180కు అందుబాటులోకి వచ్చాయి. బీరు ధర కూడా రూ.40 తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం పాత ధరలతో కొనుగోలు చేసిన స్టాకు అయిపోయిన తర్వాత వచ్చే మద్యం ధర తగ్గడంతోపాటు పాపులర్ బ్రాండ్లు తీసుకురానున్నారు. మద్యం లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు కొంతమంది షాపులు అద్దెకు తీసుకునే పనిలో ఉండగా, ముందుగానే తీసుకున్న మరికొందరు మద్యం నిల్వలను దుకాణాలకు చేర్చుకునే పనిలో పడ్డారు.

సరసమైన ధరలకు ప్రీమియం బ్రాండ్లు

మందుబాబులకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇవ్వాలని ప్రభుత్వం నూతన పాలసీ తీసుకొచ్చింది. లాటరీ పద్ధతిలో లైసెన్సీలను ఎంపిక చేసి ఈనెల 16 నుంచి ప్రైవేటు షాపులలో మద్యం విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఎంసీ విస్కీ, ఐబీ క్వార్టర్ బాటిల్ రూ.180కు విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ఆ రెండు బ్రాండ్‌లు సర్కార్ మద్యం షాపులలో అసలు దొరకలేదు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రెండు బ్రాండ్లను విక్రయిస్తున్నారు. అదేవిధంగా పాపులర్ బ్రాండ్ మద్యం అందుబాటులోకి తీసుకురానున్నారు.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోవాలి

స్థానికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికార యంత్రాంగం సన్నద్ధమవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పేర్కొన్నారు. ఆదిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా జిల్లాలోని పరిస్థితి, లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వివిధ సేవలకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. ఆయా అంశాలపై స్వామి మాట్లాడుతూ వచ్చే మూడు రోజుల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత మేరకు నివారించాలన్నారు. ఇటీవల బదిలీలు జరిగినందున మండల స్థాయి అధికారులు కొత్తగా వచ్చారని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులను అందుకుంటామని మంత్రి పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించినందున మత్స్యకారులతో పాటు భృతి కోల్పోయిన వారికి సాయం అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ప్రధానంగా కాజ్‌వేలపై నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు వాటిపై రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడటంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు 700 విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామని, అందుకు అవసరమైన 300మంది కార్మికులను సిద్ధంగా ఉంచామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ బేబిరాణి, బాలశంకరరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, గోపీచంద్, పి. శ్రీనివాస ప్రసాద్, జి.వెంకటనాయుడు, సుశీల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోలు రూమును మంత్రి డాక్టర్ స్వామి పరిశీలించారు. విపత్తు నిర్వహణశాఖ డీపీఎం మాధురి ఆధ్వర్యంలో 24గంటల పాటు పనిచేసేలా ఈ కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.


మాట్లాడుతున్న మంత్రి స్వామి

అధ్వాన రహదారికి మోక్షం

రూ.2 లక్షల సొంత నిధులతో మరమ్మతులు

ఐదు గ్రామాల ప్రజలకు తీరిన ఇక్కట్లు


గోతులు పూడ్చిన తరువాత రహదారి ఇలా

ముండ్లమూరు, అక్టోబరు 15: అతనిది కంచు సంకల్పం.. ఆ సంకల్పంతో ఓ అడుగు ముందుకు వేశాడు. సొంత నిధులతో నాలుగు కిలోమీటర్ల రహదారిని మరమ్మతులు చేయించి ఐదు గ్రామాల ప్రజల ఇక్కట్లు తీర్చాడు. మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కంచుమాటి శ్రీనివాసరావు వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం, ఈదర వెళ్ళే రహదారికి తన సొంత నిధులు రూ2 లక్షలు వెచ్చించి రహదారికి పడిన గోతులు పూడ్చించారు. అలాగే, అధ్వానస్థితికి చేరిన నాలుగు కిలో మీటర్ల రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు సైతం తొలగించారు. తద్వార వేములబండ గ్రామస్థుల కష్టాలు తీర్చటమే కాకుండా ఆ రహదారిపై ప్రయాణించే రమణారెడ్డి, అయోధ్య నగర్, ఈదర, బొప్పూడివారిపాలెం, వేముల గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఆ రహదారి గోతులమయమైనా ఏమాత్రం పట్టించుకోలేదు. చినుకు పడితే రహదారి మొత్తం చిత్తడిగా మారి ద్విచక్ర వాహనాల చోదకులు సైతం వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో కంచుమాటి శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి టిప్పర్లతో గ్రావెల్ మట్టిని తీసుకువచ్చి రహదారి గుంటలను పూడ్చటమే కాక గ్రావెల్ మట్టిని రోడ్డు అంతా పరిచి చదును చేయించాడు. దీంతో వాహన చోదకుల ఇక్కట్లు తొలగిపోయాయి. దీంతో పలువురు ఆయనను అభినందిస్తున్నారు.

వాన నీటితో విద్యార్థులకు అవస్థలు

విద్యాశాఖ అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

కారంచేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడుమండలం దగ్గుబాడు గ్రామంలోని ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే ప్రాంగణంలో నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కారంచేడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాల్‌లో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కారంచేడు మండలం దగ్గుబాడులో ఎంపీపీ స్కూల్ పరిస్థితిపై సర్పంచ్, కోఆప్షన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా పెద్ద ఎత్తున పాఠశాల ప్రాంగణంలో నీరు చేరడంతో ఇబ్బందులు తలెత్తుతు న్నాయన్నారు. ఎంపీపీ వాసుబాబు మాట్లాడుతూ వర్షాల కారణంగా కప్పలవాగు, మొండికాలువకు పడ్డ గండ్లు పూడ్చేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం మండల వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సమావేశంలో ఎంపీడీవో నేతాజీ, ఈవోఆర్డీ రమేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిత, ఎంఈవో సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని వల్లాపల్లి గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కజొన్నను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో చేరే నీటిని బయటకు పంపాలన్నారు. పొగాకు పంటను తగ్గించి పప్పు ధాన్యం సాగు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు అయిన రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాలలో ఉన్నాయని జాబితాలను తనిఖీ చేసుకొని లోపాలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు దద్దాల అంజయ్య, ఏఈవో వంశీ, విఏఏలు ప్రవిణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మేదరమెట్ల : వర్షాల వలన మినుము, పెసరకు ఇనుప ధాతువు వచ్చే అవకాశం ఉందని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పమిడిపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మినుము, పెసరను పరిశీలించారు. లేత మినుము, పెసర పంటలలో వర్షపు నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసోవాలని ఏవో సూచించారు. లీటర్ నీటికి అన్నబేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 5 గ్రాములు, యూరియా 15 గ్రాములు కలిపి వారంలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసంగులపాడు, పమిడిపాడు రైతులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు బలరామిరెడ్డి మృతి

పంగులూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బూదవాడ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈమని బలరామిరెడ్డి (73) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందారు. నాలుగు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై ఇంకొల్లు వెళుతూ బైకు అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతనికి గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. బలరామిరెడ్డి మృతదేహాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంపని రవిబాబు, టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ గాదె బ్రహ్మారెడ్డి, రాజేష్ సందర్శించి నివాళులర్పించారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ వైద్యుడి ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 15లక్షల విలువైన ఆభరణాలు అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన స్థానిక కర్నూలురోడ్డులోని సాయినగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. రిమ్స్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న సుబ్బారావు, ఆయన భార్య ఆదివారం ఇంటికి తాళం వేసి బాపట్లకు వెళ్ళి తిరిగివచ్చారు. వారు తమ వెంట బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి శుభకార్యంలో పాల్గొన్న తరువాత వాటిని బ్యాగ్‌లో పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి తిరిగి ఒంగోలు వచ్చి వారు తమ బ్యాగ్‌లను హాలులోనే ఉంచి బెడ్‌రూంలో పడుకున్నారు. తెల్లవారి లేచి చూసే సరికి బంగారపు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించ లేదు. దీంతో పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. అదే సమయంలో బాపట్లలో శుభకార్యానికి వెళ్ళిన చోట మరిచిపోయి ఉండవచ్చున భావించి అక్కడా వెతికారు. అయితే మంగళవారం ఉదయం అభరణాలు ఉన్న బ్యాగ్ సుబ్బారావు ఇంటి సమీపంలో కాలువలో కనిపించింది. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసులు సమాచారం ఇచ్చారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

పంగులూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. అలవలపాడు, రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.2.3లక్షల వ్యయంతో గోకులం షెడ్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు, స్థానిక నేతలు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, నోడల్ అధికారులు పి.శివయ్య, ఆదినారాయణ, నాయకులు షేక్ మస్తాన్ వలి, కోమటి ప్రసాద్, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, చల్లగుండ్ల కోటేశ్వరరావు, నారాయణస్వామి, ప్రసన్న, కార్యదర్శులు సునీత, లక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


రేణంగివరంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

బల్లికురవ : చెన్నుపల్లి, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో మంగళవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. అధికారులు గ్రామాలలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమాలు చేపట్టి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాలలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని సత్వరమే పనులు ప్రారంభించాలని వారు కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, కార్యదర్శులు మీరావలి, సర్పంచ్‌లు పందిరి అంజిబాబు, దూళిపాళ్ల బుల్లిరామయ్య, టీడీపీ నేతలు ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, బెల్లంకొండ సుబ్బయ్య పాల్గొన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో కలాం జయంతి కార్యక్రమాన్ని పాత దర్శి రోడ్డులోని ఎస్టీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యా ద్వారానే పేదరికం పోతుందని తెలిపారు. అక్కడ ఉన్న ఎస్టీలకు పిఎస్ కోటేశ్వరరావు సౌజన్యంతో ఉలెన్ దుప్పట్లు అందజేశారు. అనంతరం అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. దాత కోటేశ్వరరావును క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీరాలటౌన్ : బహుముఖ ప్రజ్ఞాశాలి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఆశయాలపై నేటి యువతరానికి అవగాహన ఉండాలని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్‌లో కలాం సేవా సమితి ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. రాష్ట్రపతిగా కలాం అందించిన సేవలను గుర్తుచేశారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సుభాషిణి ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు షేక్ సలామ్, సయ్యద్ బాబు, అక్బర్, అన్సారీ, వదూద్, అల్లాబక్ష్, గౌస్, జమీర్ పాల్గొన్నారు.

మార్టూరు : కలాం జయంతిని మంగళవారం మండలంలోని వలపర్ల జడ్‌పీ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొమ్మి మహేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ కరిముల్లా, ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాసరావు, సుభాషణరావు, జంజనం సాయి, షేక్ అక్రమ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మెరుగైన విద్యను అందించాలి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : : ప్రభుత్వ పాఠశాలలో చదువుతన్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని చీరాల డిప్యూటీ ఈవో అబ్బరాజు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం రవిసాగర్, ఉపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, శివరామకృష్ణయ్య, శ్రీనివాసరావ, బ్రహ్మయ్య ఉన్నారు.

ఏపీఆర్ ఐడీలను పూర్తి చేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల అన్నింటిలో ముఖ్యంగా 9, 10 తరగతుల విద్యార్థులకు ఏపీ ఏపీఆర్ ఐడీని జనరేట్ చేయాలని చీరాల డిప్యూటీ ఈవో అబ్బరాజు శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏపిఏపీఆర్ ఐడీ ప్రాధాన్యతను గుర్తించి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. శింగరకొండ వద్ద గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు డి. గంగాధరరావు, బి. సుధాకరరావు, గురుకులం ప్రిన్సిపాల్ దుర్గాగాయత్రి పాల్గొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు మృతి

మార్టూరు, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 15 : గుండెపోటు కారణంగా మార్టూరు గ్రామాని చెందిన ఇద్దరు, యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందారు. మార్టూరు ముస్లింకాలనీలో ని వాసముంటున్న షేక్ మౌలాలి (52) ప్రభుత్వ ఉద్యోగి గుండెపోటు కారణంగా వారం రోజుల నుంచి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. అతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతను బల్లికురవ మండలం కొణిదెన జడ్‌పి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నేతాజీ నగర్‌కు చెందిన ముక్తిపాటి వెంకటేశ్వరరావు (40) గుండెపోటుతో మంగళవా రం వేకువజామున ఇంటిలోనే మృతి చెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ధర్మకర్త, ఫొటోగ్రాఫరు మంగళగిరి కమలాచారి (52) గుండెపోటుతో గుంటూరులో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో కమలాచారి కుటుంబం నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం మండలంలోని పలువురు ఫొటోగ్రాఫర్లు కమలాచారి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

వ్యాపారమా..రాజకీయమా

» మూడు పార్టీల వ్యక్తులకు లైసెన్స్ మద్యం

» తెరపైకి వచ్చిన పాత సిండికేట్ల పెద్ద తలకాయలు

» ఒకే గొడుగు కిందికి వ్యాపారం.. లేదంటే నష్టపోతాం

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీరాల రాజకీయం ఎప్పుడూ రసకందాయమే. పలువురు నేతలు ఏపార్టీలో ఎక్కడ ఉంటారో అర్థంకాని పరిస్థితి. అయితే కొన్ని సందర్భాల్లో ఆదాయ వనరులను సమకూర్చుకునేక్రమంలో పైకి శత్రువుల్లా కనిపించే వారు తెర వెనుక వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి తాత్కాలిక లైసెన్స్‌లు కూడా అందజేశారు. లైసెన్స్‌లకు సంబంధించి పైకి కనిపిస్తున్నా వారి వెనుక పాత మద్యం సిండికేట్ పెద్ద తలకాయలున్నాయి. గతంలో మద్యం వ్యాపారంలో కీలకపాత్ర పోషించిన ఓ నేతకు తాజాగా అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతల హస్తం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లోనూ, మద్యం వ్యాపారుల అనుయాయుల్లో చర్చ నడుస్తుంది. ఈక్రమంలో వ్యాపారం చేద్దామా లేకపోతే రాజకీయం చేద్దామా అని ముఖ్యనేతలు మల్లాగుల్లాలు పడుతున్నట్లు సమాచారం.

రంగంలోకి పాత తలకాయలు

గతంలో సిండికేట్‌గా వ్యవహరించిన కారంచేడుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు వచ్చిన షాపుల లైసెన్స్‌లు ఒక వర్గంగాను, చీరాలకు చెందిన మద్యం వ్యాపారాల్లో దీర్ఘకాలంగా ఉన్న అన్నదమ్ముల్లో అన్న అధికార పార్టీవైపు, తమ్ముడు జాతీయ పార్టీ నాయకుని వైపు వర్గాలుగా విడిపోయారు. వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులకు కొన్ని కీలక షాపులు దక్కాయి. వీరు కారంచేడు మండల సిండికేట్ వ్యాపారి నేతృత్వంలో అడుగులు వేస్తున్నారు.

సిండికేట్ అవుదామా.. బలాబలాలతో ఎవరి వ్యాపారం వారు చేద్దామా

24 షాపుల్లో పాలక ప్రతిపక్షాలకు చెందిన వారికి దామాషాగా పరిశీలిస్తే ఒకటి అటు ఇటుగా సమానంగానే వచ్చాయి. ఈ నేపథ్యంలో లైసెన్స్‌లు పొందినవారిలో కొందరు సిండికేట్ అవుదాం లేకపోతే నష్టపోతామనే వాదన వినిస్తుండగా, మరికొందరు వ్యక్తిగత బలాబలాలతో స్వతంత్రంగా నిర్వహిస్తేనే మంచిదనే భావనలో ఉన్నట్లు తెలుస్తుంది.

షాపుల కోసం పోటాపోటీ

అనుమతులు పొందిన విజేతల వెనుక ఉన్న పెద్ద తలకాయలు షాపుల ఏర్పాటుకు సంబంధించి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు కొన్ని షాపులకు అడ్వాన్సులు ఇచ్చి ప్రత్యర్థి షాపుల లైసెన్స్‌లను ఆర్థికంగా దెబ్బతీయాలనే వ్యూహం రచిస్తున్నట్లు ప్రచారం. పందిళ్లపల్లికి చెందిన వ్యక్తి ఇంకొల్లు మండలానికి చెందిన మరోవ్యక్తి చినగంజాం మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు మధ్యేమార్గంగా వ్యవహరిస్తున్నారు.

లైసెన్స్‌లు కొనేందుకు రాయబేరాలు

ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన విధివిధానాల నేపథ్యంలో వైన్ షాపులకు మాత్రమే లైసెన్స్‌లు ఇచ్చారు. భవిష్యత్‌లో పర్మిట్ రూంలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని కొందరు అత్యధికంగా మద్యం విక్రయాలు జరిగే షాపులు పొందిన లైసెన్స్‌లకు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి పొందేందుకు రాయబేరాలు ప్రారంభించారు. అందులో రాజకీయ ప్రమేయమున్నట్లు తెలుస్తుంది.

పాఠశాల భవనాలు శిథిలం

» విద్యార్థులు, ఉపాధ్యాయులు ఫుల్

» తరగతి గదులు నిల్

» భయం భయంగానే నిర్వహణ

» మంజూరు చేయాలని మంత్రి రవికుమార్‌కు విజ్ఞప్తి

సంతమాగులూరు(అద్దంకి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాడు - నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని గత వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకురు. కొన్ని పాఠశాలల దుస్థితి చూస్తే ఆందోళన కలిగించక మానదు. చాలా పాఠశాలలో లక్షల రూపాయలు వెచ్చించి నాడు - నేడు పనులు చేసినా, తీరా పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలలోని 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలలలో కలిపారు. దీంతో నాడు-నేడు పథకం కింద నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పాఠశాలలు విలీనం కాలేదు. దీంతో ఆయా పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. అయితే ఆ పాఠశాలలు నాడు-నేడు కింద అభివృద్ధి చేయలేదు. ఈ కోవలోనే సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు (హిందూ), వెల్లలచెరువు (హిందూ), కొప్పరం (ముస్లిం) యూటీ స్కూల్‌లు మిగిలిపోయాయి. ఈ మూడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సంఖ్య ఎక్కువగా ఉంది. అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా సరిపడా ఉన్నారు. ఉన్న గదులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో కొన్ని సందర్భాలలో చెట్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏల్చూరు (హిందూ) ప్రాథమిక పాఠశాల స్వాతంత్ర్యం రాక పూర్వం బ్రిటీష్ పాలనలో 1942లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న గదులు సుమారు మూడు దశాబ్దాలకు పూర్వం నిర్మించినవి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు 130 మందికి పైగా ఉండగా, ఉపాధ్యాయులు ఆరుగురు ఉన్నారు. అదే సమయంలో అదే ప్రాంగణంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. వినియోగించుకునేందుకు వీలుగా ఉన్న గదులు రెండు మాత్రమే కాగా, మిగిలిన గదులలో బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఏ సమయంలోనైనా కూలే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల జరిగే సమయంలో జరగరాని ఘోరం జరిగితే పరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏల్చూరు రావడంతో పాఠశాల దుస్థితిని ఉపాధ్యాయులు వివరించారు. అదే విధంగా వెల్లలచెరువు(హిందూ), కొప్పరం(ముస్లిం) యూపీ పాఠశాల భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయని, ఈ విషయాలను మంత్రి రవికుమార్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు.


శిథిలావస్థలో ఏల్చూరు ప్రాథమిక పాఠశాల


ఇనుప చువ్వలు బయట పడి ఉన్న పిల్లర్‌లు


పెచ్చులు ఊడి బయట పడ్డ స్లాబ్ ఇనుప చువ్వలు


స్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు

భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా చూడాలి

కలెక్టర్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబ రు 15(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తం గా ఉండాలని, వర్షపు నీరు నిలువకుండా కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశించారు. మంగళవారం నగరంలో ని పోతురాజుకాలువ, కొప్పోలు రోడ్, జర్నలిస్ట్ కాలనీతో పాటు పలు శివారుకాలనీల్లో కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణం గా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలోని ఐదు కోస్తా మండలా లు ఉన్నాయని, వాటి పరిధిలో 53 హాబిటేషన్ సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. పది హేను పునరావాస కేంద్రాలను గుర్తించగా ఇందులో ఐదు కేంద్రాలు ఇప్పటికే అం దుబాటులోకి తీసుకువచ్చి సోమవారం నుంచి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూ రు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో 75 మి.మీ వర్షం పడిందని, వాగులు, కల్వ ర్టులలో నీరు వెళ్ళేందుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాగులు, వంకల్లో, సైడుకాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడిక తీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలు, వార్డు ఎమెనిటీ, శానిటేషన్ సెక్రటరీలను నియమించి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముంద స్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

వాగులు ఉధృతం


కడవకుదురు ప్రాంతంలో వదర నీటిలో ఉన్న నారుమడి

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు
- వరదకు తోడు సాగర్ కాలువల నీరు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నల్లవాగు, దోర్నపు వాగులు ప్రవహిస్తున్నాయి. వరద నీటికి తోడు సాగర్ కాలువల నీరు కూడా వాగులకు చేరుతుండడంతో ప్రవాహ జోరు పెరిగింది. గుండ్లకమ్మ నది ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆ నీటి ప్రవాహం ఇంకా అద్దంకి సమీపానికి రాక పోవడంతో గుండ్లకమ్మ నది ఓ మోస్తరుగా ప్రవహిస్తోంది. భవనాసి చెరువు కూడా పూర్తి స్థాయిలో నిండింది. పేరాయపాలెం వద్ద దోర్నపు వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం, ఇప్పటికే ప్రత్యామ్నాయ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వాహనాల రాకపోకలకు ఒకింత ఇబ్బందిగా మారింది.

డ్రైన్ పగిలి ఇళ్లల్లోకి చేరిన వరద

చీరాలటౌన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్ష బీభత్సానికి చీరాల పురపాలక సంఘం పరిధిలో ప్రజల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మరో వైపు పాపరాజు తోటలో డ్రైనేజీలు నిండి పగిలిపోయాయి. దీంతో మురుగు నీరు ఇళ్లల్లోకి చేరాయి. దీంతో ఆ ప్రాంత వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. కంపును భరించ లేకపోయారు. చేసేది లేక మురుగును ఎత్తిపోసుకున్నారు. వెంటనే చర్యలు చేప ట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

సాగు ఆరంభంలోనే వర్షార్పణం

చినగంజాం : రబీ సాగుకు సన్నద్ధమైన అన్నదాతలకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఎకరానికి సుమారు రెండున్నర వెయ్యి రూపాయలు ఖర్చు చేసి పోసిన నారుమళ్లు భారీ వర్షానికి నీట మునిగాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చినగంజాం, నీలాయపాలెం, కడవకుదురు, చింతగుంపల్లి, పెదగంజాం ప్రాంతాల్లోని పొలాలన్నీ జలమయమయ్యాయి. మండలంలోని కడవకుదురు ప్రాంతంలోని పాతపాడు, వాద పొలాలకు సంబంధించి నాలుగు వందల ఎకరాలలో పోసిన నారుమడులు, చినగంజాం ప్రాంతంలోని ధనలక్ష్మీ లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటీ కింద 300 ఎకరాలకు పోసిన నారుమడులు, హనుమాన్ లిఫ్ట్ ఇరిగేషన్ ఆఫ్ సొసైటీ కింద 100 ఎకరాలకు పోసిన నారుమళ్లలో గత మూడు రోజులుగా వర్షపు నీరు నిల్వ ఉండడంతో విత్తనాలు మెలకెత్తిన నారు పనికి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నారుమళ్లు పోసుకోవాలని వాపోతున్నారు. అధికారులు గుర్తించి ఉచితంగా వరి విత్తనాలు అందించాలని కోరుతున్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో పోసిన నారుమడులు రెండు రోజులుగా వరదనీటిలో ఉన్నాయని రైతులు తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం ప్రాంతంలో 100 ఎకరాలలో వేసిన వరినాట్లు, 25 ఎకరాలలో వేసిన వేరుశనగ, ఆరు ఎకరాలలో వేసిన చిలకడదుంప పంటలు నీట మునిగాయని రైతులు తెలిపారు. ఎంతో శ్రమ కూర్చి రూ.60వేల పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఇంటికి వచ్చే సమయంలో వర్షం ముంచెత్తడంతో వేరుశనగ పంటలో వర్షపు నీరు చేరి కాయలు కుళ్లిపోయాయని కౌలు రైతులు


పోలూరి వాగును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రత్నకుమారి

అవనిగడ్డ నాగరాజు, చాపల అంకయ్య, పెదశింగు దస్తగిరి, పిట్టు పాండు రంగారెడ్డి, కాటం నాగుర్, దండుప్రోలు యనాది ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు. పల్లెపాలెంలో లోతట్టుప్రాంతంలో నివసిస్తున్న వల్లభుని శేషయ్య, పీతా శ్రీనుతో పాటు మరో 18మంది ఇళ్లలో వర్షపు నీరు చేరింది. ఈ విషయాన్ని సర్పంచ్ నక్కల కృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ శీలం రమేష్ గ్రామంలో తుఫాన్ షెల్టర్‌లో వారికి పునరావాసం కల్పించారు. గ్రామాన్ని వరదనీరు ముంచెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌కవేటర్ ద్వారా చెరువుకి గండి కొట్టి చెరువు నుండి నీరు సముద్రానికి వెళ్లేట్లు ఏర్పాటు చేశారు.

నీలాయపాలెం గ్రామాన్ని చుట్టుముట్టిన వరదనీరు

మండలంలోని నీలాయపాలెం గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు చేరింది. నీలాయపాలెం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్యగల నాగన్నవాగుకు భారీగా వరదనీరు చేరింది. కొత్తకాలువకు పలు చోట్ల గండ్లు పడి గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఇతర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ వరకు ఐదు అడుగుల మేర వరదనీరు ప్రవహిస్తుందని తెలిపారు. 400 ఎకరాలలో వేసిన వరిపైరు నీటమునిగిందని రైతులు చెప్పారు. వైసీపీ హయాంలో నాగన్న వాగులో పూడిక


నీలాయపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగన్నవాగు

తీయకపోవడంతో వాగులో తూటికాడ, చిల్ల చెట్లు బాగా పెరిగిపోవడంతో వరదనీరు సక్రమముగా పోయే మార్గం లేక ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి రాకపోకలు లేవన్నారు. నాగన్న వాగు ఉధృతిని పరిశీలించిన అధికారులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. సోమవారం రాత్రికి పోలూరు వాగు (పర్చూరు వాగు) వంతెన పై నుంచి నీరు ప్రవహించడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ డీ రత్నకుమారి వాగు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పా


వీరన్నపాలెం ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలు

టు చేశారు. యద్దనపూడి - చిలుకూరివారిపాలెం వంతెనపై కూడా నీరు రావడంతో రాకపోకలు నిలిపోయాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు డేగరమూడి, రాజుగారిపాలెం వాగుల వద్ద పర్యవేక్షిస్తున్నారు.

ఇంకొల్లు : వర్షాలకు పాతమద్రాసు రోడ్డులోని దుద్దుకూరు వద్ద వాగు పొంగిప్రవహిస్తోంది. మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి. నేలచప్టాపై వరద ప్రవాహం ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్చూరు : ఎడతెరపి లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో పంట పొలాలు నీట మునిగాయి. శివారు కాలనీలు జలమయమయ్యాయి. రహదారులపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పర్చూరులోని నెహ్రూ నగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరా కాలనీ, పర్చూరు, ఉప్పుటూరు కాలనీలను నీరు చుట్టుముట్టింది.


పేరాయపాలెం సమీపంలో ప్రవహిస్తున్న దోర్నపు వాగు


చీరాలలో ఇళ్లల్లోకి చేరిన మురుగు నీరు


దుద్దుకూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులు 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము, మొక్కజొన్న, పొగాకు పంటలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి ఎస్.దీప్తి మాట్లాడుతు రాయితీపై తైవాన్ స్ప్రేయర్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల శాంతమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సీత, పశు సంవర్ధక శాఖ సహాయకులు కిరణ్, రైతులు పాల్గొన్నారు.

18న ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అద్దంకి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని సంస్థ జిల్లా అధికారి ప్రణయ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలలో టాటా క్యాపిటల్, జోయాలుక్కాస్, హెటిరో లాబ్స్ ప్రైవేటు లిమిటెడ్, అరబిందో ఫార్మసి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 150కి పైగా ఖాళీలు ఉన్నాయని విద్యా అ ర్హతను బట్టి సుమారు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఎంబీఏ, పీజీ విభాగాలకు చెందిన 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9440635677 సంప్రదించాలని తెలిపారు.

పారదర్శకంగా విచారిస్తాం : డీఎస్పీ

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పులి శ్రీనివాసరావు మృతిపై పారదర్శకంగా విచారణ చేపడతామని, కచ్చితంగా న్యాయం చేస్తామని డీఎస్పీ జగదీష్ నాయక్ పేర్కొన్నారు. దసరా పండుగ రోజు రాత్రి అనుమానాస్పదంగా శ్రీను మృతిచెందిన విషయమై గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఘటనా స్థలం వద్ద ఆందోళనకు దిగారు. డీఎస్పీ అక్కడకు వెళ్లి బాధిత కుటుంబం, గ్రామస్థులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. దీనిలో ఎవరి పాత్ర ఉన్నా వదిలేది లేదన్నారు. మీకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సీఐ శేషగిరిరావు, ఎస్ఐ శివకుమార్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

మందుకు డబ్బులివ్వలేదని పారతో దాడి

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని స్నేహితుడిపై పారతో దాడి చేసిన సంఘటన మంగళవారం కొత్తపేట మూడు రోడ్ల సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన కటకం శివరామప్రసాద్ ఎద్దుల బండి నడుపుతుంటాడు. ఇతనికి చీరాల గొల్లపాలెంకు చెందిన చుక్కా వెంకటేష్ మిత్రుడు. మూడురోడ్ల సెంటర్‌లోని కార్ఖానా సమీపంలో కూర్చొని ఉన్న శివరామ ప్రసాద్ వద్దకు వెంకటేష్ వచ్చి తాగేందుకు డబ్బులు అడిగాడు. అందుకు నిరాకరించడంతో పక్కనే ఉన్న పారతో శివరామ ప్రసాద్ ముఖంపై దాడి చేశాడు. స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు అవుట్‌పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

లక్కీ డిప్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో దేవస్థానం కమిటీ సభ్యులు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : కన్యకాపరమేశ్వరి దేవస్థానం 53వ శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం లక్కీ డీప్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించిన లక్కీడిప్‌లో ప్రథమ బహుమతి పొందిన కురిచేటి దినేష్‌కు గోల్డ్ కాయిన్, 53కిలోల లడ్డు, ద్వితీయ బహుమతి పొం దిన అరవపల్లి సురేంద్రబాబుకు 18కిలోల లడ్డు, గోల్డ్ కాయిన్, తృతీయ బహుమతి పొందిన పూటుకూరు పూర్ణచంద్ర రావుకు గోల్డ్‌కాయిన్‌ను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు, కా ర్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు,అరవపల్లి హనుమంతరావు, భోజనపల్లి సత్యనారాయణ, చిన్ని వీరయ్య, గోపు శ్రీనివాసరావు, పిఎయస్ కోటేశ్వరరావు, సుబ్బరాయుడు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బైకు చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మోటార్ బైకుల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని మంగళవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి అరెస్టు చేసి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొత్తూరుకు చెందిన తన్నీరు నరసంహారావు, బొల్లాపల్లికి చెందిన గోగు నరసింహారావు పల్నాడు జిల్లా వినుకొండలో రెండు బైకులు చోరీ చేసి వస్తుండగా కొప్పెరపాడు వద్ద ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. వారిని అద్దంకి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులపై నర్సారావుపేట, శావల్యాపురం, అద్దంకి, పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

స్వర్ణ (పర్చూరు) 15 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కారంచేడుమండలం స్వర్ణ గ్రామస్థులు కొందరు చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మద్యం దుకాణం దక్కించుకొన్న ప్రైవేట్ వ్యక్తులు నివాసాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా హాస్పిటల్‌లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అంతర్గత రోడ్లు, గేట్లు, సిబ్బంది కొరత, కొన్ని పరికరాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కమిటీ ప్రతినిధులతో చర్చించారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వివరించారు. హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చేవారికి మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకముందు ఆయన వార్డులను పరిశీలించారు. మార్చురీ బాక్సుల నిమిత్తం రూ.35వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బండారుపల్లి హేమంత్‌కుమార్, పలివేటి మురళీకృష్ణ, డా.హరిబాబు, డా.కోటి నాగిరెడ్డి, డా.షణ్ముఖ, టీడీపీ నాయకురాలు సజ్జా హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

కమిషనర్‌కు ఫిర్యాదు


ప్రభుత్వ స్థలంలో గదుల ఏర్పాటుకు తోలిన రాళ్లు

అద్దంకి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. పట్టణంలోని పసుమర్తిపాలెం, బోడెంపూడివారిపాలెం మధ్య రోడ్డు వెంబడి ప్రభుత్వ స్థలం ఉంది. అయితే ఆ స్థలాన్ని ఇప్పటికే కొంత మంది ఆక్రమించుకొని ఎరువు దిబ్బలు వేశారని, ప్రస్తుతం మరో అడుగువేసి ఆ ప్రాంతంలో ఉన్న వేప చెట్టును తొలగించారని, గదులు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు నంబూరి వసంతకుమారి తెలిపారు.

కొరిశపాడు ఎత్తిపోతలను పూర్తి చేస్తాం

- మంత్రి రవికుమార్
- పలు సమస్యలపై సానుకూల స్పందన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేయిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కొరిశపాడు మండలం పమిడిపాడులో జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జీ, ఆర్డీవో అఖిల తదితర అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.40లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీకి రావాల్సిన నిధులను అందజేయడంతో వాటి అభివృద్ధి, బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి రూ.11కోట్ల80లక్షల విలువైన పనులు మంజూరైనట్లు తెలిపారు. పమిడిపాడు ఎస్సీ కాలనీలోని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. 20వేల ఎకరాలకు నీరు అందించే కొరిశపాడు ఎత్తిపోతలను వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. సుబ్బారెడ్డి తండ్రి పేరుతో ఉన్న ఎత్తిపోతలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రిజర్వాయర్ నుం చి బొల్లవరప్పాడు రిజర్వాయర్ వరకు నిర్మించాల్సిన ఫీడర్ కాలువకు 99ఎకరాల భూమి అవసరం కాగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఎకరానికి రూ.12లక్షల పరిహారాన్ని తాను ఇప్పించినట్లు జేసీకి తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో గ్రామీణ రోడ్లను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు రాగానే రహదారుల బాగుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అద్దంకి నుంచి సముద్రతీరం వరకూ బస్సు నడపాలని గ్రామస్థు లు కోరగా స్పందించారు. గతంలో నడిచిన పోతవరం నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని కోరారు. గుండ్లకమ్మ ఎడమ కాలువ నుంచి కనగాలవారిపాలెం చెరువు నింపుకోవడానికి పైపులైన్ నిర్మాణం చేయాలని కోరారు. నూజిళ్లపల్లి చెరువు నుంచి తమ గ్రామానికి వచ్చే తాగునీటి పైపులైను ధ్వంసమైందని కొత్త పైపులైన్లు వేయాలని గ్రామస్థులు మంత్రికి తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పమిడిపాడు ఎస్సీ కాలనీలో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. సామాజిక భవనం నిర్మించాలని, రోడ్లకు మురుగు కాలువలు లేవని ఎస్సీ కాలనీవాసులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ సామాజిక భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ నటరాజ్ గ్రామ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెనీ అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్ : చీరాల నియోజకవర్గ పరిధిలోని ప్రతిపల్లెనూ అభివృద్ధి చేస్తామని ఎ మ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం వేటపా లెం మండలంలోని కొత్తపేట, చల్లారెడ్డిపా లెంలో నిర్వహించారు. కొత్తపేటలో రూ.17.2 లక్షల సీసీ రోడ్లు, చల్లారెడ్డి పాలెంలో రూ.30.55లక్షలతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ పల్లెల అభివృద్ధికి కూట మి ప్రభు త్వం శ్రీకారం చు ట్టిందన్నారు. గ్రామ సభలల్లో ఆమోదించిన 30వేల పనులు ప్రారంభమవడం సంతోషదాయకమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు. విధ్వంస పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, స్పెషల్ ఆఫీసర్ శేషయ్య. ఏపీవో దాసు, సచివాలయ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

4 ఊళ్లలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన

అద్దంకిటౌన్ : గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయడమే పల్లె పండగ లక్ష్యమని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెంలో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఉప్పలపాడు గ్రామం లో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజ, వెంపరాల గ్రా మంలో మూడు ప్రాంతాలలో రూ.30లక్షలుతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమి పూజలు, చక్రాయపాలెంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వీఎస్‌హెచ్‌వీఎం ప్రసాదరావు, ఏపీవో గాయత్రి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పల్లా నాగేశ్వరరావు, బాజీబేగం, పి.శ్రీనివాసరావు, టీఏలు మురళి మనోహర్, కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.25లక్షలతో 4 సీసీ రోడ్లకు, 3 గోకులం షెడ్లకు శంకుస్థాపన చేశారు. సూరవరపుపల్లిలో 2 గోకులం షెడ్లకు, లక్ష్మవరంలో రూ.10లక్షలతో, రాజుగారిపాలెంలో రూ.15 లక్షలతో పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

వేమవరం ఎస్టీ కాలనీలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న మంత్రి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అకాంక్షించారు. మంగళవారం మండలంలోని వేమవరం ఎస్టీ కాలనీలో దసరా నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి రవికుమార్‌కు ఎస్టీ కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. రవికుమార్ మాట్లాడుతూ దైవ పూజల్లో ఉన్నవారంతా శాంతిమార్గంలో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు మద్యం

దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు

నెల్లూరు (క్రైం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలులోకి రానుంది. ఇప్పటి వరకు ప్రజలకు నరకం చూపించిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. ఇక నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు రానున్నాయి. జిల్లావ్యాప్తంగా 182 వైన్ షాపులను లాటరీ విధానంలో దక్కించుకున్న లైసెన్స్ దారులు మంగళవారం ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ధ్రువీకరణ పత్రాలు పొందారు. అక్కడి నుంచి నేరుగా నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం వద్ద ఉన్న మద్యం డిపోకు చేరుకొని రిటైల్‌కోడ్‌ను పొందారు. నెల రోజుల్లోపు వ్యాపారులు బ్యాంక్ గ్యారెంటీ, కౌంటర్ పార్ట్ అగ్రిమెంట్, షాపునకు సంబంధించిన లీజు అగ్రిమెంట్, బ్లూ ప్రింట్‌లు సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ సమర్పించాక ఎక్సైజ్ అధికారులు పర్మినెంట్ లైసెన్సు మంజూరు చేస్తారు. జిల్లావ్యాప్తంగా 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టడంతో ఇవి మూతపడ్డాయి. ఇకనుంచి ప్రైవేట్ వైన్స్ షాపులు తెరుచుకోను న్నాయి. ప్రభుత్వ దుకాణాల్లోనే లిక్కర్, కంప్యూ టర్లు, సీపీవోలు, ఫర్నీచర్, రికార్డులను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని మద్యం డిపోకి తరలించనున్నారు. వీటిని తరలించే ప్రక్రియ పూర్తయ్యేంత వరకు సిబ్బందిని విధుల్లోనే ఉంచాలని, అప్పటివరకు జీత భత్యాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ మద్యం దుకాణాలు పూర్తిగా రద్దయ్యాయి. ప్రైవేట్ వైన్‌షాపులు పొందిన వారు బుధవారం నుం చి విక్రయాలు జరుపుకో వచ్చు. అయితే వారు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

- శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీసీ

● సిండికేట్ల మధ్యస్థాల్లో రసాభాస

ఈసారి సిండికేట్ల సామ్రాజ్యం ప్రైవేట్ వైన్‌షాపుల్లో పాగా వేసింది. గతంలో సిండికేట్ అంటే నలుగురి నుంచి ఆరుగురి వరకే ఉండేవారు. అయితే ఈసారి వైన్ షాపులు దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు పదుల సంఖ్యలో సిండికేట్‌గా మారారు. దుకాణాల కోసం వందలాది దరఖాస్తులు చేశారు. అయితే మూడు నుంచి నాలుగు, సిండికేట్లను మాత్రమే షాపులు వరించాయి. ఒకటి, రెండు సిండికేట్లకు మాత్రం ఆరు నుంచి ఎనిమిది షాపులు దక్కాయి. దీంతో మంగళవారం సిండికేట్ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని తక్కువగా వచ్చిన షాపుల్లో ఎవరిని భాగస్వామ్యం చేయాలి.. దరఖాస్తు చేసుకున్న సొమ్మును ఎవరికి ఇవ్వాలి..?..అనే విషయాలపై చర్చించారు. ఈ చర్చలో పలువురు అసహనం వ్యక్తం చేయడంతో రసాభాసగా ముగిసినట్లు సమాచారం.

ముసురుతో ముంచెత్తింది!

- మోస్తరు నుంచి భారీ వర్షం ● నేడు కూడా వాన... జిల్లాకు రెడ్‌అలెర్ట్
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం ● అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- వంద కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు ● విద్యాసంస్థలకు సెలవు కొనసాగింపు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మంగళవారం కూడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 94.8 మి.మీగా నమోదైంది. ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరు, కావలి, కోవూరు, కందుకూరు నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నెల్లూరులోని 53వ డివిజన్‌లో ఉన్న గాంధీ గిరిజన కాలనీ, వెంకటేశ్వరపురంలో వర్షపు నీరు చేరింది. ఆర్టీసీ కాలనీని వర్షపునీరు చుట్టేసింది. నెల్లూరు ట్రంకురోడ్డుపై మురుగు ప్రవహించింది. రైల్వే అండర్ బ్రిడ్జీలలో నీరు చేరటంతో కార్పొరేషన్ అధికారులు మోటార్ల సహాయంతో తోడిస్తున్నారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 100 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పెన్నా పరివాహక, తీర ప్రాంత ప్రజలను పరిస్థితులను బట్టి తరలించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. బుధవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించగా, జిల్లాకు రెడ్ అలెర్టును ప్రకటించింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నెల్లూరు చెరువు కలుజును, పెన్నా పొర్లు కట్ట ప్రాంతాన్ని, పెన్నా బ్రిడ్జి ప్రాంతాన్ని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. బోడిగాడితోట వద్ద పెన్నా నదిలో పడిన గండిని వారు పరిశీలించారు. రానున్న 48 గంటలపాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు బుధవారం కూడా పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. కాగా గడిచిన రెండు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో సాధారణ జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



నెల్లూరు : పెన్నానది ఒడ్డున స్థానికుతో మాట్లాడుతున్న కలెక్టర్

● 180 ఎకరాల్లో వరి మునక

నెల్లూరు (వ్యవసాయం) : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పైరు, నారుమడులు నీటిలో నానుతున్నాయి. దాదాపు 180 ఎకరాల్లో కోత దశకు చేరుకున్న వరి పైరు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. అదేవిధంగా దాదాపు 175 ఎకరాల నారుమడులు నీటమునిగినట్లు చెబుతున్నారు. అయితే, ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమే. ఇంకా చాలా పొలాలు నీటమునిగాయని వివరాలు పూర్తిస్థాయిలో రావాల్సి ఉందని తెలుస్తోంది. పొలాల్లోని నీటిని బయటి ప్రాంతాలకు పంపేందుకు రైతులు కాలువలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కావలి సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 7.5 ఎకరాల్లో పూలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారుల అంచనా.



అల్లూరు : తుమ్మలపెంట తీరంలో పోలీసుల పహరా

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఫరూక్



నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలలో ఇన్‌చార్జి మంత్రి కీలకంగా వ్యవహరించనున్నారు. ఇక జిల్లాకు చెందిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను కాకినాడకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ప్రకాశం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రులుగా నియమితులయ్యారు.

పబ్లిక్ నోటీసు

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా SPSR నెల్లూరుజిల్లా, అనంతసాగరం మండలం, కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ చిలకా చంద్రమౌళిరెడ్డి తండ్రి మస్తాన్‌రెడ్డి మరియు శ్రీమతి చిలకా పార్వతి భర్త చంద్రమౌళిరెడ్డి అనువారలు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి తమ స్వార్జితమైనదని వీటిని తాము ఆత్మకూరు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము నందు రిజిష్టరు కాబడిన నెం.603/2013, 604/2013, 683/2012 మరియు 684/2012 విక్రయ పత్రముల ద్వారా పొందియున్నామని, వీరిలో చిలకా చంద్రమౌళిరెడ్డి గారు బొమ్మవరం గ్రామ సర్వే నెం.15రులోని ఎ.2.15 1/2 సెంట్ల భూమిని లేక్‌వ్యూ కాలని, పొదలకూరు రోడ్డు, నెల్లూరుసిటి వాస్తవ్యులయిన శ్రీమతి వంగవరుగు శ్రీలక్ష్మీ సుప్రజ భర్త బొమ్మ నవీన్‌కుమార్‌గారి పేరున నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం డాక్యుమెంట్ నెం.4663/2014రు ద్వారా విక్రయించి ప్రతిఫలం పొందియున్నారని మరియు శ్రీమతి చిలకా పార్వతి భర్త చిలకా చంద్రమౌళిరెడ్డి గారు సర్వే నెం.15 లోని ఎ.2.86 1/2 సెంట్ల భూమి, సర్వే నెం.16రులోని ఎ2.07 సెంట్ల భూమిని రవీంద్రనగర్, కొండాయపాళెం గేటు, నెల్లూరుసిటి వాస్తవ్యులు వంగవరుగు సుధాకర్‌రెడ్డి తండ్రి మాలకొండారెడ్డి గారి పేరున స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం డాక్యుమెంటు నెం.4664/2014రు ద్వారా విక్రయించి ప్రతిఫలం పొందియున్నారని మరియు చిలకా చంద్రమౌళిరెడ్డి గారు శ్రీమతి వంగవరుగు పద్మావతి భర్త వంగవరుగు సుధాకర్‌రెడ్డి గారి వద్ద నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం నందు రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం.4662/2014రు ద్వారా బొమ్మవరం గ్రామ సర్వే నెం.14రు లోని ఎ.12.65 సెంట్ల భూమిని చూపుదు ఆడుమానం పెట్టి రూ.25,00,000/-లు ఆడుమానం అప్పు పొందియున్నారని, ప్రస్తుతం పై ఐదుగురు సమిష్టిగా పరస్పర అవగాహన ద్వారా ఏలాంటి ఒత్తిడులకు లోను కాకుండా మనస్ఫూర్తిగా క్రింది షెడ్యూలు దాఖలా మొత్తము ఆస్థిని విక్రయించదలచగా నా కక్షిదారులు కొనుగోలు చేయదలచి వారితో సముచితమైన విక్రయ ప్రతిఫలం చెల్లించుటకు ఒప్పుకొని విక్రయ అగ్రిమెంట్ చేసికొనియున్నారు.

ఇట్లుండుటలో పై అమ్మకందారులు షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు కనపడుట లేదని మరియు ఒరిజినల్ డాక్యుమెంట్ల ద్వారా వారు ఇతరులెవ్వరితోను ఏ విధమైన లావాదేవీలు షెడ్యూలు ఆస్థిపై చేసియుండట లేదని నా కక్షిదారులను నమ్మబలికినారు. కనుక ఇందు విషయముల పై ఏ వ్యక్తి వ్యక్తులకు, కంపెని లేదా కార్పొరేషన్‌లకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిపై లేదా అందులో భాగము పై మార్పిడి, అమ్మకము, దానము, తనఖా, నమ్మిక ద్వారా, పిత్రార్జితము, శాసన పూర్వకముగా గాని, గుత్త ద్వారా గాని, సాధనము ద్వారా గాని, యాజమాన్యము ద్వారా గాని మరియే ఇతర రకములైన హక్కులు గాని, ఇతర ఏ విధమైన లాభమొనర్చు ఆసక్తులు ఉన్న యెడల అటువంటి వారు వారి వారి ఆసక్తులను, అభ్యంతరములను ఈ నోటీసు ప్రచురితమైన వారము దినము లోపుగా ఈ క్రింది అడ్రస్సునకు తెలియజేయగలరు. లేనిచో ఈ విక్రయమునకు సంబంధించి ఎవ్వరికి ఏలాంటి అభ్యంతరములు లేవని భావించి నా కక్షిదారులు విక్రయమును పూర్తి చేసికొనదరు. తదుపరి ఎవ్వరికైన ఏలాంటి హక్కులు, ఆసక్తులు ఉన్ననూ వారు సదరు హక్కులను, ఆసక్తులను స్వయముగా బుద్ధిపూర్వకముగా వదలుకొన్నట్లుగా తలంపబడును. మరియు అలాంటి విషయములు నా కక్షిదారులను బద్ధగించనేరవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, రిజిస్ట్రేషన్, ఆత్మకూరు సబ్ డి.రి. అనంతసాగరం మండలం, బొమ్మవరం గ్రామ పంచాయతీలో చేరిన బొమ్మవరం గ్రామ పొలం, కోరు మెట్ట సర్వే నెం.14 విస్తీర్ణం ఎ.12-65 సెంట్లు, సర్వే నెం.15 విస్తీర్ణం ఎ.2-15 1/2 సెంట్లు, సర్వే నెం.15 విస్తీర్ణం ఎ.2-86 1/2 సెంట్లు, సర్వే నెం.16 విస్తీర్ణం ఎ.2.07 సెంట్లు. వెరశి మొత్తం ఎ.19-74 సెంట్లు లేక 7.994 హెక్టార్ల భూమికి హద్దులు: తూర్పు: పొరెస్టు భూమి, దక్షిణం మరియు ఉత్తరం: ప్రభుత్వ భూమి, పడమర: శానంపూడి నాగయ్య భూమి పై హద్దుల మధ్య గల ఏక ప్రదేశం యావత్తు యాజమాన్యము హక్కులతోటి.

వింజమూరు
15-10-2024

టి.విజయభాస్కర్‌రెడ్డి
న్యాయవాది, వింజమూరు గ్రామం, మండలం
వింజమూరు-524228, నెల్లూరుజిల్లా, సెల్:94410 60938

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 9,776 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. జలాశయంలో 52.223 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 6 వేలు, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో బుధవారం ఉదయానికి వరద ప్రవాహం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

● బ్యారేజ్ నుంచి నీటి విడుదల

సంగం : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు సంగం బ్యారేజీకి సుమారు 2,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజి వద్ద ఉన్న నీటిమట్టం 8.2 అడుగులకు చేరింది. సోమశిల జలాశయానికి నీటి ప్రవాహం పెరుగుతుండటంతో ఏ సమయంలోనైనా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందుస్తుగా సంగం బ్యారేజీలో 12 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



సంగం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం

న్యూస్ బాక్స్

ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్

- వెంకటాచలం పీఎస్‌లో బంగారం మాయం
- నివేదిక ఇచ్చిన సీఐ, డీఎస్పీ
- చర్యలు తీసుకున్న ఐజీ త్రిపాఠి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో జిల్లాలో పనిచేసి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న వివాదాస్పద ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంకటాచలం ఎస్ఐగా కరీముల్లా పనిచేస్తున్న సమయంలో ఓ కేసుకు సంబంధించి సుమారు 800 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. అయితే ఈ బంగారం పోలీసు స్టేషన్ నుంచి మాయమైంది. ఎస్సై ఆధీనంలో ఉండాల్సిన బంగారం మాయమైనట్లు ఏడాది క్రితమే వెలుగులోకి వచ్చింది. కానీ నాడు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారాక వెంకటాచలం స్టేషన్‌కు కొత్త సీఐగా సుబ్బారావు బాధ్యతలు తీసుకున్నారు. చార్జ్ తీసుకున్న సందర్భంగా అన్ని కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను ఆయన పరిశీలించుకున్నారు. కానీ బంగారం మాత్రం స్టేషన్‌లో లేకపోవడంతో వెంటనే ఈ విషయాన్ని నివేదిక రూపంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన కూడా వెంకటాచలం స్టేషన్‌లో బంగారం మాయమైనట్లు నిర్ధారించి, అందుకు అప్పటి ఎస్సైను బాధ్యుడిగా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నివేదికలను జిల్లా ఎస్పీ గుంటూరు రేంజ్ ఐజీకు పంపారు. వీటిని పరిశీలించిన ఐజీ.. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేశారు. అయితే ఎప్పుడో రెండేళ్ల క్రితం బంగారం మాయమైతే ఇన్నాళ్లూ అక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఓ రైటర్ పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేసిన నేపథ్యంలో మిగిలిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ వ్యవహారంపై ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను వివరణ కోరగా ఎస్సైను సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు.



రూ. 10 నాణేల సంచిని విడుదల చేస్తున్న డీజీఎం జీఎన్ మూర్తి

రూ.10 నాణేలు చెల్లుతాయి

- కెనరా బ్యాంకులో పంపిణీ

నెల్లూరు హరనాథపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ విపణి లో పది రూపాయాల నాణేలు చెల్లుబాటవుతాయని తెలియచేస్తూ నగరం లోని కెనరా బ్యాంకు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ ఆధ్వర్యంలో అధికారులు రూ.10 నాణేల పంపిణీని చేపట్టారు. నెల్లూరులోని ఆ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. వినియోగదారులు ఎక్కువ సంఖ్యలో ఈ నాణేలను తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు తిరుపతి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జీఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రజలకు రూ.10 నాణేలపై అవగాహన కల్పిస్తున్నామ న్నారు. ఈ సందర్భంగా మొబైల్ కరెన్సీ వ్యాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజియన్ ఏజీఎం ఏ నాగరాజు రూ. 10 నాణేలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. బ్యాంకు డివిజనల్ మేనేజర్ ఎస్ మునిశేఖర్, మేనేజర్ స్మృతి, కరెన్సీ చెస్ట్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




గుట్టలుగా పడి ఉన్న సర్వే రాళ్లు

నూకవరం, బడేవారిపాలెం, పోలినేని పాలెం, కాకుటూరు, నలదలపూరు, కళవల్ల, కూనిపాలెం, పోకూరు తదితర గ్రామాల్లో రోడ్ల వెంట జగనన్న భూరక్ష పథకం సర్వేహద్దు రాళ్ల గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రీసర్వే చేపట్టి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని రీ సర్వే చేపట్టింది. ఈ సర్వేను అధికారులు తప్పులతడకగా చేపట్టడంతో అది ఆదిలోనే నిలిచిపోయింది. ప్రభుత్వం సరఫరా చేసిన సర్వేహద్దు రాళ్లను పొలాల్లో పాతేందుకు కూడా రైతులు అభ్యంతరాలు చెప్పారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - వలేటివారిపాలెం

స్ఫూర్తి

మామంచి తిరుమలమ్మపాళెం!


- సారా, కల్లు అమ్మకాల నిషేధం
- నలభై ఏళ్ల క్రితమే గ్రామస్థుల కట్టుబాటు
- గ్రామంలో 96 శాతం మంది అక్షరాస్యులే


తిరుమలమ్మపాళెం గ్రామ వ్యూ

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుమలమ్మపాళెం.. మండల కేంద్రం వెంకటాచలానికి 23 కి.మీ దూరంలో ఉంటుం ది. చుట్టూ కండలేరు క్రీకు కాలువల మధ్యలో ఈ గ్రామం ఓ దీవిలా ఉంటుంది. 96 శాతం గ్రామస్థులు అక్షరాస్యులుగా ఉండటం ఈ గ్రామం ప్రత్యేకత. అందుకే అందరూ ఈ గ్రామాన్ని చదువులమ్మపాళెంగా పిలుస్తుంటారు. అంతేకాదండోయ్.. గ్రామంలో ఉద్యోగులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. 260 కుటుంబాలున్న దళితవాడలో దాదాపు ఇంటికో ఉద్యోగి ఉండటం విశేషం.

మరో ప్రత్యేకత

సుమారు 40 ఏళ్ల క్రితం అప్పటి గ్రామపెద్దలు గ్రామంలో కల్లు, సారా వంటి మత్తు పదార్థాలు విక్రయించరాదని కట్టుబాటు పెట్టుకున్నారు. అప్పట్లో కల్లు, సారా వల్ల గ్రామస్థులు ఎక్కువ మంది ఇబ్బందులు పడడంతో వారు ఈ కట్టుబాటును విధించుకున్నారు. గ్రామంలో



సారా కాసి బయట ప్రాంతాల్లో విక్రయించడం వల్ల పోలీసులు నిత్యం గ్రామానికి చేరుకుని ఇబ్బందులకు గురి చేసేవారు. ఓ వైపు సారా వల్ల కుటుం బాలు ఆర్థికంగా విచ్ఛిన్నం కావడం, మరోవైపు పోలీసుల ఇబ్బందులను తట్టుకోలేక అప్పట్లో గ్రామ పెద్దలంతా సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. నాటి నుంచి ఈ గ్రామం మద్య రహితంగానే ఉంటోంది. సుమారు 2,060 జనాభా కలిగిన ఈ గ్రామంలో ఇప్పటికీ కల్లు, సారా, మద్యం విక్రయాలు లేవు. బెల్టు షాపులు కూడా ఉండవు. ఎవరైనా మద్యం తాగాలంటే పొరుగున ఉన్న వెంకటరెడ్డి పాళెం వెళ్లాల్సిందే. కాలక్రమేణా ఒకరిద్దరూ గ్రామంలో బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, గ్రామస్థులంతా ఏకమై అడ్డుకున్నారు. మిగిలిన గ్రామాలకు ఇది స్ఫూర్తివంతంగా నిలుస్తున్నది.

ఐకమత్యం వల్లే సాధ్యం



గ్రామంలో ఐకమత్యం ఉండబట్టే మద్యపాన నిషేధం సాధ్యమైంది. కట్టుబాటును అతిక్రమించి ఎవరైనా విక్రయాలు జరిపితే గ్రామస్థులంతా ఒక్కటై అమ్మకాలను ఆపేస్తారు. గ్రామంలో అక్షరాస్యత పెరగడం కూడా మద్యం అమ్మకాల నిరోధానికి మరో కారణం

- దాన పద్మ, సర్పంచి

మహిళలే కీలకం



గ్రామంలో పురుషులతోపాటు మహిళలు కూడా అధిక సంఖ్యలో అక్షరాస్యులుగా ఉన్నారు. అందువల్ల వారు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉంటారు. వాటి వల్ల జరిగే అనర్థాల గురించి వారికి బాగా తెలుసు. దీంతో గ్రామంలో కల్లు, మద్యం విక్రయాలను వారు వ్యతిరేకిస్తున్నారు.

- పాముల నందకిషోర్

మద్యం దుకాణం వద్దే వద్దు



ఉదయగిరిలోని అన్నపూర్ణానగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంత వాసులు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో వైద్యశాల, ఐటీఐ కళాశాల ఉండడంతో విద్యార్థులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే వారి ప్రశాంతతకు భంగం కలుగుతుందని తెలిపారు. గతంలో సైతం మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్నామని పేర్కొన్నారు. అనంతరం సీఐ లక్ష్మణ్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా చేయమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు కంభాల చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, స్థానికులు మల్లికార్జున, వీరారెడ్డి, మాధవరెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మా వార్డులో మద్యంషాపునకు అనుమతులు ఇవ్వవద్దంటూ కావలి 33వ వార్డుప్రజలు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన కమిషనర్ ఇంకా ఎవరూ అక్కడ అనుమతుల కోసం తమ వద్దకు రాలేదన్నారు.

- ఉదయగిరి రూరల్/కావలి (ఆంధ్రజ్యోతి)

మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి

- సీపీఎం నాయకుల నిరసన



నరుకూరులో మద్యం దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నరుకూరు సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా మార్చాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దుకాణం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య మాట్లాడుతూ నరుకూరు సెంటర్‌లో మద్యం దుకాణాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణానికి ఇరువైపులా దేవాలయాలు ఉన్నాయని, దీంతో భక్తులకు మందుబాబుల వల్ల ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సెంటర్ నుంచి జనవాసాలు లేని దగ్గర ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మారు బోయిన రాజా, కాల్తిరెడ్డి రవణమ్మ, పచ్చ మధు, బండిశౌరి, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవాలు


కోదండరామపురంలో గ్రామోత్సవంలో దుర్గాదేవి


మనుబోలులో కాళికాదేవి అలంకరణలో దుర్గాదేవి

మనుబోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మనుబోలులో దసరా నవరాత్రుల సందర్భగా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవిలకు సోమవారం అర్ధరాత్రి పోటాపోటీగా గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈనెల 4 నుంచి 14వతేదీ వరకు మనుబోలులో, కోదండరామపురంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. దుర్గాదేవిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజున దుర్గాదేవిని కాళికాదేవి రూపంలో భారీ గజమాలలు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రెండు చోట్ల గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మనుబోలులో అమ్మవారి లడ్డూకు వేలం పాట నిర్వహించగా కాంద్ర బ్రదర్స్ రూ.18 వేలకు, డబ్బుల మాలను పొట్టి నాగేంద్ర ప్రసాద్ రూ.24వేలకు దక్కించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు మనుబోలుకు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. జోరు వర్షమైనా ఆగకుండా నిర్వాహకులు గ్రామోత్సవాలను మంగళవారం ఉదయం వరకు వైభవంగా కొనసాగించారు. గ్రామోత్సవాల అనంతరం కలశాలను మనుబోలు పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.

మున్సిపాలిటీకే టెండర్!

- కావలిలో వైసీపీకి చెందిన ఓ నేత నిర్వాకం
- ఐదేళ్లలో సెస్ సొమ్ము రూ.70 లక్షలు స్వాహా
- రికవరీ కోసం బినామీలకు నోటీసులు

కావలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కావలిలో వైసీపీకి చెందిన ఓ నాయకుడు గడిచిన ఐదేళ్లుగా కూరగాయల, పండ్ల మార్కెట్ సెస్ వసూలు టెండర్లను బినామీల పేరుతో దక్కించుకున్నారు. తొలి ఏడాది కాంట్రాక్టర్ డీఫాల్ట్ అయితే మరుసటి ఏడాది ఆయనకు టెండర్ ఇవ్వకూడదు. అయితే, అధికార పార్టీని అడ్డుపెట్టుకుని అధికారులను మేనేజ్ చేసి సాల్వెన్స్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా రకరకాల పేర్లతో టెండర్లను దక్కించుకున్నారు. 2024-25 సంవత్సరానికి కూడా ఈ ఏడాది మార్చిలో బినామీ పేరుతో టెండర్ చేజిక్కించుకున్నారు. అయితే ఈసారి సాల్వెన్స్ సర్టిఫికెట్ తీసుకుని టెండర్ వేశారు. అయితే, వ్యాపారుల వద్ద సెస్ వసూలు చేసుకుని మున్సిపాలిటీకి చెల్లించకుండా ఎగనామం పెట్టాలనుకున్న ఆయనకు కూటమి ప్రభుత్వంలో ఆస్కారం లేకుండా పోయింది. గడిచిన ఐదేళ్లలో సెస్ వసూలు చేసిన సొమ్ముపై అధికారులు ఆరా తీయగా సుమారు రూ.70 లక్షల వరకు బకాయి ఉన్నట్టు బయట పడింది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారించగా బినామీల పేరుతో ఆ వైసీపీ నేతే టెండర్లు దక్కించుకున్నట్టు తేలింది. వెంటనే ఈ ఏడాది టెండర్‌ను రద్దు చేసి రీ టెండర్‌ను పిలిచారు.


మున్సిపల్ కార్యాలయం

అయితే, గడిచిన ఐదేళ్లలో కాంట్రాక్టులు దక్కించుకున్న బినామీల చిరునామాల ప్రకారం వారికి నోటీసులు ఇచ్చారు. అయితే, వారి పేరు మీద వైసీపీ నేతే టెండర్లు దక్కించుకున్నందున ఏం సమాధానం ఇవ్వాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. దీంతో వారందరిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

టెండరుదారులకు నోటీసులు ఇచ్చాం

కూరగాయలు, పండ్ల మార్కెట్ సెస్ వసూలుకు టెండర్లు దక్కించుకుని మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించని వారందరికీ నోటీసులు ఇచ్చాం. రిజిస్టర్ పోస్ట్ ద్వారా నోటీసులు ఇచ్చినా వారి నుంచి సమాధానం రాలేదు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి లీగల్‌గా చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నాం.

- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

వైభవంగా గంధమహోత్సవం

అనంతసాగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరంలో మంగళవారం హజరత్ మహ బూబ్‌సుబానీ గంధమహోత్సవం వైభవంగా జరిగింది. గుంతబజార్, పీర్‌సాహెబ్‌పేట, గుండంవీధి, నడివీధిలో ఉన్న దర్గాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా గంధమహోత్సవ వాహనాలను పూలతో అలంకరించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి ప్రత్యేక ఫాతెహా అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.


ప్రత్యేక వాహనాల్లో ఊరేగిస్తున్న గంధం

అనేక జీవుల శరీరాలకు ఆధారం వెన్నెముక. ప్రత్యేకించి మానవ శరీర ఆకృతిలో వెన్నెముకకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అది నిటారుగా ఉంటేనే మనిషి కూడా నిటా రుగా నిలబడ గలుగుతారు. ఈ వెన్నెముకలో ఎలాంటి సమస్య వచ్చినా అది తీవ్ర అనారోగ్యానికి దారితీస్తుంది. అయితే అవగాహన లోపం, అలక్ష్యం కారణంగా ఎంత మంది వెన్నెముక వ్యాధులకు గురవుతున్నారు. ఆధునిక జీవన విధానాలు, అలవాట్ల కారణంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 40, 50 ఏళ్ల పైబడ్డ వారికి వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువతను సైతం కలవర పెడుతోంది. పెద్దవారిలో ప్రతి 100 మంది రోగులలో ఐదు శాతం మంది తీవ్రమైన వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది మహిళలే కావడం గమనార్హం. నేటి విద్యా విధానంలో పుస్తకాల బరువుతో చిన్నపిల్లలు కూడా వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్నారు.

- నెల్లూరు వైద్యం(ఆంధ్రజ్యోతి)

వెన్నెముకే ఆధారం

- శరీరాకృతికి అది మూలం
- అలక్ష్యంతో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- జిల్లాలో 1.75 లక్షలకుపైగా బాధితులు
- నేడు ప్రపంచ వెన్నెముక వ్యాధుల నివారణ దినోత్సవం



ఆధునిక పోకడలతో రోగాలు

ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌కు బానిసలవు తున్నారు. అలాగే ల్యాప్‌టాప్, కంప్యూటర్ల దగ్గరే ఎక్కువ సేపు గడపాల్సి వస్తోంది. వీటి వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. ఒక్కోసారి మెడనొప్పితో అల్లాడిపోయే పరిస్థితి వస్తుంది. శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడంతో అనేక మంది వెన్నెముక వ్యాధుల బారినపడుతున్నారని నిపుణులు చెబుతు న్నారు. వెన్నెముకలో కండ తొలగడం(డిస్క్‌ప్రొలాప్స్), వెన్నుకు దెబ్బ తగలడం (స్పైన్‌ట్రామా), క్షయ, వెన్నులో కణితల వల్ల వెన్నుపూస వ్యాధిగ్రస్తమవుతుం ది. ఈ ప్రభావం శరీరంలోని ఇతర ప్రధాన అవ యవాలపై పడుతుంది. ముఖ్యంగా మహి ళల్లో రుతుస్రావం ఆగిపోయిన తర్వాత కాల్షియం లోపించి ఎముకలు గుల్లబారి వెన్నుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనిని ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధికి గురి కాకుండా బయటపడ వచ్చు. జిల్లాలో 1.75 లక్షల మందికిపైగా వెన్నెముక సంబంధిత వ్యాధులతో బాధపడుతు న్నారని వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులో అధునాతన వైద్యం



వెన్నెముకకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటు లో ఉన్నాయి. వెన్ను పై ఉండే కణితలను తొలగించే మైక్రో సర్జరీ విధానం కూడా ప్రస్తుతం అందుబాటులో ఉంది. అలాగే కీహోల్ సర్జరీ ద్వారా వ్యాధు లను నియంత్రించడం జరుగుతోంది. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, భవనాల పైనుంచి కిందపడటం వంటి కారణాలతో వెన్నెముక దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూర్తిగా కదలలేని పరిస్థితి వస్తుంది. 50 ఏళ్లు దాటిన మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గటం వల్ల వెన్నెముక సమస్య వస్తుంది.

- డాక్టర్ జొన్నలగడ్డ ధీరజ్, జీజీహెచ్, న్యూరో సర్జన్

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు

వెన్నెముక వ్యాధులను ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా పూర్తిస్థాయిలో నిర్ధా రణ చేసే ఆధునిక విధానం అందుబాటులోకి వచ్చింది. మైక్రోసర్జరీ ద్వారా వెన్నులో కణితలు తొలగించడం మంచి ఫలితాలిస్తోంది. విరిగిన వెన్ను స్థానంలో కృత్రిమ వెన్నెముకను అమర్చి దీర్ఘకాలిక సమ స్యలను సైతం నిపుణులు పరిష్కరిస్తున్నారు. విరిగిన కొన్ని విభాగాలను స్క్రూలతో బిగించి సరి చేసే విధానమూ అందుబాటులో ఉంది. అయితే అన్ని రకాల వెన్ను వ్యాధులకు ప్రభు త్వ వైద్య పథకాలు వర్తించకపోవడంతో వ్యాధిగ్రస్తులైన పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

గ్రామాల్లో మద్యం చిచ్చు రేపొద్దు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసి చిచ్చురేపొద్దని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెం కటయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మా ట్లాడారు. ప్రశాంతతకు మారుపేరైన గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేసి వివాదాలకు అజ్యం పోయవద్దన్నారు. అదే జరిగితే సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, లక్ష్మీనరసయ్య, రమణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

21కి పల్లెపండుగ వాయిదా

సీతారామపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమం సీతారామపురం మండలంలో ఈ నెల 18వ తేదీ జరగాల్సి ఉండగా, 21కి వా యిదా వేస్తున్నట్లు టీడీపీ మండల ప్రధా న కార్యదర్శి పిడుగు రమేష్ మంగ ళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో ట్రైకోడెర్మావిరిడి

లింగసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల రైతుసేవా కేంద్రాలకు 105 కేజీల ట్రైకోడెర్మావిరిడి మందు వచ్చినట్లు వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ తెలిపారు. మంగళవారం మొగిలిచెర్ల, ముత్యాలపాడులో పొలంపిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో మొగిలిచెర్ల పశుసంవర్ధక శాఖ జూని యర్ వెటర్నరీ రమణమ్మ, మార్కెటింగ్ శాఖ సహాయకులు, వీఏఏలు ప్రేమ్ బాబు, దీప పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి

కొండాపురం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సులతో భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆదర్శ పాఠశాల వొకేషనల్ కోర్సు కో ఆర్డినేటర్స్ డి.మల్లికార్జున, డి.ప్రాన్సిస్‌లు తెలిపారు. సమగ్ర శిక్ష మరియు పీఎమ్ (శ్రీ) లెగ్నెట్ వారి ఆధ్వర్యంలో ఆటో మోటివ్ వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణను పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్ బాషా పర్యవేక్షించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బిట్రగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురం కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆగమ పండితులు వినోద్‌కు మార్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ధ్వజ కుంబారాధన, సుదర్శన హోమం, క్షీరాధివాస కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకులు పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు ఉభయ కార్యకర్తలుగా వ్యవహరించారు.

కందుకూరు అభివృద్ధి మండలి సమావేశం



కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి మండలి సమావేశం మంగవారం స్థానిక ఆదిత్య హోటల్‌లో మాజీ శాసనసభ్యులు దివి శివరాం అధ్యక్షతన జరిగింది. రామాయపట్నంలో ఉద్యోగ అవకాశాలు, నింజాల్లో ఉద్యోగ అవకాశాలు, రాళ్లపాడు ప్రాజెక్టు తాగు, సాగు నీరు, గ్రామాల్లో రోడ్లు నిర్మాణం ఇతర సౌకర్యాలపై అభివృద్ధి మండలి సభ్యులు సమావేశంలో చర్చించారు. ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్‌లతో చర్చించి వారి సహాయ సహకారాలతో ముందుకు వెళ్లాలని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం అభివృద్ధి మండలి పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాజీ శాసన సభ్యుడు డాక్టర్ దివి శివరాం, ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ, పాలేటి కోటేశ్వరరావు, కార్యదర్శిగా నేతి మహేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బొక్క వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, కోశాధికారిగా మాధవరావు, సభ్యులుగా పులిచర్ల వెంకట సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధులుగా రావుల కొల్లు వెంకటేశ్వర్లు, ముప్పవరపు కిషోర్ లు ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ మిస్సైల్ మ్యాన్‌గా, పోఖ్రాన్ అణు పరీక్షల పితామహుడిగా ఖ్యాతి గడించిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రక్షణ రంగంలో దేశం కోసం ఆయన సాధించిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ అధ్యక్షుడు షేక్ సలాం, షేక్ మా బాష, రెహమాన్, రూబీ, మున్నా, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ శ్రీధర్‌కు పురస్కారం

కావలి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్పీ శ్రీధర్‌కు జిల్లాస్థాయి జాతీయ రక్తదాన దినోత్సవ పురస్కారాన్ని కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంగళవారం పురస్కారం అందజేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో రక్తదాన శిబిరాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.

ఆక్రమణలో రోడ్లు.. ట్రాఫిక్ పాట్లు



వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు

వలేటివారిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండు సెంట రులోని మూడు రోడ్ల కూడలిలో నెలకొంటున్న ట్రాఫిక్‌తో నిత్యం ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్లపైనే నిలుతున్నారు. రోడ్లకు రెండు వైపులా ఉన్న దుకాణాదారులు రోడ్లను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై రేకులషెడ్లు వేసుకున్నారు. అంతేగాకుండా తమ దుకాణాలు ముందు ఎత్తుగా మట్టి తోలుకోవడంతో వర్షం నీళ్లు రోడ్డుపైనే నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీళ్లలోనే వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. ప్రయాణికులకు కనీసం రోడ్డుపైన నిలబడే అ వకాశం లేకుండా పోయింది అంటే పరిస్థితి ఎలా ఉందో మీరే అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో జామాయిల్ ట్రాక్టర్లు, చిల్లకర్ల లారీలు, వరిగడ్డి లారీలు, ట్రాక్టర్లు జోరుగా తిరుగుతుం టాయి. ఈ సమయంలో బస్సులు

పట్టించుకోని అధికారులు

ఎదురుగా వస్తే ప్రక్కకు వైదొలిగే అవకాశం లేక గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. అంతేగాకుండా ఆటోలు మూడు రోడ్ల కూడలిలో దివి కొండయ్య చౌదరి విగ్రహం వద్ద నిలప డంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం, పండుగ సమ యాల్లో చికెన్, మటన్ దుకాణుదారులు రోడ్డుపైనే నిర్వహించడంతో రోడ్డం తా జనంతో కిక్కిరిసిపోతుంది. చికెన్ మటన్ కోసం వచ్చే జనం ద్విచక్ర హనాలను, కార్లను రోడ్డుపై నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు రోడ్డుపైనే చేపల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం మాలకొండ పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు బస్టాండు సెంటరు ప్రయాణికులతో కిక్కిరిసిపో తుంది. ఆ రోజు ట్రాఫిక్ కష్టాలు చెప్పనలవికాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులు, సన్నజీవాలు పొలాలకు వెళ్లే సమయంలోనూ పొలాల నుండి సాయంత్రం ఇంటికి వచ్చే సమయాల్లో రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు చూసీచూనట్లుగా వెళుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

సంగమేశ్వరాలయ హుండీల లెక్కింపు

సంగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ హుండీలను దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. గర్భగుడి వద్ద ఏర్పాటు చేసిన రెండు హుండీల నుంచి ఆరు నెలల కాలానికి సుమారు రూ. 37,734లు భక్తుల నుంచి కానుకలు వచ్చా యి. ఈ మొత్తం నగదును బ్యాంకు ఖాతా లో జమ చేయనున్నట్లు ఈవో చైతన్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గోపాలకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగతో కొత్త వెలుగులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో కొత్త వెలుగులు సంతరించుకొంటున్నాయని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు పేర్కొన్నారు. మంగళవారం నర్రవాడలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. పల్లెపండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.

సీతారామపురం(ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసా యాధికారి పీ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలంగారి పల్లి గ్రామంలో సాగు లో ఉన్న వరి పొలలను సందర్శించారు. వరిలో ఆకుముడుత పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు క్లోరోపైరిపాస్ పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట సుబ్బయ్యఏఎంసీ యార్డు అసిస్టెంట్ చిరంజీవి, ఏహెచ్‌ఏ శ్వేత, వీఏఏలు లక్ష్మీనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

వృద్ధుడికి సీఐ సాయం

ఏఎస్ పేట (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 15: నిస్సాయస్థితిలో ఉన్న వృద్ధుడికి సంగం సీఐ సాయం చేశారు.మంగళవారం గుడిపాడుకు వచ్చి తిరిగి వెళుతుండగా పెద్దఅబ్బీపురం గ్రామ సమీపంలో వర్షంలో ఓ వృద్ధుడు రోడ్డు పక్కన స్పృహ తప్పి పడి ఉండడం గమనించిన ఆయన కారు దిగి ప్రత్యేక వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

వెంటాడుతున్న తుఫాన్ ముప్పు

● సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రాంతవాసుల తరలింపు ● వాగులు, వంతెనల వద్ద పోలీసుల పహారా



తుమ్మలపెంట రోడ్డులో చప్టాలపై పారుతున్న నీటి వద్ద భద్రతగా రూరల్ సీఐ, సిబ్బంది

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఆర్డీవో పావని ఆ దేశాలతో రెవెన్యూ అధికారులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో మంగళవారం ఉదయం ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతరం కాస్త తెరపిచ్చింది. ముందస్తుగా ముంపు ప్రాంతవాసులను సురక్షిత ప్రదేశాలకు, పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆత్మకూరు, అనంతసాగరం మండల్లాలోని నాలుగు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మండలం బండారుపల్లి, అప్పారావుపాళెం, కరటంపాడు, అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో 160 మం దిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

తుపాన్ ప్రభావంతో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో బీ.పావని తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచే ఆమె మంగళవారం డివిజనల్ స్థాయి అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. ప్రాణ, ఆస్తి, పంట నష్టం సంభవించినా, ప్రజలకు ఇబ్బందకర పరిస్థితులు ఎదురైనా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆమె ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతాలైన వీర్లగుడిపాడు, అప్పారావుపాళెం, కొత్తపాళెం తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

● ఉదయగిరిలో 49.6 మి.మీ వర్షపాతం

ఉదయగిరి రూరల్: తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు 49.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమైనా చినుకు రాలలేదు.

● ఎస్టీ కాలనీని సందర్శించిన తహసీల్దారు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మంగళవారం నర్రవాడ ఎస్టీ కాలనీని తహసీల్దారు నాగరాజు సిబ్బందితో సందర్శించారు. వర్షాలతో కాలనీవాసులు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు అధికమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

● డీఎస్పీ వాగులు,వంతెనల పరిశీలన

ఏఎస్‌పేట: మండలంలోని వాగులు, వంతెనలను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున వాగులు పొంగి రోడ్డుపైకి నీటి ప్రవాహం వచ్చే ఆవకాశం ఉన్న గుడిపాడు బీరాపేరు వాగు వంతెన,ఏఎస్ పేట సమీపంలోని నక్కల వాగు వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో సంగం సీఐ వేమారెడ్డి,ఎస్ఐ సైదులు,తదితరులు పాల్గొన్నారు.

● పెన్నా ముంపు ప్రాంతం పరిశీలన

సంగం: మండలంలో పెన్నా ముంపు ప్రాంతమైన అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీని తహసీల్దారు సోమ్లానాయక్ మంగళవారం పరిశీలించారు. భారీ వరద వచ్చి పెన్నా ఉప్పొంగితే అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలోకి నీరు చేరే అవకాశం ఉంది. తహసీల్దారు కాలనీవాసులతో మాట్లాడారు. ఆయన వెంట వీఆర్వో కుమార్ ఉన్నారు. వంగల్లు కలుజును డీఎస్పీ వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. చవిటివాగుపై ఉన్న కలుజును కూడా పరిశీలించారు. కలుజుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐ వేమారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

● మర్రిపాడు చెరువుకు రక్షణ చర్యలు

మర్రిపాడు చెరువు తూము వద్ద బలహీనంగా ఉన్న చెరువు కట్టకు మంగళవారం రక్షణ చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలతో రింగ్‌బండ్‌గా వేశారు. ఈ పనులను ఏఈ వినయ్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జలదంకి: తుపాను ప్రభావం ఉండటంతో అన్ని గ్రామాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమీల తెలిపారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలో గుడిసెల్లో నివసిస్తున్న వారి ఇళ్లు పరిశీలించి జాగ్రత్తలు తెలిపారు. అనంతరం జలదంకి పెద్దచెరువును జలవనరుల శాఖ ఏఈ రామారావుతో కలసి పరిశీలించారు. ఈమె వెంట ఆర్ఐ శ్రీజ, వీఆర్వో గిరి, టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, స్థానిక రైతులు ఉన్నారు.

● నిరుపేదలకు ఆహార పొట్లాలు

లింగసముద్రం: తిమ్మారెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో తుఫాను బాధితులకు టీడీపీ నేత నీలం బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది ఆహార పొట్లాలు అందజేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, సర్వేయరు శివప్రసాద్ పాల్గొన్నారు.

కలిగిరి: వరద ముంపులో ఉన్న స్థానిక వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలో మంగళవారం పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని పారిశుధ్య కార్మికులతో కాలువలు తవ్వించి నీటిని తరలిం చా రు. స్థానిక పీహెచ్‌సీ నుం డి వచ్చిన వైద్య సిబ్బంది కాలనీవాసులకు జాగ్రత్త లు వివరించి మందు లు అందజేశారు. పాలకులు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పుల్లా వేమ నారాయణ, పుల్లా రవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఇస్కపల్లి తీరంలో పోలీసుల పర్యవేక్షణ

అల్లూరు: తుఫాన్ నేపథ్యంలో కావలి రూరల్ సీఐ పాపారావు, అల్లూరు ఎస్ఐ కిషోర్‌బాబులు సోమవారం తీరప్రాంత గ్రామాలు ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాల్లో పర్యవేక్షించారు. పరిస్థితులను పరిశీలించడంతో పాటు స్థానిక మత్స్యకారులతో కలసి పలు సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టరు, ఎస్పీల ఆదేశాల మేరకు సముద్రంలోకి వెళ్లకూడదన్నారు. అనంతరం ముంగమూరు, జువ్వలదిన్నె, తాటిచెట్లపాలెంతో పాటు ఇస్కపల్లి, గోగులపల్లి కల్వర్టులను పరిశీలించారు.

కావలి: ఆర్డీవో ఎం.వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు మర్రిచెట్టు సంఘం, మందాడిచెరువు ప్రాంతాలను పరిశీలించారు. కొందరిని ముసునూరు హైస్కూల్, రామమూర్తిపేట మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే పెంకుల ఫ్యాక్టరీ గిరిజన సంఘం ప్రాంతవాసులను వైకుంఠపురం మున్సిపల్ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అన్నపుగుంట ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్పపీడన ప్రభావం రెండు రోజులు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పేపాలవారిపాలెంలో సోమవారం రాత్రి విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఈ సమస్యతో గామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామ టీడీపీ నాయకులు పేపాల కోటేశ్వ రరావు, రమేష్‌లు వెంటనే కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు స్పందించిన విద్యుత్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి తమ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకుని పడిపోయినస్తంభం స్థానంలో మరొకటి ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరించడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

● పునరావాస కేంద్రాలకు తరలింపు

భారీ వర్షాలకు నీట మునిగిన మన్నేటికోట గ్రామం తిరుపతి కుంట ఎస్టీ కాలనీవాసులను స్థానిక ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో గ్రామంలోని జీవీఆర్ ఎస్టీ సంఘంలోని తుఫాన్ షెల్టర్‌కు తరలించారు. పునరావస కేంద్రంలో మంచి నీరు, విద్యుత్ సదుపాయం, భోజన వసతికి తగిన ఏర్పాట్లు కల్పించినట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధి లోని గడ్డంవారి కొస్టాలు, 1,2వ వార్డులోని యానాది కాలనీ, పుట్ట ప్రాంతంలోని నివాస గృహాలలోకి వర్షం నీళ్లు చేరాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే 200 మంది బాధితులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, వడ్డెల్ల రవిచంద్ర పాల్గొన్నారు.

బిట్రగుంట: ముంగమూరు, జువ్వలదిన్నె,బంగారుపాలెం, ఏనుగులబావిలో రూరల్ సీఐ పాపారావు పర్యటించారు. తాటిచెట్లపాలెం ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఇస్కపల్లి మత్స్య కారులను కలిసి సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు స్థానిక ఎస్ఐ భోజ్యా, అల్లూరు ఎస్ఐ కిశోర్ బాబు, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఉన్నారు. తహసీల్దారు సురేష్‌బాబు ఎస్సీ పాలెం, జువ్వలదిన్నె, సీఆర్‌పాలెంలో తిరిగారు.



ఆత్మకూరు : అప్పారావుపాళెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న గిరిజన కాలనీవాసులు



ఆత్మకూరు : అప్పారావుపాళెం కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



సంగం : ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ వినయ్‌కుమార్

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

● రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం ● ఘనంగా జయంతి వేడుకలు



కావలి టౌన్: నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు తదితరులు

కావలి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి కొనియాడారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్ నాయుడు పీఎస్సార్ ట్రస్ట్ ఆసుపత్రిలో స్వచ్ఛంద సంస్థ ల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, వివిధ సంస్థల నిర్వాహకులు ప్రసాదరావు, అజిత్‌బాబు, సురేంద్ర, మధుసూధన్‌రావు, కిరణ్‌కుమార్, నందిపాటి రమేష్, మాలకొండారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ రక్తనిధి సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం సభ్యులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, యోగా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది ఏపీ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య తెలిపారు. విశ్వనాథరావుపేట పంచా యతీ ఇబ్రహీం పేటలోని కలాం విగ్రహా నికి పూల మాలు వేసి నివాళుల ర్పిం చారు. బహుముఖ ప్రజ్ఞా శాలి, రచయిత, గొప్ప శాస్త్రవేత అబ్దుల్ కలాం భారతీయుడు కావడం మనం చేసుకున్న అదృష్టమని బిట్రగుంట రైల్వే అభి వృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ చెప్పారు. చంద్ర, రాజేష్, షకీల్, ఓంశ్రీనాయుడు, బాషా, రవి పాల్గొన్నారు.



బిట్రగుంట: పూలమాల వేస్తున్న వెంకట రమణయ్య

పంచాయతీల అభివృద్ధికి నిధుల మంజూరు : కాకర్ల



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



శిలాఫలకం ఆవిష్కరణలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

వరికుంటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 2.36కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగలో భాగంగా నార్తుకొండాయపాళెం, ఎస్సీకాలనీల్లో రూ. 8.40లక్షలు, కనియంపాడులో రూ. 7లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యంగా మారిందన్నారు. త్వరితగతిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయించి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ నాయకుల చేతుల్లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తానని హామీ నిచ్చారు. అనంతరం నార్తుకొండాయపాళెం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నేత ముజ్జె లక్ష్మీనారాయణ సొంత నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. తొలుత ఛత్రపతి శివాజీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దారకానిపాడు, దప్పళంపాడులో..

గుడ్లూరు: దారకానిపాడు, దప్పళంపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శిలా ఫలకాలను ఆవిష్కరించారు. దారకానిపాడులో పంచాయతీ నుంచి బీసీ కాలనీలోకి రోడ్డు నిర్మాణానికి రూ.10.93లక్షలు, దప్పళంపాడులోని పనులకు రూ.10లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సీసీ రోడ్లను గ్రామాల్లో గుర్తించి, ఎక్కడ మట్టిరోడ్లు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ గంగాభవాని, కందుకూరు ఏపీడీ బాబురావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు స్వర్ణ, హౌసింగ్ ఏఈ వెంకటే శ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘవులు, జంపని ప్రసాద్, జనసేన నాయకులు సన్నిశెట్టి గిరిబాబు పాల్గొన్నారు.

గొర్రెల దొడ్డిగా బల్క్‌మిల్క్ భవనం



కూనిపాలెంలో ఊరికి దూరంగా బల్క్ మిల్క్ సెంటరు నిర్మాణం చేపట్టారు. నిధులు లేక పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. వీటిని గ్రామస్థులు గొర్రెలు దొడ్డి ఏర్పాటు చేశారు. మరికొంతమంది ఇందులో వ్యవసాయ పనిముట్లు వేసుకున్నారు. అంతేగాకుండా పొగాకు సీజన్‌లో పొగాకు నిల్వ చేస్తున్నారు. మహిళా సాధికారతను బలోపేతం చేసేందుకు గత వైసీ పీ ప్రభుత్వం గ్రామాల్లో పాలవెల్లువ కేంద్రా లను నిర్మించింది. అయితే కేంద్రాలకు పూర్తిస్థా యిలో బిల్లులు చెల్లించకపోవంతో గుత్తేదార్లు పాలవెల్లువ కేంద్రాల పనులు నిలి పివేశారు. సంబంధిత అధికారులు స్పందించి వీటి నిర్మా ణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుక రావాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం